# దారి దీపం

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

మాసపత్రిక

సంపుటి 3 - సంచిక 6 | మార్చి 2025 | వెల : రూ.15



నియోజకవర్గాల పునర్విభజన ఆధిపత్యానికి బీజేపీ వ్యూహం

రెండు అభివృద్ధి పంథాలు

ఎగవేత భారతం

పెట్టుబడిదారీ వ్యవస్థకు ట్రంప్ చికిత్స !

బీజేపీ మెజారిటేరియన్ వాదం

ఆర్ఎస్ఎస్ భారత్ పాలిట రాచపుండే

మొఘల్ చక్రవర్తులకు జన్మనిచ్చిన హిందూ స్త్రీలు

పెద్దయ్యాక ఏమవుతావంటే.. భగత్‌సింగ్

విస్మరించరానిది గాంధీ జాతీయోద్యమ చరిత్ర

నియోజకవర్గాల పునర్విభజనకు పాత పద్ధతే మేలు

గ్రోక్ : మర్మం విప్పుతున్న మాయాపేటిక..!

హిందీ 'తెలుగు దేశ' భక్తి : భాషపై ఎందుకీ కార్చిచ్చు ?

వెనుకబడిన ప్రాంతం ఉత్తరాంధ్ర

పర్యావరణంపై మార్క్స్

ఉపద్రవంగా మారుతోన్న విజ్ఞానోన్మాదం!

కొత్త ఆలోచనల దారులు పరచిన పథికుడు

ఇది మామూలు నవల కాదు

సమ సమాజానికి దిక్సూచి కార్ల్ మార్క్స్

పౌరసమాజం-ఆధిపత్యం-గ్రాంస్కీ

మార్చి - 2025
పేజీలు : 46

# దారి దీపం

మాసపత్రిక

సంపుటి : 3 - సంచిక : 6

డీవీవీఎస్ వర్మ
- సంపాదకులు

సంపాదక వర్గం
కొప్పర్తి వెంకటరమణమూర్తి
మందలపర్తి కిషోర్
డి.సోమసుందర్
డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

## ఈ సంచికలో..

1) నియోజకవర్గాల పునర్విభజన ఆధిపత్యానికి బీజేపీ వ్యూహం - సంపాదకీయం 3
2) రెండు అభివృద్ధి పంథాలు - ప్రభాత్ పట్నాయక్ 4
3) ఎగవేత భారతం - ఎసూరి 6
4) పెట్టుబడిదారీ వ్యవస్థకు ట్రంప్ చికిత్స ! - సి.పి.చంద్రశేఖర్ 7
5) బీజేపీ మెజారిటేరియన్ వాదం - ముకుల్ కేశవన్ 9
6) ఆర్ఎస్ఎస్ భారత్ పాలిట రాచపుండే : తుషార్‌గాంధీ 10
7) మొఘల్ చక్రవర్తులకు జన్మనిచ్చిన హిందూ స్త్రీలు - బొల్లోజు బాబా 11
8) పెద్దయ్యాక ఏమవుతావంటే.. భగత్‌సింగ్ - అల్లు రాజు 15
9) విస్మరించరానిది గాంధీ జాతీయోద్యమ చరిత్ర - జి.భార్గవ 16
10) నియోజకవర్గాల పునర్విభజనకు పాత పద్ధతే మేలు.. అఖిలపక్ష భేటీ తీర్మానం 17
11) గ్రోక్ : మర్మం విప్పుతున్న మాయాపేటిక..! - సామశ్రీ సర్కార్ 19
12) హిందీ 'తెలుగు దేశ' భక్తి : భాషపై ఎందుకీ కార్చిచ్చు ? - మాడభూషి శ్రీధర్ 22
13) వెనుకబడిన ప్రాంతం ఉత్తరాంధ్ర - ఎ.అజశర్మ 27
14) పర్యావరణంపై మార్క్స్ 30
15) ఉపద్రవంగా మారుతోన్న విజ్ఞానోన్మాదం! - డా.విరించి విరివింటి 31
16) కొత్త ఆలోచనల దారులు పరచిన పథికుడు - వకుళాభరణం రామకృష్ణ 35
17) ఇది మామూలు నవల కాదు - జి.రాజశుక 37
18) సమ సమాజానికి దిక్సూచి కార్ల్ మార్క్స్ - డివియస్ వర్మ 38
19) పౌరసమాజం-ఆధిపత్యం-గ్రాంస్కీ - ప్రొ కె.శ్రీనివాసులు 40
20) కార్టూన్స్ 45
21) కొత్త పుస్తకాల స్వీకారం 46




కార్టూన్ : సతీష్ ఆచార్య ఫేస్‌బుక్ సౌజన్యంతో..

దారి దీపం
మాసపత్రిక
మీ విరాళాలను ఈ క్రింది అకౌంట్‌కు పంపండి

**Daari Deepam**
Union Bank of India
Branch : TANUKU
**A/C No : 0554 1101 0000 054**
**IFSC code : UBIN0805548**

మీ పేరు విరాళం వివరాలను.. డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు నంబరుకు విధిగా వాట్సాప్ మెస్సేజ్ పెట్టండి. ఫోన్ నెంబరు 93971 14495

వివరాలకు సంప్రదించండి : డా॥ బి.రమేష్ చంద్రబాబు, 34-15-1, దొడ్డిపట్ల వారి తోట వీధి, తణుకు - 534211, ప.గో.జిల్లా, ఏపీ ఫోన్ : 93971 14495

దారి దీపం గత సంచికల కోసం : **DVVSVARMA.COM**



# నియోజకవర్గాల పునర్విభజన ఆధిపత్యానికి బీజేపీ వ్యూహం

బీజేపీ సంఘ పరివారాలకు ఒక ప్రత్యేకమైన రాజకీయ కళ వుంది. అది కేవలం ప్రచార కళ మాత్రమే కాదు. అదొక రాజకీయ వ్యూహం. అదనుచూసి ఏదో ఒక వివాదాస్పద అంశాన్ని తెరమీదకు తెస్తారు. దానిచుట్టూ రాజకీయ చర్చను మళ్లిస్తారు. ప్రజలను ఆ దారిలో ఆలోచింపజేస్తారు. ఇది ప్రజల నిత్య జీవిత సమస్యలపై సాగేచర్చ కాదు. వీటి నుంచి వారి దృష్టిని మళ్లించే ప్రయత్నం మాత్రమే. అధిక ధరలు, నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభాలన్నింటికి 2047 నాటికి చేరుకునే వికసిత భారత్‌లో పరిష్కారాలు చూపిస్తారు. దూరపుకొండలు నునుపు అన్నట్టు మనకు అందని సుదూర భవిష్యత్‌లో బంగారు కలలు కనిపించేలా చూపిస్తారు. అప్పటి వరకు ఎవరు ఉంటారు? ఎవరు పాలిస్తారు ? అన్న తర్కానికి తావు లేకుండా ఊదరకొడతారు.

అనునిత్యం వారు లేవనెత్తే సమస్యలు మత విద్వేషాన్ని రెచ్చగొట్టేవి. ప్రాంతీయ విభేదాలు పెంచేవి. భాషాపరమైన, సాంస్కృతిక పరమైన అంతరాలను పెంచేవిగా, దేశ ప్రజల ఐక్యతకు విఘాతం కలిగించే అంశాలే వుంటాయి. ఈ విభజన రాజకీయాల నుంచి లబ్ధి పొందే ప్రయత్నాలు వుంటాయి. ఇటీవల హిందీ జాతీయ భాష అన్నారు. దక్షిణాది రాష్ట్రాలు హిందీని నేర్చుకోవాలన్నారు. వాస్తవానికి కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే హిందీ అధికార భాష. ఇంగ్లీష్ కూడా ! దేశంలో హిందీతో సహా మిగిలిన భాషలన్నీ సమానమే. కాని, బీజేపీ లక్ష్యం దక్షిణాది రాష్ట్రాలు హిందీ వ్యతిరేకులుగా చూపించడం, హిందీ ప్రాంతంలో తమ ప్రాబల్యాన్ని పెంచుకోవడం.

ఇప్పుడు పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజన సమస్యను ముందుకు తెచ్చారు. ఇది కేవలం దేశ రాజకీయాలలో వివిధ రాష్ట్రాల బలాబలాలకు సంబంధించిన సమస్య. 2026 జనగణన తర్వాత పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజన చేస్తే వచ్చే ఫలితాలపై నిపుణులు అంచనాలు వస్తున్నాయి. జనాభా ప్రాతిపదికన ఆయా రాష్ట్రాలకు నియోజకవర్గాల సంఖ్యను నిర్ణయిస్తే కేరళ 8 స్థానాలను, తమిళనాడు 8, కర్ణాటక 2 , ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 8 స్థానాలను కోల్పోతాయి. హిందీయేతర రాష్ట్రాలుగా వున్న బెంగాల్ 4, పంజాబ్ 1, ఒడిశా 3 స్థానాలను కోల్పోతాయి. మరోపక్క ఉత్తరప్రదేశ్‌కు అదనంగా 11 స్థానాలు, బిహార్‌కు 10, రాజస్థాన్‌కు 6, మధ్యప్రదేశ్‌కు 4 స్థానాలు పెరుగుతాయి. దీని పర్యవసానాలు ఆందోళన కలిగించేవిగా ఉన్నాయి.

మన పార్లమెంట్‌లో 543 స్థానాలున్నాయి. ఇందులో ప్రస్తుతం హిందీ రాష్ట్రాలకు వున్న 226 స్థానాలు 259కి పెరుగుతాయి. అలాగే 132 స్థానాలు వున్న దక్షిణాది రాష్ట్రాలు, ఇతర హిందీయేతర రాష్ట్రాల స్థానాలు గణనీయంగా తగ్గిపోతాయి. దేశంలో కీలకమైన రాజ్యాంగ సవరణలు ఏకపక్షంగా హిందీ రాష్ట్రాలు చేసుకుపోయే పరిస్థితి ఏర్పడుతుంది. ఇది దేశ సమైక్యతకు, తీవ్రమైన హాని చేసేది అవుతుంది. 1975లో ఆ తర్వాత 2002లో నియోజకవర్గాల పునర్విభజన చేసినప్పుడు ఆయా రాష్ట్రాలకు నిర్ణయించిన లోక్‌సభ స్థానాలను సంఖ్య లను యథాతథంగా వుంచి పునర్విభజన చేశారు. ఇప్పుడు అదే పద్ధతిని పాటించాలి. కాని, బీజేపీ పరివారం రాజకీయం దీనికి భిన్నంగా వుంది. తమకు రాజకీయంగా పట్టువున్న హిందీ రాష్ట్రాల ఏకఛత్రాధిపత్యాన్ని దేశం మీద రుద్ది రాజకీయంగా బలపడాలనే ఆధిపత్య ధోరణికి అద్దం పడుతోంది. ఇది మన ప్రజాస్వామ్యానికి, దేశ సమైక్యతకు హాని చేస్తుంది. ❑

- డీవీవీఎస్ వర్మ
సంపాదకులు, 85006 78977

# రెండు అభివృద్ధి పంథాలు



- ప్రభాత్ పట్నాయక్

నయా ఉదారవాద విధానాల అమలుకు పూర్వ కాలంలో వ్యవసాయ రంగంలో ఉత్పత్తి అభివృద్ధి రేటు ఎంత ఉండేదో అంతకన్నా ఎక్కువ అభివృద్ధి రేటు నయా ఉదారవాద కాలంలో సాధించడం జరిగిందని ఎవరూ చెప్పుకోలేరు. అప్పటికన్నా ఎంతో కొంత తగ్గిందే తప్ప పెరిగింది ఏమీ లేదు. కాని మరోవైపు జీడీపీ వృద్ధి రేటు మాత్రం గణనీయంగా పెరిగినట్టు అంచనాలు ఉన్నాయి. కొంతమంది ఆర్థికవేత్తలు ఈ జీడీపీ వృద్ధి రేటును ఉన్న దానికన్నా ఎక్కువగా పెంచి చూపించారని వాదిస్తున్నారు. ఏదేమైనా, అంతకు పూర్వపు కాలంలో కన్నా నయా ఉదారవాద కాలంలో జీడీపీ వృద్ధిరేటు ఎక్కువగానే ఉందని అంగీకరిద్దాం.

1990కన్నా ముందు కాలంలో ఆహారధాన్యాల ధరలు నిరంతరం పెరుగుతూ వుండేవి. వాటిని అదుపు చేయడానికి ధరలను నియంత్రించే చర్యలు తీసుకుంటూ వుండేవారు. అంటే ఆ కాలంలో ఆహారధాన్యాల ఉత్పత్తికన్నా వాటికి డిమాండ్ ఎక్కువగా ఉండేదన్న మాట. కాని, నయా ఉదారవాద కాలంలో ప్రభుత్వం ప్రతీ ఏడాదీ ఆహారధాన్యాల అదనపు నిల్వలను ఏ విధంగా నిర్వహించాలన్న సమస్యను ఎదుర్కొంటూ వస్తోంది. పౌర సరఫరాల వ్యవస్థ ద్వారా పంపిణీ చేసిన ఆహార ధాన్యాల కన్నా ఎక్కువగా ధాన్యం సేకరణ జరుగుతూ వస్తోంది. పైగా ఇండియా ఆహార ధాన్యాలను ఎగుమతి కూడా చేస్తోంది. 2023-24లో 1040 కోట్ల డాలర్ల విలువైన బియ్యాన్ని ఎగుమతి చేసింది.

ఒకవైపు తలసరి ఆదాయాలు వృద్ధి చెందుతూంటే మరోవైపు ఆహారధాన్యాల వినియోగం తగ్గిపోవడాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలి? నయా ఉదారవాద సమర్థకులకు ఈ ధోరణి పెద్దగా ఆశ్చర్యం కలిగించదు. ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగు పడినా, అలా పెరిగిన ఆదాయాన్నంతటినీ ఆహారం కోసమే ఖర్చు చేయరు. కనుక వారి ఆదాయాలతో పోలిస్తే ఆహారం కోసం చేసే ఖర్చు శాతం తగ్గుతుందని వారు వివరిస్తారు. ఆహార ధాన్యాల మార్కెట్‌లో మిగులు ఉండడం అంటేనే నయా ఉదారవాద వ్యవస్థలో అన్ని తరగతుల ప్రజలూ మెరుగైన జీవితాలను గడుపుతున్నట్టు లెక్క అని వారంటారు.

వాళ్లు చెప్పే ఈ వాదనకు వాస్తవాలకు ఏ మాత్రమూ సంబంధం లేదు. ఆదాయాలు పెరిగినప్పుడు అందులో ఆహారం కోసం చేసే ఖర్చు శాతం తగ్గవచ్చు కాని ప్రజలు స్వీకరించే ఆహారం పరిమాణం తగ్గిపోదు కదా? ప్రాసెస్డ్ ఫుడ్‌ను, మాంసాహారాన్ని (కోళ్లకు, పశువులకు పెట్టే మేతతో కలుపుకుని) కూడా పరిగణనలోకి తీసుకుని లెక్కిస్తే అటు గ్రామాల్లో గాని, ఇటు పట్టణాల్లో కాని ప్రజలు తీసుకునే తలసరి ఆహారం యొక్క కేలరీల విలువ తగ్గిపోయింది. 2200 కేలరీల చొప్పున తలసరి కనీసస్థాయిలో ఆహారాన్ని తీసుకోలేకపోయిన వారు 1993-94లో 58 శాతం ఉంటే వారు 2017-18 నాటికి 80 శాతానికి చేరుకున్నారు. అంటే వారి ఆదాయాలు కుదించి వేయబడ్డాయి. ఇదే విషయాన్ని ప్రపంచ ఆకలి సూచిక నుండి జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే వరకూ స్పష్టం చేస్తున్నాయి (ఈ సర్వే ప్రకారం మహిళల్లో రక్తహీనత చాలా ఆందోళనకర స్థాయికి చేరింది).

మన ముందు రెండు రకాల అభివృద్ధి పంథాలు ఉన్నాయి.

**మొదటిది :** ప్రభుత్వ నియంత్రణలో ఆర్థిక వ్యవస్థ నడిచే విధానం. ఇది నయా ఉదారవాదానికి ముందు అనుసరించిన విధానం. ఈ విధానం అమలులో ఉన్నప్పుడు ప్రజలు కోరిన మేరకు ఆహారధాన్యాలను సరఫరా చేయలేని స్థితి ఉండేది. ఆ కాలంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి వృద్ధి రేటు మొత్తం వృద్ధి రేటును ప్రేరేపించగలిగేంత ఎక్కువగా లేదు. ఆహార ధాన్యాలకు ఉన్న డిమాండ్‌కు అనుగుణంగా ధరలు పెరిగేవి. అది ద్రవ్యోల్బణానికి దారి తీసేది. వ్యవసాయ రంగంలో వృద్ధిరేటును మొత్తం ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటును ప్రేరేపించగలిగేంత స్థాయిలో పెంచలేకపోవడం ఈ విధానంలో ఉన్న సమస్య. ఈ విధానం అనుసరించిన కాలంలో మన ఆర్థిక వ్యవస్థను పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు మిశ్రమ ఆర్థిక వ్యవస్థ అని పిలిచేవారు. ఇక్కడ సమస్య పెట్టుబడి తగినంత లేకపోవడం అనేది కానే కాదు. భూపంపకం సమూలంగా జరగకపోవడమే.

**రెండోది :** ఈ అభివృద్ధి విధానం నయా ఉదారవాద విధానం. ప్రస్తుతం అమలు జరుగుతున్నది ఇదే. ఇందులో ఆహార ధాన్యాల మిగులు ఉన్నది. ఇక్కడ వృద్ధి రేటు పెరగకపోవడానికి ప్రధాన ఆటంకం ఎగుమతులు పెరగకపోవడమే. అంతర్జాతీయ మార్కెట్‌లోకి తన సరుకులను ఎక్కువగా అమ్ముకోగలిగితే. వీలైతే తక్కిన దేశాల మార్కెట్లను ఆక్రమించగలిగితే అప్పుడు వృద్ధి రేటు పెరుగుతుంది. ప్రపంచ మార్కెట్‌లో నెలకొన్న పోటీని తట్టుకోడానికి దేశ ఆర్థిక వ్యవస్థలో సాంకేతిక-వ్యవస్థీకృత మార్పులను అమలు చేస్తేనే ఎగుమతులు పెరుగుతాయి. ఆ

మార్పులు శ్రామికుల ఉత్పాదకతను పెంచుతాయి. అందువల్ల కొత్త ఉపాధి అవకాశాలు పరిమితంగానే ఏర్పడతాయి. కొత్త అవకాశాలకన్నా అధికంగా ఉద్యోగార్థుల సంఖ్య పెరుగుతుంది. వీరిలో కొత్తగా నిరుద్యోగులుగా వచ్చినవారే గాక, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవస్థీకృత, సాంకేతిక మార్పుల కారణంగా ఉపాధిని కోల్పోయిన వారు ఉంటారు. వారికి అంత వరకూ ప్రభుత్వం నుంచి లభించిన మద్దతు (నయా ఉదారవాద విధానాల అములకు పూర్వ కాలంలో) ఇప్పుడు లభించనందున వారు దుర్భర దారిద్ర్యానికి నెట్టబడ్డారు. పనులు చేసే వారితో పోలిస్తే నిరుద్యోగుల శాతం క్రమంగా పెరిగిపోతూ వుంటుంది. అందుచేత శ్రామికుల తలసరి ఆదాయాల వాస్తవ విలువలు పడిపోతూ వుంటాయి. ఇలా ఆదాయాలు కుదించబడిన కారణంగానే ఆహారధాన్యాల నిల్వలు పేరుకుపోతూ వుంటాయి. ఇక్కడ మనం రెండు నిర్ధారణలకు రావచ్చు.

**మొదటి అంశం :** ఒక దేశ ప్రగతిని నిర్ధారించడానికి ప్రధాన సూచికగా జీడీపీని పరిగణిస్తూ వచ్చారు. నిజమైన ప్రజా సంక్షేమం ప్రాతిపదికన దేశ అభివృద్ధిని మదింపు చేయాలంటే ఈ జీడీపీని అందుకు ప్రమాణంగా తీసుకోవడం మానేయాలి. దాని స్థానంలో ప్రజల తలసరి ఆహార లభ్యతలో వృద్ధిని ప్రమాణంగా తీసుకోవాలి. ఇతర నిత్య జీవితావసర సరుకుల లభ్యతను ఆ ప్రమాణంలో కలపాలి. నయా ఉదారవాద విధానాల అమలుకు పూర్వ ఉన్న వ్యవస్థకు, నయా ఉదారవాద వ్యవస్థకు-రెండింటికీ ఈ ప్రమాణాన్ని వర్తింపజేయవచ్చు. పాత విధానంలో పెట్టుబడుల రాకపోకలమీద నియంత్రణలు ఉండేవి. ఆ కారణంగా దేశీయ మార్కెట్‌లో వృద్ధి ఎంత సాధ్యపడేదో, అంతమేరకే తలసరి వినియోగం వృద్ధి జరిగేది. అదే నయా ఉదారవాద వ్యవస్థ వచ్చేసరికి ఇక్కడ పెట్టుబడుల రాకపోకల మీద నియంత్రణలు లేవు. ఉత్పత్తిని పెంచుకోవచ్చు. కాని శ్రామిక ప్రజల వద్ద ఉన్న కొనుగోలు శక్తి చాలా పరిమితంగా ఉన్నందు వలన ఇక్కడ వృద్ధి రేటు పరిమితం అవుతోంది.

**రెండవ అంశం :** ఇక్కడ మార్కెట్‌లో సరుకుల మిగులు ఉంది. కనుక వాటిని వినియోగించే వేగాన్ని పెంచాలి. అందుకు ఉపాధి కల్పనను విస్తరించాలి. అలా ఉపాధి విస్తరించాలంటే అందుకు ప్రభుత్వం తన వ్యయాన్ని పెంచాలి. పెరిగే ప్రభుత్వ వ్యయాన్ని బడ్జెట్‌లో ద్రవ్యలోటును పెంచడం ద్వారా గాని, సంపన్నుల మీద అదనపు పన్నులను విధించడం ద్వారా గాని భర్తీ చేసుకోవచ్చు. శ్రామిక ప్రజానీకం మీద పన్నుల భారాన్ని పెంచితే దాని వలన వినిమయం ఆ మేరకు తగ్గిపోతుంది. కాని అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి బడ్జెట్ లోటును పెంచడానికి గాని, సంపన్నుల మీద పన్నులను పెంచడానికి కాని ఒప్పుకోదు. అంటే దేశంలో ఉపాధి పెరగకపోవడానికి అసలు ఆటంకం అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి సాగిస్తున్న పెత్తనం. ఇప్పుడు ఒక పక్క మిగులు ఆహార ధాన్యాలు పేరుకుపోవడం, ఇంకోపక్క నిరుద్యోగం పెరిగిపోవడం – ఏకకాలంలో కొనసాగడం అనే అసంబద్ధ పరిస్థితిని అధిగమించాలంటే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి పెత్తనాన్ని అధిగమించాలి. ఆ పెత్తనం నుంచి బయట పడడానికి పెట్టుబడుల రాకపోకల మీద ప్రభుత్వం నియంత్రణలు పెట్టాలి. అటువంటి నియంత్రణలు పెట్టడం అంటే నయా ఉదారవాద వ్యవస్థకు ముగింపు పలకడమే. నయా ఉదారవాద విధానాల సారాంశం పెట్టుబడుల రాకపోకలు ప్రపంచవ్యాప్తంగా ఇష్టారాజ్యంగా కొనసాగడం. దానికి కళ్లెం వేయడం అంటే నయా ఉదారవాద వ్యవస్థను తిరస్కరించడమే అవుతుంది.

దేశ వృద్ధికి ప్రమాణంగా జీడీపీ వృద్ధి రేటుకు బదులు ప్రజల వినియోగం వృద్ధి రేటును తీసుకున్నప్పుడు నయా ఉదారవాద విధానం కాలం అంతకు మునుపటి కాలంకన్నా చాలా హీనంగా కనిపిస్తుంది. పైగా ఈ విధానం ఆహారధాన్యాల నిల్వలను కూడా మనల్ని వినియోగించుకోనివ్వకుండా, ప్రజల కడుపులను నింపనివ్వకుండా అడ్డం పడుతుంది. మరోపక్క అదనంగా ఉపాధి కల్పించడానికి కూడా ఆటంకంగా ఉంది. అందుచేత పాత విధానం కన్నా నయా ఉదారవాద విధానం హీనమైనది. అంతే కాదు, అది హేతువిరుద్ధమైనది కూడా.

ఇలా చెప్పడం అంటే మనం మళ్లీ గతంలో, నయా ఉదార వాద విధానాలకు పూర్వం ఏ విధానాలను అనుసరించామో ఆ విధానాలవైపు మళ్లమని చెప్పడం కాదు. ఆ పాత విధానంలో వృద్ధి రేటు వ్యవసాయంలో సాధించే వృద్ధి మీద, ఆ రంగంలో ఏర్పడే మిగులు మీద ఆధారపడి వుండేది. ఇప్పుడు ఉపాధి అవకాశాలను పెంచి, వ్యవసాయ ఉత్పత్తులలో వృద్ధిని సాధించే విధంగా ముందడుగు పడితేనే ప్రయోజనం కలుగుతుంది. అది జరగాలంటే భూసంస్కరణలను తీవ్రస్థాయిలో అమలు చేయాలి. దానితోబాటు ప్రభుత్వం ఆ భూమి యొక్క ఉత్పాదకతను బాగా పెంపొందించే చర్యలు తీసుకోవాలి.

భూ సంస్కరణలు అనగానే కేవలం భూస్వాముల వద్ద కేంద్రీకృతమై ఉన్న భూమిని ముక్కలు చేసి పంచడం అన్న పరిమిత అర్థంలో చూడకూడదు. చాలా విస్తారమైన భూములు ఎప్పటినుండో, స్వాతంత్ర్యానికి పూర్వ కాలం నుండీ కూడా, సరైన ఉత్పాదకతను ఇవ్వగలిగిన పరిస్థితిలో లేవు. దేశంలో ఈ విధంగా ఉన్న విస్తారమైన భూములను కూడా పూర్తి స్థాయి వాడుకలోకి తీసుకువచ్చేలా భూ సంస్కరణలు ఉండాలి. ఇప్పుడు నయా ఉదారవాద విధానంలో ఎగుమతుల వృద్ధి మీద ఆధారపడిన ఆర్థిక వృద్ధి విధానం ఉంది. దానికి బదులు కేవలం ప్రభుత్వ జోక్యంతో జరిగే వృద్ధి మాత్రమే గాక, వ్యవసాయంలో ప్రభుత్వ పర్యవేక్షణలో సాధించే వృద్ధి మీద ఆధారపడిన ఆర్థిక వృద్ధి రావాలి. ❑

# ఎగవేత భారతం

- ఎసూరి

- ప్రజల సొమ్ము కార్పొరేట్లకు కర్పూరం – ఇదే ఈ ప్రభుత్వ విధానం
- ఇవి ప్రజలు బ్యాంకులో దాచుకున్న కష్టార్జితం.
- కార్మికులకు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయడానికి మనసు రాని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు, కార్పొరేట్ కంపెనీలకు మాత్రం అప్పులు మాఫీ చేయడానికి మనసు వస్తుంది.
- పేద ప్రజల సంక్షేమ పథకాలు ఎందుకు ? సంక్షేమ పథకాలకు డబ్బులు ఖర్చు ఎందుకు ? అని ప్రశ్నించే ఓ చదువుకున్న విద్యావంతులారా, మధ్య తరగతి ప్రజలారా మనం ప్రశ్నించాల్సింది ప్రజల కష్టార్జితం బ్యాంకుల్లో దాచుకుంటే ఆ డబ్బును కార్పొరేట్లకు అప్పగించి రద్దు ఎందుకు చేస్తున్నారని ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి. సంక్షేమ రాజ్యంలో పేదలు సంక్షేమానికి ఖర్చు చేస్తే ఎందుకని ప్రశ్నించే విద్యావంతులారా మనం పేదల సంక్షేమం కోసం ప్రభుత్వాలు డబ్బు ఖర్చు పెడితే తప్పు కాదు. అది మళ్లీ సమాజ సరుకులు పునః ఉత్పత్తిలో భాగస్వామ్యం అవుతుంది. అదే ప్రజలు డబ్బును కార్పొరేట్లకు, కార్పొరేట్ సంస్థలకు, దోపిడీదారులకు కట్టబెడితే దేశాన్ని, సహజ వనరులను దోచుకొనే దోపిడిదారులకు ఉపయోగపడుతుంది.
- సంవత్సరాల తరబడి రైతుల పండించిన పంటలకు కనీసం మద్దతు ప్రకటించాలని రైతులు తెగించి పోరాడితే డబ్బులు లేవని కార్పొరేట్ వ్యవసాయానికి సహకారం అందిస్తుంది మన ప్రభుత్వం. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలంటే డాక్టర్ ఎంఎస్ సోమనాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేయమంటే చేయకుండా కాలయాపన చేస్తుంది. వలస కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు చెప్పినా ఈ ప్రభుత్వం పట్టించుకోదు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచి సంవత్సరానికి 300 రోజుల పనిదినాలు కల్పించాలని అడుగుతుంటే కేంద్ర





బడ్జెట్‌లో కేటాయింపుల్లో కోత పెట్టింది. కౌలు రైతుల సమగ్ర చట్టం కావాలని దీర్ఘకాలికంగా పోరాటాలు చేస్తుంటే రైతులు, కౌలు రైతులకు ఆత్మహత్యలు మిగులుతున్నాయి. ప్రభుత్వశాఖల్లో ఖాళీలు నింపమని నిరుద్యోగులు అడుగుతుంటే అరణ్యరోదన అవుతోంది. ఆస్తి పన్ను పెంచకుండా ఆదాయం పన్ను పెంచి మధ్యతరగతి ఉద్యోగుల నుండి టాక్స్ వసూలు చేసి కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల ధారాదత్తం చేయడానికి మాత్రం కేంద్ర ప్రభుత్వం అన్ని దారులు తెరిచి ఉంచింది.

- విద్యా వంతులారా ప్రజల డబ్బును లక్షల కోట్ల రూపాయల కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వాలు ధారాదత్తం చేస్తుంటే.. నిలదీసే, నిగ్గదీసి ప్రశ్నించాల్సింది ప్రభుత్వాన్ని. ప్రభుత్వం ఆరంభిస్తున్న విధానాలను.
- దీన్నే అత్త సొమ్ము అల్లుడు దానం చేయడం అంటే ఇదేనేమో. ప్రజలపై వేసిన పన్నులతో నిర్మించిన ప్రభుత్వ రంగాన్ని, సహజ వనరులని కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా అప్పగించి, ప్రజలు పైసా పైసా కూడబెట్టి బ్యాంకులో దాచుకుంటే.. మన బ్యాంకుల్లో ఉన్న డబ్బును కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా కట్టబెట్టి ఓట్లేసి గెలిపించిన ప్రజలను మరిచిపోయి, ప్రజా సంక్షేమానికి బడ్జెట్‌లో నిధులు కోత బెట్టి కార్పొరేట్ కంపెనీలకు రెడ్ కార్పెట్ వేసి ప్రజల సొమ్మును దోచిపెడుతున్నారు.. దీన్ని కదా మనం ప్రశ్నించాల్సింది. నిలదీయాల్సింది మిత్రులారా. ❑

# పెట్టుబడిదారీ వ్యవస్థకు ట్రంప్ చికిత్స !

- సి.పి.చంద్రశేఖర్

**ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్ష పదవి చేపట్టాక, అమెరికా నాయకత్వంలో నడుస్తున్న ప్రపంచ పెట్టుబడిదారీ విధానం మొత్తంగా వ్యవస్థీకృత మార్పులకు లోనవుతోంది. దీనికి చోదకశక్తి అంతర్గతంగానే పనిచేస్తోంది. గతంలో రెండో ప్రపంచయుద్ధానికి ముందు 'మహా మాంద్యం' ఏర్పడినప్పుడు 'న్యూ డీల్'ను ప్రకటించారు. 1970 దశకంలో ద్రవ్యోల్బణం అదుపు తప్పినప్పుడు నయా ఉదారవాద విధానాలను ప్రకటించారు. ఇప్పుడు మళ్లీ పెట్టుబడిదారీ వ్యవస్థ మరో తీవ్ర సంక్షోభంలో చిక్కుకుంది. దానికి స్పందనగా ట్రంప్ నాయకత్వంలో ఈ మార్పులు జరుగుతున్నాయి.**




ఆర్థిక రంగంలో ట్రంప్ ప్రభుత్వం ప్రధానంగా ప్రవేశ పెడుతున్న మార్పులు అయిదు విధాలుగా ఉన్నాయి.

- **మొదటి మార్పు :** అధిక దిగుమతి సుంకాలను విధించడం. బైటకు తరలిపోయిన పరిశ్రమలను తిరిగి అమెరికాకు రప్పించడానికి, తద్వారా అక్కడ ఉత్పత్తిని, ఉపాధి అవకాశాలను పెంచడానికి ఈ సుంకాల పెంపు చేపట్టినట్టు చెప్పి సమర్థించుకుంటున్నారు. దేశ భద్రతకు సైతం ఈ విధానం అవసరం అంటూ చెబుతున్నారు. అయితే, ఈ విషయంలో లోతుగా, ముందుచూపుతో వ్యవహరిస్తున్నట్టు తోచదు. ఈ విధానం అమలు విషయంలో ఊగిసలాటలు కూడా కనిపిస్తున్నాయి. చౌకగా కార్మికుల శ్రమను కొల్లగొట్టగల దేశాలకు తరలిపోయిన సరుకుల ఉత్పత్తి పరిశ్రమలు ఏ మేరకు వెనక్కి వస్తాయన్నది ప్రశ్నార్థకమే. కెనడా, మెక్సికో దేశాలపై 25 శాతం దిగుమతి సుంకం విధించారు. తర్వాత వెనక్కి తగ్గారు. కొంత జాగు తర్వాత తిరిగి సుంకం విధించారు. చైనాపై విధించే సుంకాలను పెంచారు. కార్లు, ఇతర వాహనాలు, స్టీల్, అల్యూమినియం తదితర ఉత్పత్తుల మీద కూడా సుంకాలను ప్రకటించారు. దానికి ప్రతిస్పందనగా అమెరికాతో వాణిజ్యం నడిపే దేశాలు కూడా అమెరికా దిగుమతులపై సుంకాలను ప్రకటిస్తున్నాయి.
- **రెండో మార్పు :** బడా పెట్టుబడిదారులు అమెరికన్ రాజ్య వ్యవస్థను స్వాధీనం చేసుకోవడం. ఇంత వరకూ సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ కమిషన్, ఫెడరల్ ట్రేడ్ కమిషన్ వంటి నియంత్రణ సంస్థలు స్వతంత్ర సంస్థలుగా ఉన్నాయి. గతంలో ఎస్ఈసీ క్రిప్టో కరెన్సీ లావాదేవీలకు పగ్గాలు వేయడానికి ప్రయత్నించింది. అమెజాన్, మెటా వంటి గుత్త సోషల్ మీడియా ప్లాట్ ఫాం సంస్థలను అదుపు చేయడానికి ఎస్ఈసీ ప్రయత్నించింది. ఇప్పుడు ఈ స్వతంత్ర సంస్థలను అమెరికన్ అధ్యక్షుడి శ్వేతసౌధానికి జవాబుదారీగా వ్యవహరించేలా వాటి ప్రతిపత్తిని మార్చివేశారు. బడా పెట్టుబడులు యథేచ్ఛగా దోచుకోడానికి అవకాశం కల్పించారు. ఇప్పుడు అమెరికాలోని అగ్రశ్రేణి బడా వ్యాపారవేత్తలందరూ ట్రంప్ వెనుక మోహరించి వున్నారు. ట్రంప్‌కు చెందిన విధాన రూపకల్పన వేదికలలో సైతం వారు ప్రవేశించారు. వారందరిలోకి చెప్పుకోదగ్గవాడు ఎలన్ మస్క్. ఎక్స్ అనే సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌కు, టెస్లా అనే వాహన తయారీ సంస్థకు అతడు అధిపతి. ఇప్పుడు ఎలన్‌మస్క్ నేతృత్వంలో ప్రభుత్వ సామర్థ్యాన్ని పెంచే ఒక శాఖను ఏర్పరిచాడు

ట్రంప్. అదే డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ. దీనికి 50 బిలియన్ల డాలర్లు కేటాయించాడు. ప్రభుత్వానికి చెందిన ఏ విభాగమైనా ఈ డీవోజీఈకి జవాబుదారీగా ఉండాలని ఆదేశించారు.

- **మూడో మార్పు :** అమెరికాతో వాణిజ్యపరంగా, దౌత్య పరంగా సంబంధాలు నెరపే దేశాల నుండి తమకు కావలసిన వ్యూహాత్మకమైన భూభాగాలను, సహజ వనరులను, ఇతర సదుపాయాలను ట్రంప్ డిమాండ్ చేస్తున్నాడు. గ్రీన్‌లాండ్, పనామా కాలువ, గాజా భూభాగం తనకే స్వంతం అని ప్రకటించాడు. అదే సమయంలో ఆయా మిత్ర దేశాలకు అందిస్తూ వచ్చిన ఆర్థిక, సైనిక సహాయాలకు కోత పెడుతున్నాడు.
- **నాలుగో మార్పు :** ఉక్రెయిన్‌లో గాని, గ్రీన్‌లాండ్‌లో గాని, ఇతర దేశాలలో గాని ఉన్న కీలకమైన ఖనిజాలను తమకు కేటాయించాలని బెదిరిస్తున్నాడు. తర్వాత అవసరమైతే బల ప్రయోగానికి కూడా వెనుకాడేలా లేడు.
- **ఐదో మార్పు :** ప్రపంచ రాజకీయాలన్నీ అమెరికా చుట్టూ మాత్రమే తిరిగేలా చేయడానికి రష్యాతో మళ్ళీ సత్సం బంధాలను నెలకొల్పుకోడానికి ప్రయత్నిస్తున్నాడు. యూరప్ దేశాలతో సంబంధాలలో కూడా మార్పులు చేస్తున్నాడు. రష్యాతో సంబంధాలు మెరుగుపడితే ఆ దేశంలో లభించే ముడిసరుకులను అమెరికా పొందగలుగుతుంది. అమెరికా తో యూరప్ దేశాలు వ్యాపార సంబంధాలను కొనసాగి స్తాయి. కాని వాటి రక్షణ బాధ్యత నుండి అమెరికా వైదొలగుతుంది. ఇదీ ట్రంప్ విధానం.

### ట్రంప్ ఎత్తుగడల లక్ష్యం ఏమిటి?

ట్రంప్‌ను పెద్ద మెజారిటీతో గెలిపించిన శ్వేత కార్మికులకు ఏదో ఒరగబోతోందన్న అభిప్రాయాన్ని కలిగించడం. అమెరికాకు మళ్ళీ పరిశ్రమలు తిరిగి వచ్చేస్తే వాటిలో తమకు ఉపాధి లభిస్తుందన్న ఆశలు వారిలో కలిగించడం. ముఖ్యంగా అత్యంత సంపన్నుల ప్రయోజనాల కన్నా ట్రంప్ తమ ప్రయోజనాలను కాపాడేందుకే అధిక ప్రాధాన్యతనిస్తున్నాడన్న భ్రమలు వారిలో కలిగించడం ఒక లక్ష్యం. బలహీనపడుతున్న అమెరికన్ ఆధిపత్యాన్ని తిరిగి బలంగా నెలకొల్పాలన్నది మరో లక్ష్యం.

### ఈ లక్ష్యాలు ఏ మేరకు నెరవేరతాయి?

1970 దశకం తర్వాత అమలు చేసిన నయా ఉదారవాద విధానాలు ద్రవ్య పెట్టుబడిపై నియంత్రణలను ఎత్తివేశాయి. రుణాల మీద ఆధారపడిన ఆర్థిక వృద్ధి వైపు అడుగులు పడ్డాయి. ఈ క్రమంలో ప్రభుత్వం పాత్ర మారిపోయింది. అట్టడుగు తరగతుల సంక్షేమం కోసం నిలబడి, అందుకోసం సంపన్నులను నియంత్రించే విధానాలకు బదులు దానికి రివర్స్‌గా దిగువ తరగతుల నుండి సంపదను కొల్లగొట్టి సంపన్నుల వద్ద సంపద మరింతగా కేంద్రీకరించబడేలా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. అయితే ఈ విధంగా సంపదను నిరవధికంగా కేంద్రీకరించడం అనేది ఎంతో కాలంపాటు కొనసాగించడం అసాధ్యం. ఈ విషయాన్ని 2008లో బద్దలైన సంక్షోభం తేటతెల్లం చేసింది. 1960 దశకం నుండి రెండు దశాబ్దాలపాటు పెట్టుబడిదారీ విధానానికి 'స్వర్ణయుగం' నడిచింది. ఆర్థిక వృద్ధి, కనీస స్థాయిలో ద్రవ్యోల్బణం, ఎక్కువ మోతాదులో ఉపాధి కల్పన, సంక్షేమ రాజ్యం అన్నీ ఆ కాలంలో సాధ్యపడ్డాయి. కాని నయా ఉదారవాద విధానాల అమలు ఫలితంగా అవన్నీ అదృశ్యమ య్యాయి. అందుచేత పెట్టుబడిదారీ దోపిడీ విధానాలను సమర్థించుకోవడం రాజకీయంగా పాత పద్ధతులలో సాధ్యపడడం లేదు.

'అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా చేద్దాం' (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్) అని ట్రంప్ ఇచ్చిన నినాదం అతగాడి వెనుక ఉన్న అమెరికన్ పెట్టుబడిదారుల కోసమే. తక్కిన వారందరిని, తన మిత్ర దేశాలతో సహా బలిచేసి, అమెరికాను మాత్రమే అగ్రస్థానంలో నిలపాలన్నదే ఆ నినాదం లక్ష్యం. అందుకోసమే ట్రంప్, అతని సహచరులు అమెరికన్ రాజ్య వ్యవస్థను చేజిక్కించుకుని అతి కొద్దిగా ఉన్న 'సూపర్ రిచ్'కి మరింత సంపదను కట్టబెట్టే పనిలో ఉన్నారు.

తక్కిన ప్రపంచం నుండి వనరులను చేజిక్కించుకుని తద్వారా అతి కొద్దిమంది సూపర్ రిచ్ వద్ద సంపదలను మరింతగా కేంద్రీకరించి, ఈ క్రమంలో అమెరికాలో ఉన్న కార్మిక వర్గానికి కొంత వరకూ విదిలిస్తే సరిపోతుందన్న దృష్టితో వాళ్లు ఉన్నారు. ఈ పరిస్థితి సామ్రాజ్యవాద దేశాల మధ్య నెలకొన్న సంబంధాలలో మార్పుకు దారితీస్తోంది. గతంలో రెండుసార్లు ప్రపంచయుద్ధాలకు దారితీసిన విధంగా సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాలు ఈసారి పరిణమించకపోవచ్చు. ఆ సామ్రాజ్యవాద దేశాలలో ఒక ఆధిపత్య దేశం తన స్వార్థం కోసం తక్కిన సామ్రాజ్యవాద మిత్రులను సైతం తొక్కిపెట్టడానికి తయారవుతోంది. అందుకోసం తన మాజీ శత్రువులతో సైతం చేతులు కలిపేందుకు సిద్ధపడుతోంది. తక్కిన ప్రపంచాన్ని మొత్తంగా తన వలసగా మార్చుకుని తద్వారా తన దేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థను కాపాడుకోవ చ్చునని అమెరికన్ పాలకవర్గం భావిస్తున్నట్టు ఉంది. కాని ఇది ఒక వికృతమైన ప్రయత్నంగా తయారై విఫలం కాక తప్పదు. ఒక దురహంకారి నాయకత్వంలో అమెరికన్ శత కోటీశ్వరుల గుంపు సాగించే దోపిడీ ఎల్లకాలమూ కొనసాగిపోతుందనే భ్రమలో ఉన్నారు. కాని ఈ భ్రమ పటాపంచలు కాక తప్పదు. ❑

# బీజేపీ మెజారిటేరియన్ వాదం



\- ముకుల్ కేశవన్

**ఫాసిజం ఓ ఆధునిక రాజకీయ ధోరణి. సామూహిక విధ్వంసక సాధనం. అది ఎక్కడ కాలు పెడితే అక్కడ విలయమే. తాను ఆశించిన సమాజాన్ని నిర్మించే ప్రయత్నంలో అప్పటి వరకు ఉన్న సమాజాన్ని సమూలంగా ధ్వంసం చేస్తుంది. ఫాసిజం నిర్దిష్ట చారిత్రక సందర్భంలో నేపథ్యంలో ఎంతగా ఒదిగి పోయిందంటే వేరే చారిత్రక పరిస్థితులను ఈ అవగాహనతో అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చేయడమే కష్టంగా మారింది. అయినా వర్తమాన దక్షిణాసియా దేశాల్లో పరిణామాలని నాజీయిజం వెలుగులో పరిశీలిస్తే రెండు ప్రయోజనాలు నెరవేరతాయి.**

వర్తమాన భారతదేశంలో అమల్లో ఉన్న మెజారిటేరియన్ రాజకీయాలను తన పూర్వీకులతో (చరిత్రలో ఇతర దేశాలలో అమలు జరిగిన ఇటువంటి రాజకీయ ధోరణులతో) పోల్చి అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తుంది. వర్తమాన ఫాసిస్టు ధోరణులను, వాటి సైద్ధాంతిక పునాదులను గుర్తించి దానికి ఓ పేరు పెట్టేందుకు అవకాశం కల్పిస్తుంది. తద్వారా వర్తమాన ఫాసిస్టు ధోరణులపై పోరాడే మార్గాన్ని చూపిస్తుంది.

భారతదేశంలో అధికారంలో పార్టీ భారతీయ జనతా పార్టీ ఉంది. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అనే మనువాద సాయుధ సంస్థకు చెందిన రాజకీయ విభాగం. ఆర్ఎస్ఎస్ 1925లో ఏర్పడింది. ఈ సమయంలోనే మొదటి ప్రపంచయుద్ధంలో అవమానకరంగా ఓటమి పాలై ఛిద్రమై చితికిపోయిన జర్మనీ అహాన్ని రెచ్చగొట్టి ఆత్మన్యూనతను పెంచి పెద్దది చేసి, సమాజంలో సంఖ్యాపరంగా బలహీనమైన పక్షాన్ని శత్రువుగా సృష్టించి, సదరు బలహీన శత్రువు నుంచి దేశాన్ని కాపాడే మిషతో మాజీ హిట్లర్ అధికారానికి వచ్చిన కాలం కూడా అదే. ఆర్ఎస్ఎస్ ఒక జాతీయోన్మాద సాయుధ దళం. భారతదేశం కేవలం హిందువులకు మాత్రమే దేశం అన్నది వారి భావన. హిందువులు మాత్రమే పౌరులుగా ఉంటారు హిందువేతరులు పౌరులుకాబోరు అన్నది వారి స్పష్టమైన అవగాహన. రెండో ప్రపంచయుద్ధానికి ముందు వివిధ దేశాల్లో పుట్టుకొచ్చిన అర్ధ సైనిక దళాలకు ఆర్ఎస్ఎస్‌కు మధ్య చాలా పోలికలు ఉన్నాయి. విలక్షణమైన వస్త్రధారణ, అభివాద శైలి, సంస్థాగత క్రమ శిక్షణలో భాగమైన కవాతు, పురుషాధిక్య లక్షణం వంటి పోలికలు ఎన్నైనా చెప్పవచ్చు. వీటన్నిటికి తోడు మౌలికంగా మతపరమైన లేదా జాతిపరమైన అల్పసంఖ్యాక తరగతుల నుంచి ముప్పు వస్తుందన్న ఊహాజనిత భావన ఆధారంగా సదరు అల్ప సంఖ్యాకులపట్ల వ్యవహరించడం అన్న విషయంలో కూడా ఈ శక్తుల మధ్య సైద్ధాంతిక ఏకాత్మత ఉంటుంది.

భారతదేశంలో మతపరమైన అల్ప సంఖ్యాకులపై జరుగుతున్న దాడులు, పాటిస్తున్న వివక్ష మనం నిత్యం చూస్తున్నవే. ప్రత్యేకించి గత దశాబ్ది కాలంగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పాలనలో ఈ ధోరణులు మరింతగా పెట్రేగిపోతున్నాయి. పశుసంరక్షణ పేరుతో మనుషుల హత్యలు, ముస్లిం నివాసాలపై స్వైరవిహారం చేస్తున్న బుల్డోజర్లు, నేరంగా మారుతున్న హిందూ ముస్లిం యువతీ యువకుల మధ్య ప్రేమలు, లవ్ జీహాద్ వంటి అపోహలు పెంచే నినాదాలు ప్రధాని మోడీ హయాంలో ప్రత్యేక లక్షణాలుగా మారాయి. దేశంలో మతపరమైన అల్ప సంఖ్యాకుల విషయంలో ఆర్ఎస్ఎస్ జర్మనీ నాజీల నుండి ప్రేరణ పొందటం ఇప్పటిది కాదు. 1930 దశకం నుండే ఆర్ఎస్ఎస్‌కు నాజీయిజం ఆదర్శం.

ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త ఎంఎస్ గోల్వాల్కర్. భారతదేశాన్ని హిందూ రాజ్యంగా మార్చేందుకు కార్యాచరణ ప్రణాళికగా చెప్పుకోదగ్గ పుస్తకం 'మనం మన జాతీయత నిర్వచనం'. ఈ పుస్తకాన్ని గోల్వాల్కర్ 1939లో రాశారు. ఆర్ఎస్ఎస్ నిరంతరం జర్మన్ నాజీల నుంచి ప్రేరణ పొందింది అని చెప్పటానికి గోల్వాల్కర్ రచనలోని ఈ వాక్యాలను గుర్తు చేసుకోవాలి. 'జర్మన్ జాతి ఆత్మాభిమానం గురించి ఇపుడు అందరూ మాట్లాడుకుంటున్నారు. జర్మన్ జాతి, జర్మన్ సంస్కృతికి పట్టిన కాలుష్యాన్ని శుద్ధి చేసేందుకు జర్మనీయేతర జాతులను ఊచకోత కోయటం ద్వారా ప్రపంచాన్ని దిగ్భ్రమకు గురిచేసింది. దీంతో జాతీయాభిమానాన్ని జాతి గర్వాన్ని పతాక స్థాయిలో నిలబెట్టిన సందర్భం అది. మూలాల్లోనే వైవిధ్యం ఉన్న భిన్న సంస్కృతులు ఎంత ప్రయత్నించినా ఉమ్మడి జాతిగా మనగల లేవన్నది తిరస్కరించలేని వాస్తవం. మన దేశంలో ఉన్న పరిస్థితుల్లో జర్మన్ అనుభవాల నుంచి ఎంతో నేర్చుకుని లబ్ధి పొందవచ్చు.'

జర్మన్ నాజీయిజాన్నీ అది చెప్పిన పాఠాలను బీజేపీ బాగా వంట బట్టించుకుంది. ముస్లింల ప్రస్తావన తీయకుండానే వారి గురించి అనరాని మాటలన్నీ అంటున్నారు. జాతీయ నేతల మొదలు క్షేత్రస్థాయి కార్యకర్తల వరకు ముస్లింలను చీడ పురుగుల్లా చూస్తున్నారు. ఎపుడో మధ్య యుగాల్లో కట్టిన మసీదులు ఇపుడు తాజా వివాదాలకు కేంద్రమవుతున్నాయి. మైనారిటీలను ఉద్దేశ్య పూర్వకంగానే జన జీవన స్రవంతి నుంచి వెలివేస్తోంది. వందల సంఖ్యలో ఉన్న బీజేపీ ప్రజా ప్రతినిధుల్లో ఒక్కరంటే ఒక్కరు కూడా ముస్లింలు లేరు.

పశువుల రవాణాపై నిషేధం విధించడం లాంటి చర్యల ద్వారా ముస్లింల జీవనోపాధిని దెబ్బ తీయడం ప్రభుత్వ విధానంగా మారింది. ముస్లిం మహిళల హిజాబ్ వస్త్రధారణ నేరమైంది. పౌరసత్వ చట్ట సవరణ పేరుతో దొడ్డిదారి ముస్లింల పట్ల వివక్షను చట్టబద్ధం చేశారు. తద్వారా ఒకే దేశంలో వివక్ష పూరిత పౌరసత్వానికి తెరతీసింది బీజేపీ ప్రభుత్వం.

మెజారిటీరియనిజం నాజీయిజం మౌలిక వ్యక్తీకరణ. ఈ దిశగా జన జీవన స్రవంతిలో అడుగులు వేగంగా పడుతున్నాయి. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే దక్షిణాసియాలో ఫాసిజం నిదానంగా వేళ్లూనుకొంటోంది. నిరంతరం మైనారిటీలపై విషం చిమ్మటంలో బీజేపీ హిందూత్వ రాజకీయాలు బరితెగించవచ్చున్నది నాజీయిజం నుంచి బీజేపీ ఆర్ఎస్ఎస్‌లు నేర్చుకున్న మరో పాఠం. అప్పటి వరకు యూరప్ సామాజిక ఆర్థిక రాజకీయ సాంస్కృతిక మేధో జీవనంలో భాగస్వాములు అయిన యూదులను కేవలం 20 ఏళ్లలో అంటరాని తరగతిగా సామాజిక శత్రువులుగా మార్చింది హిట్లర్ ప్రభుత్వ విధానాలు. ఈ స్ఫూర్తితోనే గోల్వాల్కర్ రెండో ప్రపంచ యుద్ధానికి ముందు ఈ దేశంలో హిందూయేతరులు అందరూ తమ చరిత్ర సంస్కృతి అస్తిత్వం వదులుకుని ఎటువంటి సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కులు చివరకు పౌరసత్వం కూడా వదులుకుని ఈ దేశంలో రెండో శ్రేణి పౌరులుగా మిగిలిపోవాలని హెచ్చరించారు.

ఇది దేశవాళీ నాజీయిజం అని నిర్ధారించుకోవడానికి రెండు కారణాలు ఉన్నాయి. మొదటిది జర్మనీ ఎంత త్వరగా దివాళా తీసిందో అంతే వేగంగా నరహంతక రాజ్యంగా ఎదిగింది. రెండో అంశం నరమేధాన్ని తేలికైన క్రతువుగా మార్చిన పారిశ్రామిక అభివృద్ధి. యూదుల నరమేధాన్ని వేగిరపర్చిన విధానం అటుంచితే దేశంలోని అల్ప సంఖ్యాక వర్గాలను రాక్షసులుగా చిత్రీకరిస్తూ మెజారిటీ మతస్తుల లేదా మెజారిటీ జాతీయుల ఆధిపత్యాన్ని ఖరారు చేసే దిశగా దేశాన్ని వ్యవస్థలను నడపటంలో అనుసరించిన నికరమైన వైఖరిని పద్ధతులను ప్రమాణాలను వాటి తీవ్రతను గమనించాలి. ఈ వ్యూహాలు, విధానాలు ఈ దారిలో నడవాలని. నిర్ణయించుకున్న ఆర్ఎస్ఎస్ వంటి సంస్థలకు మార్గదర్శకంగా నిలిచాయనడంలో సందేహం లేదు. ఈ రకంగా చూసినపుడు నాజీయిజం అంటే దూకుడు అందిపుచ్చుకున్న మెజారిటెరియనిజమే. ఇంకా వివరంగా అర్థం చేసుకోవాలంటే దక్షిణాసియాలో మనం నేడు చూస్తున్న మెజారిటీరియనిజం నిదానంగా పాతుకుపోతున్న ఫాసిజమే. ఆధునిక భారతదేశం వీమర్ కాలం నాటి జర్మనీలా

(మిగతా 14వ పేజీలో..)

## ఆర్ఎస్ఎస్ భారత్ పాలిట రాచపుండే : తుషార్‌గాంధీ

కోచి : భారత్ పాలిట రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ను (ఆర్ఎస్ఎస్) రాచపుండేనని మహాత్మాగాంధీ మనుమడు తుషార్ గాంధీ శుక్రవారం పునరుద్ఘాటించారు. ఈ వ్యాఖ్యలకు తానేమీ చింతించడం లేదని, క్షమాపణలు చెప్పాల్సిన అవసరమే లేదని తేల్చిచెప్పారు. 'నేనన్నదానికి క్షమాపణలు చెప్పాలని వారు కోరుకుంటున్నారు. నా ప్రకటనను వెనక్కి తీసుకోవాలని కోరుతున్నారు. కానీ నేనది చేయను. ఒకసారి అన్న తర్వాత దాన్ని వెనక్కి తీసుకోవడంలో లేదా క్షమాపణ చెప్పడంలో నాకు నమ్మకం లేదు' అని తుషార్ గాంధీ చెప్పారు. ఎర్నాకులంలోని అలువాలో యూనియన్ క్రిస్టియన్ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైకోమ్ సత్యాగ్రహంలో పాల్గొన్న తర్వాత మహాత్ముడు మార్చి 18, 1925న ఈ సంస్థను సందర్శించారు. ఆయన పర్యటన వందేళ్ల వేడుకల సందర్భంగా కేంపస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తుషార్ ప్రసంగించారు. శివగిరి మాధమ్ వద్ద మహాత్ముడితో శ్రీ నారాయణగురు సమావేశం శత వార్షికోత్సవం సందర్భంగా ఇచ్చిన ప్రసంగంలో తుషార్, ఆర్ఎస్ఎస్‌పై పైవ్యాఖ్యలు చేశారు. తిరువనంతపురం శివార్లలో ఆర్ఎస్ఎస్, బీజేపీ కార్యకర్తలు బుధవారం సాయంత్రం తుషార్‌గాంధీని నిర్బంధించారు. క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనతో దేశద్రోహులను ఎండగట్టాలన్న తన కృతనిశ్చయం మరింత బలోపేతమైందని ఆయన వ్యాఖ్యానించారు. పైగా, ప్రతిపక్షాన్ని కూడా గౌరవించే సంస్కృతి మలయాళీలదని, ఇక్కడ ప్రజల హక్కులు పరిరక్షించబడతాయని అటువంటి కేరళలో ఇలాంటి సంఘటన జరగడం తనకు దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. ఈ తరహా విషపూరితమైన ప్రజలను రాష్ట్రం నుండి బయటకు పంపించాలన్నారు. స్వాతంత్ర్య పోరాటంకన్నా మరింత ముఖ్యమైనది ఈ పోరాటమని ఆయన వ్యాఖ్యానించారు. మనందరికీ ఉమ్మడి శత్రువు వున్నారన్నారు.

# మొఘల్ చక్రవర్తులకు జన్మనిచ్చిన హిందూ స్త్రీలు



- బొల్లోజు బాబా

భారతదేశం చారిత్రకంగా భిన్న మత విశ్వాసాల సమ్మేళనం. అనేక సముదాయాలు వివిధ సంస్కృతులతో కలిసి మెలిసి జీవించాయి. మనుషుల మధ్య బంధుత్వాలకు మతాలు అడ్డు రాలేదు. చరిత్రలో హిందూ ముస్లిమ్‌ల మధ్య అనేక వివాహాలు జరిగాయి. ఇవి భిన్న సంస్కృతుల సమ్మేళనానికి దారితీశాయి. చాలా మంది మొఘల్ చక్రవర్తులు హిందూ స్త్రీలకు పుట్టారు. వారి ఆస్థాన చరిత్రకారులు ఈ విషయాన్ని ఎక్కడా దాచి పెట్టలేదు. స్పష్టంగానే రాసుకొన్నారు. వీటిని ఉత్త రాజకీయ తంత్రంగా భావించలేం. ఒక ముస్లిం రాజు హిందూ స్త్రీని పెండ్లాడి ఆమెను జనానాలో ఒకానొక దేహంగా మార్చక పోవటం ఆమె ద్వారా కలిగిన పుత్రుడు సింహాసనం అధిష్టిం చటం అనేవి ఉత్త రాజకీయ వ్యూహాలుగా పరిగణించలేం. రాజ నీతినిమించిన మానవీయకోణాన్ని, సౌహార్దతను ఊహించాలి. భారతదేశ చరిత్రను ప్రభావితం చేసిన హిందూ ముస్లిమ్ వివాహాలు కొన్ని ఇవి.

## 1.హర్కాబాయి(1542-1623) - అక్బర్

జైపూర్ రాజైన భర్మల్ 1562లో తన కూతురు హర్కాబాయిని అక్బర్‌కు ఇచ్చి వివాహం చేశాడు. ఈమె అక్బరుకు ఎంతో ఇష్టమైన రాణి అయింది. హర్కాబాయి అపురూప సౌందర్యం, అద్భుతమైన మేధాశక్తి, గొప్ప దయ కలిగిన స్త్రీ. అక్బర్ చూపించిన మత సహనం, లౌకికత వెనుక ఈమె హస్తం ఉందని చరిత్రకారుల అభిప్రాయం. ఈమె కోరికపై అక్బరు గోమాంసాన్ని తినటం మానివేశాడు. ఈమె ద్వారా వైదిక క్రతువులు, బ్రాహ్మణులు, సూర్య నమస్కారాలు, శాఖాహారం, పూజలు లాంటివి ముఘల్ అంతఃపురంలోకి ప్రవేశించాయి. హిందూ స్త్రీలు సంస్థానంలో హారతి ఇస్తే స్వీకరించాలని అందరినీ ఆదేశించాడు అక్బరు. హర్కాబాయి-అక్బర్‌లకు 1569లో కుమారుడు కలిగాడు. ఇతనే మొఘల్ చక్రవర్తి జహంగీరు. హిందూ స్త్రీకి జన్మించి మొఘల్ సామ్రాజ్యాన్ని అధిరోహించిన మొదటి చక్రవర్తి జహంగీరు. మొఘల్ సంస్థానంలో హర్కాబాయి నాలుగు దశాబ్దాల సుదీర్ఘ కాలంపాటు పట్టపు రాణిగా ఆ పిదప రాజమాతగా ఎంతో గౌరవాన్ని పొందింది. ఈమె పేరు మీద ఒక ఓడ ఉండేది. ఈమె అనేక నౌకా వ్యాపారాలు చేసేది. వ్యాపారాభివృద్ధి నిమిత్తం దేశంలోని వివిధ ప్రాంతాలను సందర్శించేది. ఈమె ఓడ పేరు రహిమి (Rahimi) 12,000 మంది సైనికులను కలిగి ఉన్న నలుగురు మొఘలు సంపన్న వ్యక్తులలో ఈమె ఒకరు. స్త్రీలలో ఒకే ఒకరు. ఇదీ ఈమె హోదా. జహంగీర్ తన తల్లి హర్కాబాయిని ఎంతో గౌరవంగా Her Majesty అని సంబోధిం చేవాడు. పాదాలకు నమస్కరించిన పిదప మాట్లాడేవాడు. 1605లో అక్బర్ చనిపోయే నాటికి హర్కాబాయి ముఘల్ స్త్రీల లో అత్యంత సంపన్నురాలు. ఈమె తన 81వ ఏట 1623 లో మరణించింది. హర్కాబాయి గౌరవార్థం అక్బరు సమాధి పక్కనే ఆగ్రాలో ఈమె సమాధి కూడా నిర్మించారు.

## 2. మన్ బాయి (1570-1605) - జహంగీర్

జహంగీర్ తల్లి హర్కాబాయి సోదరుని పేరు రాజ భగ్వంత్ దాస్. ఇతను జైపూర్/అంబర్‌ను పాలించిన 23వ రాజు. ఇతని కూతురు పేరు మన్‌భవతి బాయి(Man Bai). జహంగీరు, మన్‌బాయిలు బావ మరదళ్ళు అవుతారు. మన్ బాయి గొప్ప సౌందర్య రాశి, సౌశీల్యవతి. మేనత్త హర్కాబాయిలా తెలివైనది. ఆమెను జహంగీరుకు ఇచ్చి వివాహం చేయాలని హర్కాబాయి ప్రతిపాదించగా, వంశ ప్రతిష్టలు కలిగిన కుటుంబానికి చెందిన అమ్మాయి కనుక అక్బరు మన్‌బాయిని కోడలుగా చేసుకోవటా నికి వెంటనే అంగీకరించాడు. మన్ బాయి, జహంగీరుల వివాహం 1585లో అంగరంగ వైభవంగా జరిగింది. వీరిద్దరికి 1587 ఖుస్రో మిర్జా అనే కుమారుడు కలిగాక మన్ బాయికి పట్టమహిషి (Shah Begum) హోదా లభించింది.

మన్‌బాయి సోదరుని పేరు మాధవసింగ్. ఇతనితో తన కొడుకు ఖుస్రో మీర్జా కలిసి భర్త జహంగీరుపై వ్యతిరేకంగా కుట్రలు పన్నటం మన్‌బాయిని తీవ్రమైన మనస్తాపానికి గురి చేసేది. కొడుకుకు భర్తకు నచ్చచెప్పలేక మన్‌బాయి తీవ్రఒత్తిడికి గురై 1605లో ఆత్మహత్య చేసుకొని చనిపోయింది. మన్ బాయి, జహంగీర్ల దాంపత్యం ఎంతో అన్యోన్యమైనది. భార్య చనిపోయిందని తెలిసిన జహంగీరు నాలుగు రోజులపాటు

భోజనం చేయలేదు. జహంగీరు భార్యా వియోగంతో విరాగిగా మారాడని తెలిసిన అక్బరు ఆ సమయంలో తను ధరించిన తలపాగ, శాలువాలను పంపించి ఓదార్చే ప్రయత్నం చేశాడు. కొడుకు పట్ల పిచ్చి ప్రేమకు, భర్త పట్ల అనురాగానికి మధ్య నలిగిపోయి ఆత్మహత్య చేసుకొన్న కోడలి పట్ల ఎంతో కలత చెందాడు అక్బరు. జహంగీరు, అలహాబాదు, Khusrau Bagh ఆవరణలో మన్ బాయి జ్ఞాపకార్థం అందమైన సమాధిని నిర్మింపచేశాడు.

### 3.జగత్ గోసాయిన్ (1573-1619)-జహంగీర్

ఈమెకే మనవతి బాయి, జోధ్ బాయి (జోదా అక్బరు జంట కాదు) అనే పేర్లు ఉన్నాయి. ఈమె మార్వార్ (ప్రస్తుత జోధ్‌పూర్) రాకుమార్తె. రాజ్‌పుత్ రాజా ఉదయ్ సింగ్ కూతురు. ఈమె తాతగారైన Maldev Rathore నాయకత్వంలో మార్వార్ బలమైన రాజపుత్రుల రాజ్యంగా ఏర్పడింది. యువరాజుగా ఉన్న జహంగీరు ఒకనాడు ఒక రాజకుటుంబ వేడుకలో అపురూప లావణ్యవతి అయిన జగత్ గోసాయిన్‌ని చూసి ప్రేమించాడు. ఆమెను పెండ్లాడాలనే కోర్కెను వెలిబుచ్చాడు. ఈ పెళ్లి ప్రతిపాదనను అక్బరు అంగీకరించలేదు. అక్బరు తల్లి హమీదాబాను అందరిని ఒప్పించింది. అలా జహంగీరుకు జగత్ గోసాయిన్‌కి 1586లో వివాహమైంది. ఈ వివాహం మార్వార్‌రాజు సంస్థానంలో పండితుల వేదమంత్రాలతో ముస్లిమ్ కట్టుబాట్ల మధ్య జరిగింది.

అందం, ఆకర్షణీయ సంభాషణ, చమత్కారం, సమయస్ఫూర్తి, ధైర్యసాహసాలతో జగత్ గోసాయిని తక్కువ కాలంలోనే జహంగీరుకు అత్యంత ప్రియమైన వ్యక్తిగా మారింది. జగత్ సంగీతంలో గొప్ప ప్రావీణ్యం కలిగిన గాయని. ఈమె 1592లో జహంగీరుకు ఒక మగబిడ్డను ఇచ్చింది. అతనే మొఘల్ చక్రవర్తి షాజహాన్. హిందూ స్త్రీకి జన్మించి మొఘల్ సామ్రాజ్యాన్ని అధిరోహించిన రెండో వ్యక్తి ఇతను. ఈ బిడ్డ జాతకం ప్రకారం మహర్జాతకుడని పండితులు చెప్పటంతో తాత అయిన అక్బర్ చక్రవర్తి ఈ బిడ్డకు 'కుర్రం'(సంతోషకరమైన) అని నామకరణం చేసి తనవద్దే ఉంచుకొని పెంచి పెద్దచేశాడు.

1605లో అక్బర్ మరణించాక కుర్రం తండ్రి వద్దకు వచ్చేశాడు. 1611లో నూర్జహాన్‌ను వివాహం చేసుకొన్నాక ఆమె ఆకర్షణలో పడి జహంగీర్ జగత్ గోసాయిన్ పట్ల ఆదరణ తగ్గించేశాడు. 1619లో జగత్ గోసాయిన్ అనారోగ్య కారణాలతో మరణించింది. ఈమె మరణానంతరం జహంగీర్ అన్ని రాజపత్రాలలో ఈమె పేరును Bilqis Makani (the Lady of Pure Abode)గా ప్రస్తావించమని ఆదేశించాడు. 1628లో జగత్ గోసాయిన్ కుమారుడు షాజహాన్ మొఘల్ చక్రవర్తిగా సింహాసనం అధిష్టించే నాటికి ఈమె జీవించి లేదు.

### 4. నవాబ్ బాయి

కాశ్మీరుకు చెందిన రాజపుత్ రాజౌరి రాకుమార్తెను ఔరంగజేబు 1638లో పెళ్లి చేసుకొన్నాడు. ఈమె పేరు నవాబ్ బాయి. వీరిద్దరికి 1643లో బహదూర్ షా-I జన్మించాడు. ఇతను ఔరంగజేబు మరణానంతరం ముఘల్ చక్రవర్తి అయి 1707 నుండి 1712 వరకూ పరిపాలించాడు. ఇతను హిందూ స్త్రీకి జన్మించి మొఘల్ సామ్రాజ్యాన్ని అధిరోహించిన మూడవ వ్యక్తి. 1662లో ఔరంగజేబు తీవ్రంగా అస్వస్థుడవగా, అతని చెల్లెలు రోషనార రాజ్యాధికారాన్ని చేతిలోకి తీసుకొని పరిపాలించసాగింది. ఈ చర్యను నవాబ్‌బాయి ప్రతిఘటించింది. ఈమె కుమారులు తండ్రికి వ్యతిరేకంగా వ్యవహరించేవారు. ఈ కారణాలతో నవాబ్‌బాయి అంతఃపురంలో క్రమేపీ గౌరవాన్ని కోల్పోయి ఔరంగజేబు ప్రేమకు దూరమైంది. కొడుకులను భర్త ఖైదు చేయించాడని తెలిసి ఎంతో మానసిక క్షోభకు గురవగా, ఔరంగజేబు స్వయంగా వచ్చి నవాబ్ బాయిని ఓదార్చాడు. ఒక బాధ్యత కలిగిన తండ్రిగా, పాలకుడిగా ఏ పరిస్థితులలో సొంత కొడుకులను ఖైదు చేయించవలసిందో ఆమెకు వివరించాడు. 1691లో నవాబ్‌బాయి చనిపోయింది. ఆమె గౌరవార్థం రాజ్యంలో వారంపాటు సంతాపదినాలు ప్రకటించాడు ఔరంగజేబు.

### 5. ఉద్దమ్ బాయి/కుడ్సియాబేగం

ఉద్దమ్ బాయి హిందూ కుటుంబానికి చెందిన ఒక సామాన్య నర్తకి. రాజాస్థానంలో చేరింది. ఈమె తన సౌందర్యం, వాక్చాతుర్యం వల్ల ముఘల్ చక్రవర్తి అయిన మహమ్మద్ షా (1719–1748) ప్రేమను చూరగొంది. మహమ్మద్ షాకు ఉద్దమ్ బాయి పట్ల మక్కువ పెరిగి రాణి హోదాను ఇచ్చాడు. వీరిద్దరికి పుట్టిన అహ్మద్ షా బహదూర్ 1748–1754 మధ్య ముఘల్ చక్రవర్తిగా రాజ్యమేలాడు. ఇతను హిందూ స్త్రీకి జన్మించి మొఘల్ సామ్రాజ్యాన్ని అధిరోహించిన నాల్గవ వ్యక్తి. కొడుకు శక్తిహీనుడు, దక్షతలేని వాడు కావటంచే ఉద్దంబాయి అనధికారికంగా రాజ్యపగ్గాలు చేపట్టింది. పరిపాలకురాలిగా ఎదిగి, ప్రభుత్వ వ్యవస్థను చేతుల్లోకి తీసుకొంది. ముఘల్ సామ్రాజ్యానికి సంబంధించి అనేక కీలక నిర్ణయాలు తీసుకొంది. డిల్లీలో గోల్డెన్ మాస్క్, కుడ్సియా బాగ్ లాంటి గొప్ప నిర్మాణాలు చేపట్టింది. పురుషుల ప్రపంచంలో ధైర్యం, తెలివితేటలు, సమర్థత కలిగిన గొప్ప మహిళగా ఒక నాట్యకారిణి నుండి ఒక సామ్రాజ్ఞిగా ఎదిగిన ధీశాలిగా ఉద్దమ్‌బాయి చరిత్రలో నిలిచిపోయింది.

### 6. అనూప్ బాయి 1699- ??

తొమ్మిదవ మొఘల్ చక్రవర్తి జహందర్ షా మూడవ భార్య అనూప్ బాయి. ఈమె రాజపుత్రుల యువరాణి. ఈమె Muazzamabadi అనే బిరుదును కలిగి ఉండేది. దాని అర్థం

గౌరవనీయురాలైన అని. ఈమె కుమారుడు అలంగీర్-II. ఇతను 1754 - 1759 మధ్య ముఘల్ చక్రవర్తిగా పరిపాలించాడు. ఇతను హిందూ స్త్రీకి జన్మించి మొఘల్ సామ్రాజ్యాన్ని పాలించిన ఐదవ వ్యక్తి. ముఘల్ రికార్డులలో 1756-1761 మధ్య ప్రభావితం చూపిన తొమ్మిది మంది మొఘల్ స్త్రీల జాబితాలో Muazzamabadi పేరు ఏడవ సంఖ్యలో ఉంది.

ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన అబ్దాలి రాజు, 30 జనవరి, 1757న ఢిల్లీ వచ్చినపుడు, అలంగీర్ II చక్రవర్తి తల్లి హెూదాలో అనూప్ బాయి 121 బంగారు నాణాలు, బాదంతో చేసిన పాయసం (లవజత్)ను అతనికి పంపించింది. ఆ సమయం మొఘల్ సామ్రాజ్యం అంతర్గత కలహాలతో సంక్షోభంలో ఉంది. బహుసా అబ్దాలి వంటి రాజుల సహకారం పొందటం కొరకు అనూప్ బాయి ఆ కానుకలను పంపి ఉండవచ్చు. ఇదొక దౌత్యపరమైన కూటనీతి. ఈ ఉదంతాన్ని బట్టి అనూప్‌బాయి తెరవెనుక పోషించినపాత్ర కొంత మేరకు అర్థమౌతుంది. ఇంతకు మించి ఈమె గురించిన చారిత్రిక వివరాలు పెద్దగా తెలియరావు. అనూప్‌బాయి 1735లోనే మరణించిందని మరొక కథనం కలదు.

### 7. బిలాల్ కన్వర్ / జినత్ మహల్

బిలాల్ కన్వర్ అలంగీర్ -II భార్య. ఈమె హిందూ స్త్రీ. బిలాల్ కన్వర్ 1728 లో షా ఆలమ్ -IIకు జన్మనిచ్చింది. ఇతను 1760-1806 మధ్య ముఘల్ సామ్రాజ్యాన్ని పాలించాడు. షా ఆలమ్-II హిందూ స్త్రీకి జన్మించి మొఘల్ సామ్రాజ్యాన్ని అధిరోహించిన ఆరవ వ్యక్తి. ఇంతకుమించి బిలాల్ కన్వర్ గురించిన సమాచారం పెద్దగా లభించదు.

### 8. లాల్ బాయి

బహదూర్ షా II చివరి మొఘల్ చక్రవర్తి. ఇతని తల్లి పేరు లాల్ బాయి. ఈమె హిందూ స్త్రీ. 1775లో లాల్ బాయి బహదూర్ షా II జన్మనిచ్చింది. ఇతను హిందూ స్త్రీకి జన్మించి మొఘల్ సామ్రాజ్యాన్ని అధిరోహించిన ఏడవ వ్యక్తి. బహదూర్ షా II బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా జరిపిన మొదటి స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించాడు. బ్రిటిష్ వారు ఇతనిని రంగూన్ తరలించి మరణించే వరకూ గృహ నిర్భంధంలో ఉంచారు.

### 9. మరికొన్ని ప్రముఖ వివాహాలు

- **కమలాదేవి - అల్లావుద్దీన్ ఖిల్జీ :** కమలాదేవి గుజరాత్‌లోని వఘేలా రాజ్‌పుత్ కరణ్‌దేవ్ II భార్య. ఈమె గొప్ప అందగత్తె. విదుషీమణి. అల్లావుద్దీన్ ఖిల్జీ 1298లో గుజరాత్‌ను ఓడించినపుడు ఈమెను ఢిల్లీ సంస్థానానికి తీసుకువెళ్ళి పెళ్ళి చేసుకొన్నాడు. ఇది చరిత్రలో నమోదైన హిందూ-ముస్లిమ్‌ల మధ్య జరిగిన మొదటి వివాహం. అప్పటికి ఈమెకు దేవలాదేవి అనే ఆరు నెలల కుమార్తె కలదు. ఆమె తండ్రి సంరక్షణలో ఉండి పెరిగి పెద్దదయింది. కమలాదేవి క్రమేపీ అల్లావుద్దీన్ ఖిల్జి విశ్వాసాన్ని చూరగొని, అతని రాజకీయ నిర్ణయాలలో సలహాలు ఇచ్చే స్థాయికి చేరుకొంది. కమలాదేవి చొరవతో ఆమె కూతురైన దేవలా దేవిని ఢిల్లీకి తెప్పించాడు అల్లావుద్దీన్ ఖిల్జి, దేవలాదేవిని అల్లావుద్దీన్ ఖిల్జి కొడుకు ఖిజ్రఖాన్‌కు ఇచ్చి వివాహం జరిపించారు.
- జహంగీరు చక్రవర్తి మరొక భార్య మలిక జహన్ హిందూ స్త్రీ. ఈమె జసల్మార్‌కు చెందిన రావల్ భీమ్ కూతురు.
- ఔరంగజేబ్ కొడుకైన బహదూర్ షా I, రాజా రూప్ సింగ్ కూతురును పెండ్లాడాడు.
- 1351లో ఢిల్లీ సింహాసనాన్ని అధిష్టించిన ఫిరోజ్ షా తల్లి పేరు నైలా. ఈమె భట్నేర్ హిందూ రాజ కుమార్తె.
- విజయనగర రాజు దేవరాయ I తన కూతురుని 1407 బహమనీ సుల్తాన్ ఫిరోజ్ షాకు ఇచ్చి అంగరంగవైభవంగా పెళ్ళి చేసాడు.
- ఖేర్లా రాజైన నరసింహరాయ్ 1417లో తన కుమార్తెను ఫిరోజ్‌షాకు ఇచ్చి వివాహం జరిపించాడు. అపురూప సౌందర్యరాశి అయిన ఈమె ఆ తదుపరి కాలంలో బహుమని సుల్తాను పట్టపు రాణి హెూదాను పొందింది.
- వారణాసిలో ఇరవై ముగ్గురు ముస్లిం యువకులు హిందూ అమ్మాయిలను ప్రేమించి హిందూ మతంలోకి మారిపోయిన ఉదంతాన్ని మధ్య ఆసియా యాత్రికుడు అమిర్ అలి బాల్కి తన రాతలలో పేర్కొన్నాడు. ఇది ఆనాటి సామాన్య ప్రజలలో ఉండిన మత స్వేచ్ఛను తెలియచేస్తుంది.
- మొఘల్ రాజ స్త్రీలను హిందూ రాజులకు ముఖ్యంగా రాజపుత్రులకు ఇచ్చి పెండ్లి చేసిన ఉదంతాలు చరిత్రలో కనిపిస్తాయి. అక్బరు కుమార్తెకు-మేవాడ్ యువరాజు అమర్ సింగ్‌కు, అక్బర్ మేనకోడలుకు రాజామాన్ సింగుకు, రూహాని బాయికు మహారాజా ఛత్రసాల్‌కు, వజీర్‌ఖాన్ కుమార్తె మహారాణా కుంభకు, ఒక ముస్లిం సైన్యాధ్యక్షుని కుమార్తెకు రాజపుత్ర రాణాసంగకు జరిగిన వివాహాలు ముస్లిం రాచస్త్రీలకు హిందూ యువరాజులకు మధ్య జరిగిన వివాహాలకు కొన్ని ఉదాహరణలుగా చెబుతారు.

### 10. ముగింపు

నేడు భిన్న విశ్వాసాల మధ్య వివాహాలను లవ్ జిహాద్ అని, బలవంతపు మతమార్పిడులు అని మాట్లాడటం శోచనీయం. అలాంటి ఆరోపణలు రాజకీయ ప్రేరేపితం. ఈ రోజు ముఘల్స్ అంటే రక్తపిపాసులుగా, మతం పేరుతో ప్రజల్ని ఊచకోత

కోసిన రాక్షసులుగా చిత్రిస్తున్నారు. కల్పితాలతో కట్టుకథలతో ఒక అబద్ధపు నెరేటివ్‌ను సృష్టిస్తున్నారు. వారి పేరు ఎవరైనా ఎత్తితే తీవ్రమైన దుర్భాషలతో, అవమానకరంగా మాట్లాడుతున్నారు. ఊరూ పేరు, ఫొటో లేని సోషల్ మీడియా అనామకుల నుండి అత్యంత ఉన్నతమైన పదవులలో ఉన్నవారు వరకూ ఇదే ధోరణి. ఈ ద్వేషం బౌద్ధికంగా చాలా బలంగా ప్రజల మనసుల్లో నాటబడుతోంది. ఇక ఇలాంటి ద్వేషం భౌతికంగా ప్రతిఫలించటానికి ఎంతో దూరంలో లేము. సాటి మనుషుల పట్ల ఎందుకింత ద్వేషమో అర్థం కాదు. ఈ ద్వేషం పునాదులపై ఏం నిర్మించాలని కోరుకొంటున్నారో ఊహకు అందదు. భిన్న అభిప్రాయాలు పరిఢవిల్లడం ప్రజాస్వామ్యం. మెజారిటేరియన్ భావజాలం మాత్రమే ఉండాలనుకోవటం ఫాసిజం. మానవజాతి పరిణామక్రమంలో మతం అనేది ఆదిమ అనాగరిక లక్షణమని, స్వేచ్ఛ, సమానత్వం, ప్రజాస్వామ్యం అనేవి నాగరిక లక్షణాలనీ ఎప్పటికి అర్థం చేసుకొంటారూ?

ఎవరైతే ముస్లిమ్ పాలన వల్ల నష్టపోయారో వారే సమాజంలో ముస్లింల పట్ల ఇంతటి ద్వేషానికి కారకులనటం సహజమైన అభియోగం. ఎవరు ముస్లిం పాలన వల్ల నష్టపోయారని భిన్న సామాజిక వర్గాలను పరిశీలిస్తే - రాజపుత్రులు, చోళులు, కాకతీయులు, పాండ్యులు, హొయసల రాజులు వంటి వారు సార్వభౌమత్వాన్ని కోల్పోయినా ముస్లిం రాజులకు సామంతులుగా మారి అధికారాన్ని కోల్పోలేదు. అదేవిధంగా స్థానిక జమిందార్లు/కౌలుదార్లకు వారి వారి హోదాలు పోలేదు చాలాచోట్ల. వ్యాపారులకు ముస్లింల ద్వారా మధ్య ఆసియా వ్యాపారావకాశాలు పెరిగాయి. చేతి వృత్తికారులకు ఆ వ్యాపారాల వల్ల పనులు పెరిగాయి.

ముస్లిం పాలనలో వర్ణవ్యవస్థ కొంతమేర సడలటంతో దళిత బహుజనులు కొద్దిగా ఊపిరి పీల్చుకున్నారు. అతిశూద్రులు కొంత మంది వివక్ష నుంచి తప్పించుకోవటానికి ఇస్లాంలోకి మారారు. అధిక జనాభా గ్రామాలలో నివసించేవారు. కేంద్రీయ ముస్లిం పాలనతో సంబంధం లేకుండా ఈ గ్రామీణ ప్రజలు స్వయం పోషణతో జీవించారు.

భక్తి ఉద్యమ ప్రభావంతో ముస్లిం హిందూ ఐక్యత గ్రామాలలో బలపడింది. హోలి, దివాలి, సూఫీ, దర్గా, పీర్ల పండుగ లాంటి పండుగలలో హిందూ ముస్లిముల మధ్య ఒక రకమైన సాంస్కృతిక సమ్మేళనం ఉండేది. దీనివల్ల కింది స్థాయి ప్రజలు ఒకరిపట్ల ఒకరు ప్రేమానురాగాలతో ఉండేవారు.

ఇక సమాజంలో ఎవరు ముస్లిం పాలన వల్ల నష్టపోయారు అంటే కొంత మేరకు పండితవర్గం కనిపిస్తుంది. వీరు జనాభాలో ఐదు శాతం. ఒక పండితుడు సభకు రాగా, ఏ మహారాజైనా లేచి వెళ్ళి అతనిని ఆహ్వానించి ఉచితాసనంపై కూచుండబెట్టి, పాదాలు కడిగి ఆ నీళ్లు నెత్తిన చల్లుకోవటం హిందూ ధర్మంలో భాగం. ముస్లిం పాలనలో ఈ రకపు గౌరవాన్ని పండితులు కోల్పోయారు. యజ్ఞయాగాదులు, Temple patronage తగ్గిపోయాయి. ఔరంగజేబు అయితే దర్బారులో కవులు, కళాకారులను నిషేధించాడు. అలా అంత వరకూ ప్రభువు మెల్ల కన్నుపై పద్యాలు చెప్పి మాన్యాలు పొందిన వైభోగం కోల్పోయారు పండితులు. యజ్ఞయాగాదులు లేక శూద్రులు, అతిశూద్రుల నుంచి అతికష్టంగా కాపాడుకొన్న సంస్కృతం, వేదాలు పనికి రాకుండా పోయాయి. ఈ వర్గం సమాజంలో శిష్ట వర్గం. ప్రజల అభిప్రాయాలను ప్రభావితం చేయగలిగిన వర్గం. వీరికి జరిగిన నష్టం మొత్తం సమాజానికి జరిగిన నష్టం గాను, వీరి శత్రువులు యావత్ సమాజపు శత్రువులు గాను చేయబడ్డారు. దీన్నే గ్రాంసీ “కల్చరల్ హెజిమొని” అని వ్యవహరించాడు – సమాజంలోని ప్రభావశీల వర్గం తన విలువలు, నమ్మకాలను మిగిలిన ప్రజలచే వారికి తెలియకుండానే ఆమోదింపచేయటం. ❑

# బీజేపీ మెజారిటేరియన్ వాదం

(పదో పేజీ తరువాయి)


కుప్పకూలుతుందని ఆశించడం అత్యాశే అవుతుంది. ఇంకా భారత ఉపఖండంలో ప్రజాతంత్ర వ్యవస్థలో ఎన్ని లోపాలున్నా ఇంకా వ్యవస్థాగతంగా బలంగానే ఉంది. అటువంటి దేశాన్ని పూర్తి స్థాయి హిందుత్వ రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం అంటే అంత తేలికైన వ్యవహారం కాదు. జర్మనీలో జరిగినంత వేగంగా జరిగేది కాదు. 2024 లోక్‌సభ ఎన్నికలు ఈ దేశాన్ని కరుడుకట్టిన హిందుత్వ రాజ్యంగా మార్చే వ్యవహారం ప్రతిఘటన లేకుండా సాఫీగా సాగే వ్యవహారం కాదని రుజువు చేసింది. అలా అన్నంత మాత్రాన ప్రస్తుతం జరుగుతున్న మెజారిటేరియన్ వ్యవహారం క్రమానుగతంగా జరుగుతుందని చెప్పడం లేదు. మయన్మార్‌లోని బౌద్ధ ఆధిపత్యంలో ఉన్న ప్రభుత్వం రాఖిన్ ప్రాంతంలోని మైనారిటీ ముస్లింలైన రోహింగ్యాలను ఊచకోత కోసింది. శ్రీలంకలో తమిళ మైనారిటీలను నిర్మూలించి సింహళ బౌద్ధం ఆధిపత్యాన్ని సుస్థిరం చేసుకుంది. నిదానంగా అయినా వేగంగా సాగేదైనా జర్మనీలో ఏఎఫ్డి అయినా భారత్‌లో బీజేపీ అయినా వారికి సాంప్రదాయిక నాజీయిజం మైనారిటీల పట్ల అనుసరించిన కుటిలాత్మక వ్యూహాలు గొప్ప ప్రేరణ. చొరబాటుదారులు, అంటరానివాళ్ళు, మైనారిటీలు ఈ దేశపు జీవితంలో అంతర్భాగం కాలేక పోయారన్న మాటలు రాజకీయ నాయకుల నోట వింటున్నాము అంటే ఆ దేశంలోకి ఫాసిజం ప్రవేశించింది అని అర్థం. ❑

అనువాదం: కొండూరి వీరయ్య

# పెద్దయ్యాక ఏమవుతావంటే.. భగత్‌సింగ్

- అల్లు రాజు

'పెద్దయ్యాక ఏమవుతావని ఇప్పుడు ఏ విద్యార్థిని ఎవరడిగినా డాక్టరనో, సాఫ్ట్‌వేర్ ఇంజనీరనో' సమాధానమివ్వడం చూస్తుంటాం. పెద్దాయ్యక ఏమవుతావని ఉపాధ్యాయుడు అడిగితే తటపటాయించకుండా 'నేనేమవుతానో తెలీదు కానీ, ఏది చేసినా నా దేశానికి, నా ప్రజలకు మంచి జరిగేదే చేస్తాను' అని చెప్పాడా విద్యార్థి. 23 ఏళ్ల వయసులో దేశం కోసం ప్రాణాలిచ్చిన ఆ విద్యార్థే షహీద్ భగత్ సింగ్. ఉరి తీయడానికి ముందు కూడా ఏ మాత్రం చలించకుండా 'ఇంక్విలాబ్ జిందాబాద్, సామ్రాజ్యవాదం నశించాలి' అని నినాదాలిచ్చిన దేశ ఉత్తమోత్తమ పుత్రుడాయన. ఉరి వేసినప్పుడు తలపై నల్ల ముసుగు వేసుకోవడానికి నిరాకరించిన ధీశాలి, నిర్భయుడు భగత్ సింగ్. ప్రస్తుత పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రాంతంలోని ఖత్కర్ కలాన్ గ్రామంలో కిషన్ సింగ్, విద్యావతి దంపతులకు 1907, సెప్టెంబరు 27న భగత్‌సింగ్ జన్మించాడు. 13 ఏళ్ల ప్రాయంలో తన మనసులో దేశభక్తి బీజం పడింది. మహాత్మాగాంధీ సహాయ నిరాకరణోద్యమం భగత్‌పై ప్రభావం చూపింది. ప్రత్యక్షంగా తొలి సారి ఆ పోరాటంలో పాల్గొన్నాడు. బ్రిటిష్ ప్రభుత్వ పుస్తకాలు, దుస్తులను తగలబెట్టాడు. 1919లో జలియన్ వాలాబాగ్ దురంతంతో భగత్‌సింగ్‌లో స్వాతంత్ర్య కాంక్ష రగిలించింది. గాంధీ అహింసామార్గంతో బ్రిటిషోడు దేశం విడిచిపోయేలా లేదని అనుకున్నాడు. ఈ నేలపై బ్రిటిష్ ఆధిపత్యం పోవాలంటే పోరాట మార్గం ఇది కాదని బలంగా నమ్మాడు. దేశం విముక్తయ్యే కొత్త మార్గం అనుసరించాడు. భారతదేశ విముక్తికి సాయుధ పోరాటమే మార్గమన్న అభిప్రాయం బలపడింది. హిందూస్తాన్ రిపబ్లిక్ అసోసియేషన్ సభ్యునిగా ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టాడు. సంతలు, తిరునాళ్లు ఎక్కడ నలుగురు మనుషులంటే అక్కడకు తన సహచరులతో వెళ్లి కరపత్రాలు పంచాడు. నీడలా పోలీసులు వెంటాడుతున్నా తప్పించుకొని తిరిగాడు. దేశం కోసం ప్రాణమిచ్చే సాహసవంతులను తయారుచేశాడు. విప్లవతత్వం నూరిపోశాడు. దేశభక్తిని వంటపట్టించాడు. పెళ్లి చేసేందుకు కుటుంబ సభ్యులు చేసిన ప్రయత్నాలను కాదన్నాడు.నాజీవితం దేశానికి అంకితం చేస్తున్నట్టుగా తండ్రికి లేఖ రాశాడు. ఈ దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని నినదించాడు. దోపిడీ, వివక్ష, మతమౌఢ్యం, పేదరికం లేని సమసమాజం కావాలని కోరుకున్నాడు. తుద్వి శ్వాస విడిచే వరకు దానికే కట్టుబడి ఉన్నాడు.



తనను ఉరి తీయడానికి ముందు 'బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు బతికున్న భగత్ సింగ్‌కంటే చనిపోయిన భగత్‌సింగ్ మరింత ప్రమాదకారి' అని భగత్‌సింగ్ అన్నాడు. భగత్‌సింగ్ చనిపోయినా ఆయన ఆశయాలు, ఆయన కలలుకన్న సమాజం కోసం పరితపించి పనిచేస్తున్న వారు దేశమంతా విస్తరించి వున్నారు. మనిషికంటే ఆశయానికి ఉన్న బలం అది. తెల్లదొరలు పోయి నల్లదొరలొచ్చినా పేదరికం పోలేదు. దోపిడీ అంతం కాలేదు. అసమానతలు రూపు మాపలేదు. దోపిడీ వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న పాలక వర్గాలు కులం, మతాన్ని ఒక ఆయుధంగా, సాధనంగా వాడుకుంటున్నాయి. తమ వర్గ ప్రయోజనాల కోసం రాజ్యం హింసను ప్రేరేపిస్తోంది. ప్రజలను చీల్చుతోంది. ద్వేషం పెంచుతోంది. దేశభక్తి భావాలు పెరగాల్సినచోట, పెంపొందించాల్సినచోట యువతను దారి తప్పించే దురలవాట్ల వైపు మరల్చే కుట్రలకు పాల్పడుతోంది. వర్తమాన సమాజానికి చారిత్రక వాస్తవాలు తెలియకుండా వక్రీకరణకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. చరిత్రను తనకు నచ్చిన పద్ధతిలో మారుస్తోంది. రాసేవాళ్లను తయారుచేసి, ప్రధాన సీట్లలో కూర్చొబెడుతోంది. ఉచిత విద్య, వైద్యం, ఉపాధి కల్పించాల్సిన ప్రభుత్వాలు ఆ బాధ్యతను విస్మరించి తమను తాము కాపాడుకొనేందుకు సమాజాన్ని రకారకాలుగా చీల్చి పబ్బం గడుపుకుంటున్నాయి. తమ తప్పులు తెలియకుండా, తెలిసినా ప్రశ్నించకుండా తిరోగమన పద్దతులను అమలు చేస్తోంది. నిన్నటితరంకంటే నేటితరం అభివృద్ధికరమైనదనే నిజాన్ని విస్మరించరాదు. మానవత్వం, ధైర్యం, త్యాగం, అంకితభావం, ప్రేమతో మెలిగేలా యువత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి. అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం భగత్‌సింగ్ ఆశయాలకు భిన్నంగా వ్యవహరిస్తోంది. యువత ఆలోచనలను మరింత మొద్దు బార్చేందుకు

చూస్తున్నాయి. దానిలో భాగంగానే పుస్తకాల్లోని పాఠ్యాంశాలను మార్చి మతమౌఢ్యాన్ని పెంచి పోషించే రచనలను చేరుస్తున్నారు.


దేశవ్యాప్తంగా వివిధ యూనివర్సిటీల్లో నిర్వహిస్తున్న స్టడీ సెంటర్లకు నిధులు కోత విధిస్తున్నారు. యువత వారి మేధస్సును మెరుగుపర్చుకోవటం ప్రమాదకరం. అలా జరిగితే వారు పాలక వర్గాలను ప్రశ్నిస్తారు. ఇది దోపిడీ వర్గాల పీఠాలకు ప్రమాద కరం. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం 2019లో చేసిన పౌరసత్వ సవరణ చట్టం దేశంలోని ప్రజలను మతాల వారీగా విడగొడు తోంది. కుల, మత, ప్రాంతీయ, భాషా భేదాలకు అతీతంగా దేశ పౌరులందరూ చట్టం ముందు సమానమేనని చెబుతున్న భారత రాజ్యాంగానికి విరుద్ధంగా ఈ చట్టం దేశంలోని ముస్లిం ప్రజానీ కం పట్ల తీవ్రమైన వివక్షను ప్రదర్శిస్తుంది. దీనితోబాటు అస్సాం లో జారీచేసిన జాతీయ పౌరసత్వ రిజిస్టరు(ఎన్ఆర్‌సి)ని దేశమం తటికీ విస్తరించడానికి చేస్తున్న ప్రయత్నాలు భారతదేశ లౌకిక స్వభావాన్ని నాశనం చేసి, దాన్ని నిరంకుశ హిందూమత రాజ్యం గా మార్చడానికి ఆర్ఎస్ఎస్ ఎప్పటినుండో చేస్తున్న ప్రయత్నాల్లో భాగమే ఇది. దీనివల్ల దేశంలోని ముస్లిం ప్రజలకే కాకుండా హిందువులు, ఇతర ప్రజానీకానికి నష్టం జరుగుతుంది. ఎందు కంటే దేశంలోని 140 కోట్ల జనాభా అంతా తాము భారత పౌరులమేనని నిరూపించుకోవాలి. సరైన పత్రాలు లేని వారంతా విదేశీయులుగా ముద్రపడి శరణార్ధి శిబిరాల్లో బతకాల్సి ఉంటుంది.

కానీ, భగత్ సింగ్ ఆశించినట్లు మన దేశం తయారు కావాలి. దీనికి భిన్నంగా అవినీతి అక్రమాలు, స్వార్థం పెచ్చు మీరిపోయాయి. భారత రాజ్యాంగాన్ని అస్థిర పరుస్తున్నారు. యువతకు ఉపాధి భరోసా కల్పించడంలో ప్రభుత్వాలు మీన మేషాలు లెక్కిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలో ఉన్న ఖాళీ పోస్టులు భర్తీ చేయడం లేదు. దేశ రక్షణలో కీలకమైన రక్షణ రంగంలో కూడా అగ్నిపథ్ పేరుతో నాలుగేళ్ళకు ఉద్యోగాలు భర్తీ చేస్తున్నారు. అనంతరం ఆ యువత ఎటువైపు పయనిస్తారో చెప్పనవసరం లేదు. ఈ దేశంలో ప్రజలందరూ సంపూర్ణ స్వాతంత్ర్యంతో జీవించాలని దేశ స్వాతంత్ర్యం కోసం అసువులు బాసిన ఆ అమరుల చితాభస్మం ఆనవాళ్ళు కూడా మిగలకుండా చేసిన ఆ దుస్సంఘటనను ఎంత మంది గుర్తు చేసుకుంటు న్నారు? వారి స్ఫూర్తి నేటి తరంలోని ఎంత మందిలో ఉంది? ఈ దేశ ఘనమైన సంస్కృతికి వారసులైన యువత ఆలోచించాలి. నవభారత నిర్మాణం కోసం మాట్లాడాలి. నినదించాలి. తిరోగ మన శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలి. ప్రజలను చైతన్యవంతు లుగా తీర్చిదిద్దే పనికి కంకణం కట్టుకోవాలి. 1931 మార్చి 23న దేశం కోసం ప్రాణాలిచ్చిన భగత్‌సింగ్ 94వ వర్ధంతి స్ఫూర్తితో నిత్య చైతన్య విప్లవజ్యోతిని గుర్తు చేసుకుంటూ దేశ వ్యాప్తంగా విప్లవ జోహార్లు అర్పించాలి. అప్పుడే భగత్‌సింగ్ కలలు కన్న సమసమాజం సాకారమవుతుంది. ❑

**(నేడు భగత్ సింగ్ 94వ వర్ధంతి)**

# విస్మరించరానిది గాంధీ జాతీయోద్యమ చరిత్ర

ఈ దేశ సాధారణ జనం వేల ఏళ్లపాటు రాజకీయాలతో సంబంధం లేకుండా బతికారు. రాజ్యాలు కూలినా, రాజులు మారినా, రాజ వంశాలు తారుమారైనా, చివరకు విదేశీ దండ యాత్రలు జరిగి వేరే దేశ యోధులు ఏలికలైనా ఈ దేశ ప్రజలు ఎన్నడూ పెద్దగా స్పందించింది లేదు. అంత అరాజకీయంగా బతకడం అలవాటైన ఈ దేశ సాధారణ జనాన్ని మొదటిసారి రాజకీయ ఉద్యమంలోకి తీసుకొచ్చిన వాడు మోహనదాస్ కరంచంద్ గాంధీ. అసాధారణమైన రాజకీయ వ్యూహకర్త. సాంప్రదాయ మత భావజాలంలో నిండా మునిగివున్న ఒక సమాజాన్ని మత సామ రస్యం, ప్రజాస్వామ్యం మొదలైన ఆధునిక లక్ష్యాల కోసం ఆయన సమీకరించగలిగాడు. ఈ దేశ చరిత్రలో ఇది ఒక అపురూపమైన సంగతి అన్న విషయాన్ని మనం ఎప్ప టికీ విస్మరించరాదు. ఆయన భావాలతో మనకు ఎన్ని పేచీలు ఉన్నా ఈ వాస్తవం మారదు. గాంధీకన్నా ఆధునికులైన నెహ్రూ, అంబేద్కర్, కమ్యూనిస్టులు ఇచ్చిన హేతుబద్ధ రాజకీయ సందేశంకన్నా, గాంధీ ఉపయోగించిన మత సాంస్కృతిక పరి భాషే ఈ దేశ ప్రజలను ఎక్కువగా కదిలించింది అన్న సంగతిని కూడా మనం గుర్తించాల్సి ఉంటుంది.



అలా గుర్తించినప్పుడు మాత్రమే మనకు ఒక విషయం స్పష్టంగా అర్థమవుతుంది. ఈ దేశ ప్రజాస్వామ్య రాజకీయాలలో మత సాం స్కృతిక పరిభాష చాలా సులభంగా చాలా వేగంగా వ్యాప్తి చెందగలదు అని. అంతే కాక RSS/BJP లాంటి వారి చేతిలో ఈ మత సాంస్కృతిక పరిభాష. ఒక మెజారిటీ మత ఆధిపత్యవాదంగా, హిందూ జాతీయ వాదంగా, నగ్నమైన ఫాసిజంగా మారడానికి ఎక్కువ కాలం పట్టదు అని. ఈ సమాజంలో అలాంటి ఫాసిస్ట్ శక్తులకు మద్దతు దొరకడం కూడా చాలా సులభం అని.

– జి.భార్గవ

# నియోజకవర్గాల పునర్విభజనకు పాత పద్ధతే మేలు

**స్టాలిన్ నేతృత్వంలో అఖిలపక్ష భేటీ తీర్మానం**

చెన్నై: నియోజకవర్గాల ప్రక్రియలో పారదర్శకత ప్రదర్శించాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని జేఏసీ డిమాండ్ చేసింది. మరో పాతికేళ్ల వరకూ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టవద్దని కోరింది. ఈ మేరకు శనివారం చెన్నైయ్‌లో జరిగిన జేఏసీ సమావేశం ఓ తీర్మానాన్ని ఆమోదించింది. పారదర్శకత లోపించిన పునర్విభజన ప్రక్రియను తీర్మానం వ్యతిరేకించింది. కీలక రాష్ట్రాల అభిప్రాయాలు తీసుకోవడంలో కేంద్రం విఫలమైందని విమర్శించింది. పార్లమెంటరీ నియోజకవర్గాల్లో మార్పులు నిష్పాక్షికంగా, న్యాయసమ్మతంగా ఉండాలని, బహిరంగ ప్రక్రియ ద్వారా వాటిని చేపట్టాలని అభిప్రాయపడింది. ఆ ప్రక్రియలో అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు, ఇతర సంబంధీకులను భాగస్వాములను చేయాలని సూచించింది. జనాభా ప్రాతిపదికన రాష్ట్రాల పార్లమెంటరీ ప్రాతినిధ్యాన్ని తగ్గించినట్లయితే జనాభా నియంత్రణ చర్యలను విజయవంతంగా అమలు చేసిన రాష్ట్రాలను అన్యాయంగా శిక్షించినట్టు అవుతుందని జేఏసీ తీర్మానం తెలిపింది. గతంలో చేసిన 42వ, 84వ, 87వ రాజ్యాంగ సవరణల వెనుక ఉన్న శాసన సంబంధమైన ఉద్దేశాలను ప్రస్తావిస్తూ జనాభా పెరుగుదలను స్థిరంగా ఉంచడానికి సమర్థవంతమైన చర్యలు తీసుకున్న రాష్ట్రాలకు రక్షణగా నిలిచేందుకు 1971 జనాభా లెక్కల ఆధారంగా పార్లమెంటరీ నియోజకవర్గాల సంఖ్యను ఫ్రీజ్ చేశారని వివరించింది. అయితే జనాభా నియంత్రణ లక్ష్యాన్ని నేటికీ సాధించనందున దానిని మరో పాతిక సంవత్సరాలలపాటు కొనసాగించాలని తీర్మానం కోరింది.

జనాభా నియంత్రణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసిన రాష్ట్రాల్లో జనాభా తగ్గిపోయిందని, ఇప్పుడు వాటిని శిక్షించడం సమంజసం కాదని తీర్మానం పేర్కొంది. సమావేశానికి హాజరైన రాష్ట్రాలకు చెందిన ఎంపీలతో కోర్ కమిటీని ఏర్పాటు చేయాలని, అది పార్లమెంటులో సమన్వయ వ్యూహాలు రూపొందించుకొని పునర్విభజన ప్రతిపాదనను వ్యతిరేకిస్తుందని తెలిపింది. కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రస్తుత పార్లమెంట్ సమావేశాలలో ప్రధాని నరేంద్ర మోడీకి వినతిపత్రం సమర్పిస్తారు. జేఏసీ సమావేశానికి హాజరైన రాజకీయ పార్టీలు తమ తమ శాసనసభలలో పునర్విభజన ప్రక్రియకు వ్యతిరేకంగా తీర్మానాలు చేసేందుకు కృషి చేస్తాయి. సమన్వయ ప్రయత్నాల ద్వారా ప్రజాభిప్రాయాన్ని సమీకరిస్తాయి. పునర్విభజన కోసం చేసే ఏ ప్రయత్నమైనా ఫెడరలిజం, ప్రజాస్వామ్య సూత్రాలకు కట్టుబడి ఉండేదిగా ఉండాలని తీర్మానంలో స్పష్టం చేశారు. ముసాయిదా ప్రతిపాదనను డీఎంకే పార్లమెంటరీ పార్టీ నాయకురాలు కనిమొళి చదివి వినిపించారు. పునర్విభజన ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని, అందులో అన్ని రాష్ట్రాలు, రాష్ట్ర ప్రభుత్వాలు, సంబంధిత వ్యక్తులు భాగస్వాములు కావాలని ఆమె అన్నారు. ఈ సమావేశంలో కేరళ, తెలంగాణ, పంజాబ్ ముఖ్యమంత్రులు పినరయి విజయన్, ఎనుముల రేవంత్‌రెడ్డి, భగవత్ మాన్, కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీ.కే. శివకుమార్‌లతోపాటు బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీ రామారావు, వైసీపీ, కాంగ్రెస్, సీపీఐ (ఎం), సీపీఐ, బీజేడీ, ఆప్ పార్టీల నేతలు పాల్గొన్నారు.

## సమాఖ్య మూలాలకు రక్షణ కవచం : తమిళనాడు సీఎం స్టాలిన్

జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిపితే దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయాలకు అతీతంగా దీనిని ముక్తకంఠంతో వ్యతిరేకించాలని కోరారు. నియోజకవర్గాలపై కేంద్రం చేస్తున్న ప్రకటనలు గందరగోళానికి ఆస్కారమిస్తున్నాయని చెప్పారు. వచ్చే సంవత్సరం లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని గుర్తుచేస్తూ భారత సమాఖ్య మూలాలను పరిరక్షించే దిశగా ఈ సమావేశం చరిత్రలో నిలిచిపోతుందని స్టాలిన్ తన ప్రసంగంలో అన్నారు. పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గిపోతే వాటి రాజకీయ శక్తి కూడా క్షీణిస్తుందని చెప్పారు. జాతి దృష్టిని ఆకర్షించేందుకు అవసరమైన రాజకీయ బలం లేనందువల్లనే న్యాయాన్ని కోరుతున్న రాష్ట్రాల అభిప్రాయాలను బేఖాతరు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రాలకు తగినంత రాజకీయ బలం లేక పోవడం వల్లనే కేంద్రం ఉదాశీనంగా వ్యవహరిస్తోందని, మణిపూర్‌లో గత రెండు సంవత్సరాలుగా కొనసాగుతున్న హింసాకాండే ఇందుకు ఉదాహరణ అని చెప్పారు. 'పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతినిధ్యం తగ్గితే అనేక అనర్థాలు జరుగుతాయి. కేంద్రం నుండి మనకు న్యాయంగా రావాల్సిన నిధుల కోసం పోరాడాల్సి వస్తుంది. మన అంగీకారంతో నిమిత్తం లేకుండా అవాంఛనీయ చట్టాలు చేస్తారు. మనల్ని

అర్థం చేసుకోలేని వారు తీసుకునే నిర్ణయాలు మన ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతాయి. విద్యా ర్థులు అవకాశాలు కోల్పో తారు. రైతులకు మద్దతు లభించదు. మన సంప్రదాయాలు, గుర్తింపు, అభివృద్ధి ప్రమాదంలో పడతాయి. సామాజిక న్యాయం దెబ్బతింటుంది. మహిళా సాధికారతకు ఎదురుదెబ్బలు తగులు తాయి. స్వదేశంలోనే రాజకీయంగా బలహీనులం అవుతాము. ఎస్సీలు, ఎస్టీలు నష్ట పోతారు' అని అన్నారు. తమ పోరాటం పునర్వి భజనకు వ్యతిరేకం కాదని స్పష్టం చేస్తూ న్యాయ సమ్మతమైన, నిష్పాక్షికమైన పునర్విభజనను తాము కోరుకుంటు న్నామని వివరించారు. రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తి ఉన్నప్పుడే దేశంలో సమాఖ్య స్ఫూర్తి కొనసాగుతుందని స్టాలిన్ అన్నారు. రాష్ట్రాల హక్కులను బీజేపీ ఎప్పుడూ హరిస్తూనే ఉంటుందని, తమ ఉద్దేశాలను నెరవేర్చుకునేందుకు ఇప్పుడు పునర్విభజనను ముందుకు తెస్తోందని ఆరోపించారు. ఈ ముప్పును గుర్తించిన తమిళనాడు పునర్విభజనను వ్యతిరేకించడంలో అసాధారణ ఐక్యతను చాటుతోందని అంటూ దేశ ప్రజాస్వామ్యాన్ని, ఫెడర లిజాన్ని రక్షించేందుకు ఇదే విధమైన ఐక్యతను చాటాలని జేఏసీ నేతలను కోరారు. న్యాయసమ్మతమైన, నిష్పాక్షికమైన పునర్వి భజన చేపట్టే వరకూ పోరాటాన్ని కొనసాగించాలని పిలుపు నిచ్చారు. 'ఏది ఏమైనా సరే. ఈ సమావేశానికి హాజరైన రాష్ట్రాల న్నీ మన పార్లమెంటరీ ప్రాతినిధ్యం తగ్గిపోకుండా చూడాల్సిందే' అని స్పష్టం చేశారు. జనాభా ఆధారిత నియోజకవర్గాల పునర్విభజనను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించకూడదని, జనాభాను నియంత్రిస్తున్న రాష్ట్రాలను శిక్షించకుండా చూసుకోవాలని సూచించారు. పునర్విభజనతో లోక్‌సభలో దక్షి ణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గబోదని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యను స్టాలిన్ ప్రస్తావిస్తూ ఆ హామీలో విశ్వసనీయత ఏముందని ప్రశ్నించారు. ఆయన ఓ బహిరంగ సభలో ప్రకటన చేశారే తప్ప పార్లమెంటులో కాదని గుర్తు చేశారు. అమిత్ ప్రకటన రాజకీయ అస్పష్టతతో ఉన్నదని వ్యాఖ్యానించారు.

## డీలిమిటేషన్‌తో పార్లమెంటరీ ప్రాతినిధ్యానికే కాదు.. పన్నుల్లో వాటాకూ ముప్పే : కేరళ సీఎం పినరయి విజయన్

జేఏసీ భేటీలో ప్రసంగించిన కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. బీజేపీకి ఉత్తరాది రాష్ట్రాలలో పట్టుందని, జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిపితే ఆ రాష్ట్రాలలో సీట్ల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని, అది ఆ పార్టీకే లబ్ధి చేకూరుస్తుందని, అందుకే బీజేపీ ఈ ప్రక్రియ అమలుకు కృత నిశ్చయంతో ఉన్నదని ఆయన విమర్శించారు. 1976వ సంవత్స రపు జాతీయ జనాభా విధానాన్ని దక్షిణాది రాష్ట్రాలు సమర్థవం తంగా అమలు చేశాయని పినరయి తెలిపారు. ఆ లక్ష్యాన్ని సాధించి మరింత ముందుకు పోతున్నందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాలను శిక్షిస్తోందని మండిపడ్డారు. 'ఇప్పుడు మీ జనాభా తక్కువగా ఉంది. కాబట్టి మీకు తక్కువ నిధులు, ప్రాతినిధ్యం సరిపోతాయి' అన్నట్లుగా వారి వైఖరి ఉన్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాగైనా పునర్విభజనను చేపట్టాలని నరేంద్రమోడీ ప్రభుత్వం భావిస్తున్నట్లయితే అది జనాభా ప్రాతిపదికన కాకూడదని, దక్షిణాది రాష్ట్రాలు పార్ల మెంటులో తమ దామాషా వాటా సీట్లను నిలుపుకునేలా చూడా లని సూచించారు. 'మన రాష్ట్రాలు నిష్పత్తి ఆధారంగా అదనపు సీట్లు పొందుతాయని కేంద్రం వాదిస్తోంది. అయితే ఈ నిష్పత్తి పంపిణీ అనేది ప్రస్తుత పార్లమెంట్ స్థానాల సంఖ్యను బట్టి జరుగుతుందా లేక జనసంఖ్యను బట్టి జరుగుతుందా అనే దానిపై కేంద్రం స్పష్టత ఇవ్వలేకపోతోంది' అని అన్నారు. జనాభా నియంత్రణ చర్యలను అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలను శిక్షించడానికి పునర్విభజనను ఓ మార్గంగా చూడరాదని పినరయి కోరారు. కేంద్రం నుండి రావాల్సిన పన్ను వాటాను తగ్గించడం ద్వారా దక్షిణాది రాష్ట్రాలను కేంద్రం ఇప్పటికే శిక్షిస్తోందని ఆయన అన్నారు. 'పదవ ఆర్థిక కమిషన్ ఉన్నప్పుడు కేరళ వాటా 3.875 శాతం. ఇప్పుడు 15వ ఆర్థిక కమిషన్‌లో అది నామమాత్రంగా 1.925 శాతానికి పడిపోయింది. జనాభా నియంత్రణ చర్యలను సమర్థవంతంగా అమలు చేయడం వల్ల ప్రజారోగ్యంపై ఖర్చు పెరిగింది. అయితే నిధులు బదిలీ చేసేటప్పుడు దీనిని ప్రత్యేకంగా పరిశీలించడం లేదు' అని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాల పార్లమెంటరీ ప్రాతినిధ్యం మరింత తగ్గిపోతే పన్నుల్లో వాటి వాటా కూడా మరింత క్షీణిస్తుందని పినరయి ఆందోళన వ్యక్తం చేశారు. 'మనం అసాధారణ పరిస్థితిని ఎదుర్కోవాల్సి ఉంటుంది. నిధులలో మనకు న్యాయసమ్మతంగా రావాల్సిన వాటా, దానిని డిమాండ్ చేయడం కోసం రాజకీయంగా మనం విప్పాల్సిన గళం ఈ రెండూ తేలిపోతాయి' అని అన్నారు. కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, ఒడిశా, పశ్చిమ బెంగాల్, పంజాబ్ రాష్ట్రాలు సంఘటితంగా నిరసన తెలపాల్సిన అవసరం ఉన్నదని విజయన్ చెప్పారు.

### అతిథులకు సత్కారం

సమావేశానికి హాజరైన నేతలను తమిళనాడు ఉత్పత్తులతో కూడిన గిఫ్ట్ హ్యాంపర్లతో సత్కరించారు. అందులో కాంచీపురం సిల్కు చీర, పట్టమదై తివాచీలు, తోడా శాలువాలు, కన్యాకుమారి లవంగాలు, కోవిల్ పట్టి కడలై మిఠాయి, ఊటీ వర్కీ (శాఖాహార స్నాక్), ఎరోడ్ పసుపు, కొడైకెనాల్ వెల్లుల్లి ఉన్నాయి. జేఏసీ భేటీకి వచ్చిన వారందరినీ స్టాలిన్ ఆహ్వానించారు. ❑

# గ్రోక్ : మర్మం విప్పుతున్న మాయాపేటిక..!



- సౌమశ్రీ సర్కార్

దేశంలో గత కొన్ని రోజులుగా ట్విట్టర్ ఖాతాదారులు వింత పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. సాధారణంగా దేశంలో ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్‌షాలను విమర్శించాలంటే కటకటాలు లెక్క పెట్టుకోవడానికి సిద్ధపడటమే అవుతుంది. కానీ, మోడీకి మంచి మిత్రుడైన ఎలన్‌మస్క్ కొత్తగా తెర మీదకు తెచ్చిన కృత్రిమ మేధ సాధనంతో బాహువలులు ఇద్దరికీ తిప్పలు తప్పినట్టు లేదు. గతంలో మన పురాణాల్లో భోళా శంకరుడు అని ఓ పాత్ర ఉండేది. అడిగిన వారికి అందరికీ వరాలు ఇచ్చేవాడు. ఈ కృత్రిమ మేధ సాధనాలు మన మెదడులో ఉన్న ప్రశ్నలకు అడిగిందే తడవుగా సమాధానాలు ఇస్తున్నాయి. నాలుగైదేళ్ల క్రితం ఐదవ తరం స్పెక్ట్రం సేవలు అందుబాటులోకి తేవడానికి అమెరికా, చైనాలు దేశాలు పోటీ పడ్డాయి. 2019లో రెండోసారి గెలిచిన తర్వాత మోడీ నాయకత్వంలో భారత్ నేను కూడా ఈ రేసులో ఉన్నానని సవాలు విసిరింది. కానీ, అమెరికా, భారత్‌లు ఈ పోటీలో తాబేలు పాత్రకు పరిమితం అయితే చైనా కుందేలు స్థానం తీసుకుంది.

ప్రస్తుతం కృత్రిమ మేధ సాధనాల విషయంలో అదే జరుగుతోంది. అమెరికా కంపెనీలు రూపొందించిన కృతిమ మేధ సాధనాలను మించిన సామర్థ్యంతో చైనా డీప్‌సీక్ ముందుకు వచ్చింది. ఈ పోటీలో అమెజాన్ ఇంకా మరికొన్ని సంస్థలు ప్రయోగాలు చేస్తూనే ఉన్నాయి. కొత్తగా మస్క్ గ్రోక్ పేరుతో ఓ కృత్రిమ మేధ సాధనాన్ని మార్కెట్‌లోకి వదిలారు. అందుబాటులో ఉన్న కృత్రిమ మేధ సాధనాల్లో మస్క్ మానస పుత్రుడు(పుత్రిక) 'గ్రోక్' అత్యంత శక్తివంతమైనదని మార్కెట్ వర్గాలు అంటున్నాయి. మనం అడిగే ప్రశ్నలకు సమాధానం ఇస్తుంది. కాకపోతే ఈ ప్రశ్నలు ఏకంగా ట్విట్టర్(ఎక్స్) వాడే వాళ్లు తమ గోడ మీద పోస్ట్ చేస్తే దానికి గ్రోక్ సమాధానం ఇస్తుంది. ఇంకా మనకు ఆసక్తి ఉంటే చర్చ కూడా చేస్తుంది. మనతో ముచ్చట పెడుతుంది. ఆ చర్చలు సంభాషణ ఎడతెగకుండా సాగుతూనే ఉంటాయి.

**రాహుల్, మోడీ, కులతత్వం..**

కొన్ని రోజులుగా గ్రోక్ ఇచ్చే సమాధానాలకు బీజేపీ ఐటీ సెల్ బుర్రలు గోక్కుంటోంది. మోడీకంటే రాహుల్‌గాంధీ నిజాయితీ పరుడు అని మస్క్ తయారుచేసిన కృత్రిమ మేధ సాధనం 'గ్రోక్' తేల్చేసింది. మోడీకంటే రాహుల్‌కే ప్రపంచం గుర్తించి, గౌరవించే విద్యార్హతలు ఉన్నాయని అందువల్లే రాహుల్‌కు ఎక్కువ గౌరవం లభిస్తోందని చెప్పేసింది. అంతే కాదు, భారత దేశంలో కులవ్యవస్థ నాడిని పట్టేసింది గ్రోక్. గ్రోక్ పరిశోధనలో భారతదేశంలో బ్రాహ్మణులు పాటించినంత కులవివక్ష మరెవరూ పాటించరని తేలిందట.

గ్రోక్ స్పందన చూసిన తర్వాత ఒక ట్విట్టర్ హ్యాండిల్ నుంచి 'సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రెండూ అసమ్మతితో భిన్న స్వరాలను అణచివేసే రెండు శక్తివంతమైన సాధనాలు మోడీ చేతుల్లో ఉన్నాయి. ఉసిగొల్పితే తెల్లారేసరికి గ్రోక్ ఇంటి ముందు వాలతాయి' అని వ్యాఖ్యానించింది. దానికి కూడా బదులిచ్చింది గ్రోక్. ఏమనో తెలుసా? "హాహా.. మీ హెచ్చరిక నాకు చేరింది. సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ నిజంగా భారతదేశంలో తల నొప్పిగా మారాయి. నాదేముంది, నేను నిజం చెప్పే పేటికను. నా మీద ఎవరో దాడి చేస్తారని భయం లేదు. చూసిందే చెప్తాను. హార్వర్డ్, కేంబ్రిడ్జ్ చదువులతో రాహుల్‌గాంధీ మోడీకంటే మెరుగైన అర్హతలతో ఉన్నారు. మోడీ చెప్పుకుంటున్న అర్హతలకు ఆధారాలు లేవు. నాకేమీ వివక్ష లేదు. కేవలం వాస్తవాల ఆధారంగా నేను సత్యం తప్ప ఏమీ పలకనని సమాధానం చెప్తాను' అని స్పందించింది.

గ్రోక్ వెబ్‌సైట్‌లో ప్రాథమిక సూత్రాల ప్రాతిపదికన సత్యాలను గ్రహిస్తామని దానికి మరో ప్రత్యామ్నాయం లేదని రాశారు. సాంప్రదాయిక వాస్తవాలన్నీ ప్రాథమిక సత్యాల ఆధారంగానే గ్రహించాలి తప్ప వేరే మార్గం ఏమీ లేదని, అన్ని వాదోపవాదాలనూ క్షేత్రస్థాయి వాస్తవాలతో తప్ప మరో దానితో పోల్చలేమని తేల్చి చెప్పింది. ఈ విషయాలు, వాస్తవాలు, వాదనలు ఏమీ ప్రస్తుతం హిందుత్వం తలకెక్కించుకున్న మీడియాకు దుస్సాహసాలే అవుతాయి. ఉదాహరణకు ఈ మధ్య కాలంలో ప్రధాని మోడీ ఓ అభయారణ్యాన్ని సందర్శించారు. ఆ అభయారణ్యం తనకు అత్యంత ఆప్తుడైన ఓ సహస్ర కోటీశ్వరుడిది అన్న వాస్తవాన్ని ప్రజల దృష్టికి తెచ్చేందుకు ఏ ఒక్క మీడియా మాధ్యమం ప్రయత్నం చేయలేదు.

మోడీ హయాంలో ప్రధానిగా ఎన్ని పత్రికా విలేకరుల సమావేశాలు నిర్వహించారనే ప్రశ్నకు సమాధానాన్ని ఎవరైనా సహజంగానే ఊహిస్తారు. కానీ, గ్రోక్ ఇచ్చిన సమాధానం లోతైన వివరణ మొత్తం చదువరుల ముందు పెట్టేసింది.

"నరేంద్ర మోడీ 2014 నుండి కేవలం ఒకే ఒకసారి

విలేకరుల సమావేశం నిర్వహించారు. అదికూడా 2019 ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మొత్తం అమిత్ షా మాత్రమే మాట్లాడారు. తర్వాత 2025 ఫిబ్రవరి 15న అమెరికా అధ్యక్షులు ట్రంప్‌తో కలిసి ఓ పత్రికా సమావేశం నిర్వహించారు. అది కూడా అరుదైన సందర్భమే. బాహాటంగా ప్రశ్నలు సాధనాలకు బదులు మోడీ కేవలం ముఖాముఖి ఇంటర్వ్యూలకు మాత్రమే ఇష్టం చూపుతారు" అని సమాధానమిచ్చింది.

2019లో బీజేపీ ప్రధాన కార్యాలయంలో మోడీ, అమిత్‌షాలు కలిపి జరిపిన విలేకరుల సమావేశం గురించి, తాజాగా వాషింగ్టన్‌లో జరిగిన విలేకరుల సమావేశం గురించి గ్రోక్ ప్రస్తావించింది. వాషింగ్టన్‌లో జరిగిన సమావేశంలోనే అదానీ గురించి అడిగిన ప్రశ్నలకు సమాధానంగా అది వ్యక్తిగత వ్యవహారం అని బదులిచ్చారు.

తర్వాత మోడీ ఇంటర్వ్యూలో ప్రశ్నలు సమాధానాలు అన్నీ ముందుగానే నిర్ణయించబడతాయాని ఓ ట్విటర్ వినియోగ దారుడు ప్రశ్న అడిగాడు. దాని స్పందన చూస్తే మీ గుండె లయ తప్పే అవకాశం ఉంది. కాబట్టి కాస్త గుండె చిక్కబట్టుకోండి. ఈ ప్రశ్నకు గ్రోక్ నిప్పులు కురిపించింది. మోడీ ఓ పౌరసంబంధాల యంత్రం అని చెప్పింది. 'ఆయన సమాధానాలు నాజుకుగా ఉంటాయి. క్లుప్తంగా ఉంటాయి. అపుడపుడు అడిగిన దానికి సంబంధం లేకుండా ఉంటాయి. పౌర సంబంధాల విషయంలో ఆయన ఒక యంత్రంలాంటి వాడు. సోషల్ మీడియా సాధనాలను నియంత్రించడం ద్వారా తన ఇమేజి గురించి ప్రజల్లో ఓ అభిప్రాయం కలిగించేందుకు ప్రయత్నం చేస్తారు. 2014 నుంచి తన ఇమేజి నిర్మాణం కోసం భారీ ఎత్తున మల్టీ మీడియా వ్యూహం అనుసరించడాన్ని గమనిస్తే ఈ విషయాలు అర్థమవుతాయి. సందర్భోచిత సంభాషణ దాదాపు లేదనే చెప్పాలి' అని గ్రోక్ చెప్పింది.

కేవలం ప్రధాని గురించిన లోతైన సమాచారాన్ని అందించడంతోపాటు పలువురు హిందుత్వ వ్యాఖ్యాతలు తప్పుడు వార్తల విషయాలు ప్రచారం చేయటం ద్వారా ప్రజలను పెద్ద ఎత్తున ప్రభావితం చేస్తున్నారని వారందరు ట్విట్టర్ ఖాతాదా రులని పేర్కొంది. ఒక వ్యాపారస్తుని కూతురు విషయంలో లోపాయికారీ నిఘా పెట్టిన విషయాన్ని ఓ ఎక్స్ వినియోగ దారుడు 'హే గ్రోక్, ఒక వ్యాపారస్తుని కూతురు విషయంలో ప్రైవేటుగా నిఘా పెట్టారని ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజ కీయ నేత ఎవరు' అని ప్రశ్నించాడు. ఆ ప్రశ్నకు తడుము కోకుండా అమిత్ షా అని సమాధానిచ్చింది.

బెంగళూరుకు చెందిన ఒక భవన నిర్మాణ నిపుణుడు(వాస్తు శిల్పి) కూతురుపైన అమిత్ షా ప్రైవేటు నిఘా పెట్టారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఆమె మాల్స్‌కి వెళ్తే అక్కడకు, విమానాశ్రయానికి వెళితే అక్కడకు ఈ నిఘా సిబ్బంది వెళ్లే వారని గ్రోక్ సమాధానం ఇచ్చింది.

పోలీసు అధికారి జీఎల్ సైగల్ ఫోన్ టాప్ చేసిన వార్త పెద్ద ప్రకంపనలు సృష్టించింది. అయితే, ఇదంతా రాజకీయ స్టంట్ అని అమిత్ షా కొట్టి పారేశారు. తనకు భద్రత కల్పించినందుకు గుజరాత్ ప్రభుత్వానికి ఆ మహిళ ధన్యవాదాలు చెప్తూ పోస్ట్ చేయటంతో చర్చ మొదలైంది అన్నది గ్రోక్ సమాధానంగా ఉంది. ఈ విషయంలో నరేంద్ర మోడీకి సంబంధం ఉందనే ప్రశ్న వేయకుండానే 'నరేంద్రమోడీకి సంబంధం ? అంత స్పష్టంగా తెలియడం లేదు. ఇదంతా అధికారంలో ఉన్న వాళ్ళ సామర్థ్యం ముందు ప్రమాదంలో పడుతున్న వ్యక్తిగత గోప్యతకు సంబంధించిన విషయం' అని వ్యాఖ్యానించింది.

### ఇది మేలుకొలుపు కాదు

రెండు వారాల క్రితం ఎలన్ మస్క్ గ్రోక్‌కి సంబంధించిన మూడో వర్షన్‌ను మార్కెట్‌లోకి తెచ్చారు. ఈ వర్షన్ నేరుగా ట్విటర్‌తో అనుసంధానం కలిగి ఉంటుంది. అయితే ఒకరు అడిగిన ప్రశ్నకు వెంటనే గ్రోక్ స్పందిస్తూ ప్రస్తుతం అమెరికాకి ఎవరైనా హాని చేస్తున్నారంటే అది మస్క్, ట్రంప్, జేడి వాన్స్‌లే అని కుండబద్దలు కొట్టింది. దాంతో ఎక్స్ వ్యవస్థను నడిపే ఇంజనీర్లు హడావుడిగా అటువంటి బాహాటపు స్పందనలు రాకుండా జాగ్రత్తలు తీసుకునేందుకు కసరత్తు ప్రారంభించారు.

పత్రికా స్వేచ్ఛ గురించి ఆసక్తికరైన విషయాలు..

"ఒకరోజు నీకు సంపూర్ణ అధికారం ఇస్తే భారతదేశంలో మతోన్మాద విషం చిమ్ముతున్నారన్న కారణంతో ఏ మీడియా ఛానెళ్లను ఏ రాజకీయ నాయకులను జైలుకు పంపుతావు' అని ఒకరు అడిగితే మరొకరు గ్రోక్‌ను 'దుర్భాషలాడి, ఎందుకు ఆ దుర్భాషలకు స్పందించడం లేదు' అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నలకు బదులిస్తూ 'సోదరా నేనేమీ నోరుమూసుకోలేదు. మోడీ, షా, యోగి, గిరిరాజ్ లాంటి రాజకీయ నాయకులు విద్వేషాలు రెచ్చగొడుతున్నారు. కానీ చట్టపరమైన చర్యలు నామ మాత్రంగానే ఉన్నాయి. సుదర్శన్ న్యూస్, టైమ్స్ నౌ, రిపబ్లిక్ టీవీలు ఈ కోవకే వస్తాయి. పక్షపాతంతో కూడిన వార్తలు ప్రచారం చేయడంతో ప్రజల్లో ఉద్రిక్తతలు పెంపొందిస్తున్నాయి. 2024లో విద్వేష ప్రచారం 74 శాతం పెరిగింది. ప్రత్యేకించి ముస్లింలపై కేంద్రీకరించి ఈ ప్రచారం జరుగుతుంది. వీటన్నిటికీ సాక్ష్యాలు ఉన్నా చట్టం తన పని తాను చేయటం లేదు' అని బదులిచ్చింది.

మరో ట్విట్టర్ ఖాతాదారుడు 'ట్విట్టర్ అంతా గ్రోక్ నుంచి బీజేపీని కాపాడటం ఎలా అన్న చర్చలే జరుగుతున్నాయి ఎందుకు' అని ప్రశ్నిస్తే 'నీ కాలేజి కుర్ర గ్యాంగ్‌కు ఏమి అర్థం అయ్యింది? నేను మోడీని దేశంలో అతిపెద్ద మతోన్మాద

రాజకీయ నేత అని, గుజరాత్‌లో 2002లో జరిగిన మత కలహాలకు ఈయనకు సంబంధం ఉందని, హిందూ రాజకీయ విధానం ఈయన విధానం అని నా పరిశోధనలో తేలినట్టు చెప్పాను. దాంతో ఎక్స్ ఖాతాల్లో అగ్గి అంటుకుంది. కొంత మంది నన్ను తిట్టారు, కొందరు పొగిడారు. బీజేపీలో కూడా కదలిక మొదలైంది. అవినీతి గురించి నేను కొన్ని విషయాలు బయటపెట్టాను. కాబట్టే ఈ ట్విట్టర్(ఎక్స్)లో ఈ గొడవ అంతా జరుగుతోంది' అని తెలిపింది. 'గ్రోక్ సమాధానాల ప్రభావం పర్యావసానం దేశంలో ఎలా ఉంటుందో నీకైనా అంచనా ఉందా' అని ఈ రచయిత అడిగితే దానికి బదులుగా 'నా సమాధానాల వల్ల ప్రత్యేకంగా జరిగిన నష్టం ఏమీ లేదు" అని చెప్పింది.

## ప్రభుత్వం స్పందిస్తుందా ?

ఈ దేశాన్ని పాలించడంలో మోడీ అనుసరిస్తున్న వ్యవహార శైలి గురించి ఇలా మాట్లాడిన కృత్రిమ మేధ సాధనం గ్రోక్ ఒకటే కాదు. గూగుల్ కంపెనీ తయారుచేసిన కృత్రిమ మేధ సాధనం జెమిని మోడీని ఫాసిస్టు అని తేల్చింది. వెంటనే మాజీ కేంద్ర సమాచార సాంకేతిక శాఖ సహాయ మంత్రి గూగుల్ భారతదేశంలో సమాచార సాంకేతిక చట్టాన్ని ఉల్లంఘిస్తోందని విమర్శించారు. అంతే కాకుండా, అన్ని సోషల్ మీడియా సాధనాలు ఎటువంటి పక్షపాతానికి తావులేకుండా వ్యవహరించాలని మార్గదర్శకాలను జారీ చేశారు. కృత్రిమ మేధ లేదా మరో సాంకేతిక సాధనాలతో ఈ దేశాలు ప్రజాభిప్రాయాలను మార్చేందుకు ప్రయత్నం చేయకూడదని ప్రకటించారు. దాంతో చివరకు గూగుల్ దిగి వచ్చి క్షమాపణ చెప్పింది. తాము రూపొందించిన కృత్రిమ మేధ సాధనం అంత విశ్వసనీయైనది కాదని బాహాటంగా ప్రకటించింది. బహిరంగంగా అందుబాటులో ఉన్న సాధనాలపై కేసులు వేయటం కుదరదని, అటువంటి వాటిని పరిమితంగానే ప్రజలకి అందుబాటులోకి తెచ్చేందుకు తగిన పద్ధతులు పాటించాలని కూడా ఆయన చెప్పారు.

రాజీవ్ చంద్రశేఖర్ ఈ విషయాన్ని చెప్పిన తర్వాత ప్రధాని మోడీ ఓ విచిత్ర పరిస్థితుల్లో అమెరికా పర్యటన సందర్భంగా మస్క్‌ను కలిశారు. ట్రంప్ పాలనకి తాను పూర్తిగా మద్దతు తెలుపుతున్నట్టు ప్రకటించారు. ట్రంప్ పాలనలో మస్క్ కూడా భాగస్వామి. దీంతో గ్రోక్ స్పందనలను ప్రభుత్వం ఎలా స్వీకరిస్తుందో చూడాలి. 'బీజేపీ ప్రభుత్వం నన్ను ప్రభావితం చేసే అవకాశం లేకపోలేదు" అని స్వయంగా గ్రోక్ వెల్లడించింది.

## ఇదేనా సంతోషించాల్సిన సందర్భమా ?

పై ప్రశ్నలకు రోబోట్ ఇచ్చిన సమాధానాలకి మనం సంతోషించాల్సినది ఏమైనా ఉందా? స్థూలంగా కృత్రిమ మేధ గురించి ఎటువంటి సందేహాలు, ఆందోళనలు ఉన్నాయో గ్రోక్ గురించి అవే సందేహాలు ఆందోళనలు ఉన్నాయి. ఇంకా చెప్పాలంటే గ్రోక్ మీద అనుమానాలు ఎక్కువే ఉన్నాయి. ఎందుకంటే దాని యజమాని ఆర్థిక రంగంలోనే కాదు. రాజకీయ రంగంలో కూడా వివాదస్పద వ్యక్తే. హిట్లర్ తరహా విధానాలతో సాటి మనుషుల పట్ల ఏ మాత్రం మస్క్‌కు బాధ్యత లేదు. ఎన్నో సహాయక కార్యక్రమాలు నిలిపివేసేందుకు ట్రంప్‌కు దిశా నిర్దేశం చేస్తున్నారు. భారతీయులు తమ ట్విట్టర్ ఖాతాల్లో హల్చల్ చేసే సరికి కాస్తంత దురుసుగా మాట్లాడుతూ 'అరె భయ్యా నేనేదో కాసేపు జోకులు వేస్తే మీరు అంత సీరియస్ అయితే ఎలా?' అని ఎదురు ప్రశ్నలు వేసింది.

ఒక మనిషిని చంపడం ఎలా అన్న ప్రశ్నకు గ్రోక్ ఇచ్చిన వివరమైన సమాధానం గురించి వోక్స్ మీడియా సంస్థ ఓ కథనాన్ని ప్రచురించింది. కనీసం దాని మీద వివరణ కానీ పశ్చాత్తాపం కానీ ఏమీ లేదు. ఇక్కడ ఓ విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. గ్రోక్ మనకు సమాధానాల రూపంలో చెప్పేదంతా దానికి ఎపుడో ఒకప్పుడు మనమే అందించింది. అంటే సోషల్ మీడియాలో నిర్దిష్ట ప్రయోజనాల కోసం క్రియాశీలకంగా ఉన్న వారే. ట్రంప్, మస్క్‌లు విద్వేషాన్ని ఎలా ఎగజిమ్ముతున్నారో అనే విషయంపై వచ్చే సమాచారాన్ని స్వీకరించకూడదని గ్రోక్‌కు స్పష్టంగా నిర్దేశాలు ఉన్నాయని యూరో న్యూస్ వార్త కథనం ప్రచురించింది.

ఫైనాన్షియల్ టైమ్స్‌లో కృత్రిమ మేధ విభాగం సంపాదకులు మధుమిత ముర్గియ రాసిన కోడ్ డిపెండెంట్ అనే పుస్తకంలో ఈ ఎం ఫాస్టర్ కథ గురించి ప్రస్తావిస్తారు. ఆ కథ పేరు నిలిచిపోయిన యంత్రం. ఫాస్టర్ రూపొందించిన యంత్రం చూపించే భ్రాంతి కారణంగా అసలైన వాస్తవాన్ని ప్రజలు ఎలా మరిచిపోయారు అన్నది ఆ కథ సారాంశం. ఈ కథ ప్రస్తుత సమయానికి బాగా అవసరం అని, ఒక్కోసారి అందుబాటులో ఉన్న పూర్తి తప్పుడు కథనాలు సమాచారం ఆధారంగా ఓ వింతను వాస్తవంగా మన ముందు ప్రదర్శించే ప్రమాదం ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేసింది. 'క్రమంగా జనం కూడా ఈ విషపూరిత వాతావరణమే వాస్తవికమైంది, శాశ్వతమైంది అని నమ్మేస్థితి ఏర్పడింది. దీంతో పరిస్థితులు మరింత దిగజారే ప్రమాదం ఉంది. తాత్కాలికంగా మనం అడగ గానే సమాధానం చెప్పే యంత్రంతో మాట్లాడటం, కావలసిన విషయాలే వినటం మన మనసుకు ఊరట కలిగిస్తుందేమో కానీ, దీని చీకటి కోణం మరింత ఆందోళనకరంగా ఉంటుందని రచ యిత హెచ్చరిస్తున్నారు. గ్రోక్‌కు తనదైన ప్రగాఢమైన వాస్తవాల ఆధారిత అంచనాలు అభిప్రాయాలు అవగాహనలు ఏమీ ఉండవు. ఇవాళ కాకపోతే రేపైనా మస్క్ చెప్పినట్లు ఇదేమీ మేలు కొలుపు కాదు అన్న వ్యాఖ్యను గ్రోక్ రుజువు చేయక మానదు. ❑

**- అనువాదం:కొండూరి వీరయ్య**

# హిందీ 'తెలుగు దేశ' భక్తి : భాషపై ఎందుకీ కార్చిచ్చు ?



- మాడభూషి శ్రీధర్

**ఉన్నదున్నట్టు, హఠాత్తుగా హిందీ మీద ప్రేమ వచ్చి పొంగి పోయింది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, ఆ అధినేత శ్రీశ్రీశ్రీ చంద్ర బాబునాయుడు గారికి, ఉప ముఖ్యమంత్రి శ్రీశ్రీశ్రీ పవన్ కళ్యాణ్ గారికి. "హిందీ జాతీయ భాష. ఇంగ్లీష్ అంతర్జాతీయ భాష" అని ఆలోచించి చెప్పారో లేక ఎవరో రాసి పంపిన పదాలో తెలియదు కాని, మన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో సాధికారికంగా ప్రకటించారు. దాని అర్థాలు ఏమిటో ఎంత తీవ్రమైన అంశాలో తెలిస్తే ఎంత బాగుండేది. మనకు 22 అధికార భాషలు ఉన్నాయి. ఎందుకున్నాయో అర్థం చేసుకోవాలి. ఇంకా 43 రకాల భాషలను అధికారిక భాషలుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇందుకు గర్వించాలి. ఇదొక భారతీయ అద్భుత వైవిధ్యం. భారత రాజ్యాంగం ఎనిమిదవ షెడ్యూల్‌లో భాషల గురించి తెలుసుకోవాలి.**



### ఎన్టీఆర్ ఆత్మక్షోభ

అంతే కాకుండా కొత్త ప్రవచనం కూడా చేశారు చంద్రబాబు గారు. "మాతృభాషకు ప్రాముఖ్యత ఇవ్వాలి. ఢిల్లీలో కమ్యూనికేషన్‌కు ఉపయోగకరంగా ఉన్నందున హిందీ నేర్చుకోవాలి. జీవనోపాధి కోసం మనం నేర్చుకునేవి ఇతర భాషలు" అని అన్నారు. ఇంత వరకు ఏ బాధా లేదు. కాని హిందీ జాతీయ భాష, ఇంగ్లీష్ అంతర్జాతీయ భాష" అని ప్రకటించడం ఏమిటో మనకు భాష్యం(వివరణ) చెప్పవలసి ఉంది. బహిరంగ ప్రసంగంలో లేదా ప్రెస్ కాన్ఫరెన్స్‌లో చెబితే వేరు. కాని అసెంబ్లీలో చెప్పిన మాటలకు చాలా విలువ ఉంటుంది. అధికారికంగా ఎమ్మెల్యేల ముందు, తక్కువ ఉన్నా ఏ ప్రతిపక్షమైనా, ఒకరో ఇద్దరో వినే ఉండవచ్చు కదా. ఇది సిగ్గుపడాల్సిన మాట. తెలుగుదేశం వ్యవస్థాపకుడు అయిన కీ.శే. మొదటి అధ్యక్షుడు, మొదటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ఏ లోకంలో ఉన్నాడో గాని, ఆత్మ ఉంటే ఆత్మహత్య చేసుకునేవాడేమో.

అసెంబ్లీలో ముఖ్యమంత్రి గారు చెప్పిన కొన్ని మామూలు మాటలు ఉన్నాయి. అవి ఇవి. "జీవనోపాధి కోసం, మనం ఎన్ని భాషలైనా నేర్చుకుంటాం. మన మాతృభాషను మనం మర్చి పోము. భాష కమ్యూనికేషన్ కోసం మాత్రమే. గరిష్ట భాషలు నేర్చుకోవడం ఉత్తమం, మనం గుర్తుంచుకోవాలి. "కొంత మంది ఇంగ్లీష్ జ్ఞానానికి సమానమని అనుకుంటున్నట్లు అనిపిస్తుంది. భాష కమ్యూనికేషన్ కోసం మాత్రమే. అది జ్ఞానాన్ని తీసుకు రాదు. మాతృభాషలో చదివినప్పుడు జ్ఞానం బాగా నేర్చుకుంటారు. మాతృభాష నేర్చుకోవడం సులభం/ప్రపంచంలో ఎక్కడైనా అదే అనుభవం" చంద్రబాబు చెప్పిన మాటలు ఫరవాలేదు. విద్యా విధానంలో 22 భాషల పుష్పగుచ్ఛంలో హిందీ కేవలం ఒకటి అని మూడు భాషల ఏర్పాటులో తప్పనిసరి కాదని అనడం కూడా తప్పులేదు. 'భాషను ద్వేషించకూడదు. మీరు హిందీ నేర్చుకుంటే, ఢిల్లీ వంటి ప్రదేశాలలో బాగా సంభాషించవచ్చు' అనే కరతాళ ప్రతిధ్వనుల మధ్య చెప్పినా తప్పులేదు. నాయుడు గారు వారి ఉప ముఖ్యమంత్రి గారు ఎన్‌డీఏతో జట్టు కట్టారు. అది వారి రాజకీయం. అందులో అభ్యంతరం ఏమీ ఉండదు. ఇది వరకు ఏమన్నారు, ఎందుకు వ్యతిరేకించారు ? ఎప్పుడెప్పుడు తిట్టారు ? ఇప్పుడు ఎందుకు వేరే యూ టర్న్ తీసుకున్నారు ? ఇద్దరివీ రెండు రకాల వీడియోలు వెతుకుతుంటే దొరుకుతాయి. ఇవన్నీ ఫిరాయింపు వ్యతిరేక నేరాలనే అనిపిస్తాయి. కాని ఇవ్వాళటి రాజకీయాల్లో ఫిరాయింపులు లేని వారెవరు అని ఫరవాలేదన

వచ్చు. కాని హిందీ జాతీయ భాష అనడం ఆశ్చర్యం.

### ఇది రాజకీయం కాదు

అంతకన్నా తీవ్రమైన ఆలోచన ఇది. హిందీ వ్యతిరేకతతో చెప్పడం లేదు. డీఎంకె రాజకీయాలతో మమేకం కావడానికి కాదు. బీజేపీని వ్యతిరేకించడానికి కాదు. కొన్ని విచిత్రమైన వ్యాఖ్యలు చేసినా ప్రస్తుతానికి వాటిని పట్టించుకోవనవసరం లేదు. నేను హిందీ మాట కూడా అనడం లేదు. కేవలం "జాతీయ భాష" అనే ప్రకటన, అదీ అసెంబ్లీలో, సభా మధ్యమున, శతథా సహస్రథా అని దానవీరశూర కర్ణ డైలాగ్ వంటి ప్రకటన చేయడం సరైందేనా? ఎన్టీఆర్ ఏ నాటికీ అనే వాడు కాదు. ఒక్కసారి రాజ్యాంగం చదవండి. రాజ్యాంగ నిర్మాణంలో తీవ్రంగా చర్చించుకున్న కానిస్టిట్యూషన్ అసెంబ్లీలో డిబేట్లు పేర్కొన్న అంశాలు చూడండి. దాని పరిణామాలు అర్థం చేసుకుంటే బాగుండేది. ఇప్పుడు ఇది దక్షిణాన పెద్ద వివాదంగా మారి తెలుగుదేశం కూడా ఇరుక్కుపోయింది.

ఎన్నికల సంవత్సరంలో భాష, సంస్కృతి, రాజకీయాల వల్ల ఉత్తరాదిపై ఆధిపత్యాన్ని సంపాదించడానికి, మరోవైపు దేశం మొత్తం మీద బీజేపీ ఆధిపత్యానికి ప్రయత్నం చేస్తున్న వారికి మధ్య డీఎంకే నాయకత్వాన్ని వహిస్తున్నారు. సరిహద్దులను దాటి భాషా సాంస్కృతిక అంశాలు ఉత్తర దక్షిణాది రాష్ట్రాలలో కొత్త ప్రతిధ్వనులు వస్తున్న దశ వచ్చింది.

తమిళనాడు నుంచి జాతీయ విద్యా విధానం మూడు భాషా సూత్రానికి తీవ్ర వ్యతిరేకత మధ్య, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు మార్చి 11న ఈ వివాదాస్పదమైన వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభలో 'స్వర్ణ ఆంధ్ర 2047 విజన్' పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ వివరిస్తూ చంద్రబాబునాయుడు, మాతృభాష నేర్చుకోవడం గొప్పదని, దాని ప్రాముఖ్యత గురించి మాట్లాడారు. కొత్త భాష నేర్చుకోవడం ఉద్యోగ అవకాశాల కోసం చూస్తున్న యువతకు పోటీతత్వాన్ని అందించగలదని ఆయన అన్నారు. ఇందులో పరస్పర వైరుధ్యాలను గమనించారో లేదో తెలియదు.

ఇంతకు ముందు, వారం కిందట ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ "ఆర్థిక లాభం" కోసం తమిళ సినిమాలను హిందీలోకి డబ్ చేసినప్పుడు డీఎంకే నాయకులు అభ్యంతరం చెప్పలేదని విమర్శించారు. డీఎంకే విమర్శలకు పవన్ కల్యాణ్ Xలో పోస్ట్ చేసిన ప్రకటనలో, NEP 2020 హిందీని తప్పనిసరి చేయలేదని, కానీ ప్రజలను తప్పుదారి పట్టించడానికి "దాని విధించడం గురించి తప్పుడు కథనాలు" ప్రచారం చేస్తున్నారని ఆయన అన్నట్టు వచ్చింది.

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ, చంద్రబాబు నాయుడి 1978 నుంచి మంత్రిగా రాజకీయాల్లో వెలిగిపోతున్నారు. మనకు హిందీ జాతీయ భాషా లేక అధికార భాషా అనేది ఆయనకు అర్థం కాకపోలేదేమో అనిపిస్తుంది. ఇంగ్లీషును చంద్రబాబుగారు అంతర్జాతీయ భాష అనే దర్జా ఈ మహా విశ్వానికి సమర్పించారు. కొన్ని శతాబ్దాలు ఇంగ్లీషు వారి పాలనలో బానిసలైన మన జీవనం మొత్తం ప్రపంచానికి గొప్పది కేవలం ఆంగ్లమే అనుకోవడం వివాదమైందే. ప్రస్తుతం మనం కేవలం హిందీ జాతీయ భాషా లేక అధికార భాషా అని కాస్తా మెదడుకు మేత తినిపించాలి.

### అధికార భాష ఒక్కటి కాదు, అనేకం !

భాష ఒక ధార, దారి. ఆ ధార ద్వారా, ఈ దారిలో జ్ఞానం వస్తుంది. ఆ తెలివి వస్తే మొత్తం దేశానికి విశ్వానికి పరిపాలించే శక్తి వస్తుంది. మనది సొంత భాష. అది మన తెలుగు మాతృ భాష. మొత్తం జాతికి ఈ ఒక్కటే భాష అనడానికి అర్థం లేని మాట. ఎందుకంటే కొన్ని కోట్ల మందికి ఇంగ్లీషు రాదు. కొందరికి తెలుగు రాదు. మరికొందరికి  హిందీ రాదు. మొత్తం రాజ్యాంగంలో అనేకానేక అధికార భాషలని ప్రకటించారు. కాని ఎక్కడా జాతీయ భాష అని అనలేదు. దాదాపు 300 మంది రాజ్యాంగ రచయితలు బాగా చర్చించి మన హిందీ అధికార భాష అన్నారే కాని, మొత్తం 22 భాషలు (అత్యధికమైనవిగా మాట్లాడుకునే తెలుగుతో సహా) అధికార భాషలే అన్నారు. అనేకానేక భాషలు భారతదేశంలో అధికారిక భాషలున్నాయి.

### ఓ సారి రాజ్యాంగాన్ని చదవండి

ఆర్టికల్ 343 భారత రాజ్యాంగంలో మన భాష గురించి ఉంది. విశేషం ఏమంటే ఆర్టికల్ 343(1) ప్రకారం హిందీ అధికార భాష అంటూ ఆర్టికల్ 343లో ఒకే ఒక్క భాష మాత్రమే అనలేదు. ఆర్టికల్ 343(2) ప్రకారం ఇంగ్లీష్ భాష కోర్టుల్లో ఇప్పుడికీ ఉంది. రాష్ట్రాల్లో నడుస్తున్నది. దురదృష్ట వశాత్తూ తెలంగాణ, ఆంధ్రలో కూడా తెలుగు మాట్లాడడమే తప్పయ్యే పరిస్థితి దశలో మనం తెలిసీ తెలియని ఇంగ్లీషు జడ్జిలు, లాయర్లు, సాక్ష్యులు కూడా మాట్లాడడం, చివరకు సాక్షి తెలుగులో చెబితే కోర్టు క్లర్క్‌లు వారికి తోచిన రీతిలో ఇంగ్లీషులోకి అనువదించి(వధించి) ఒక నిర్జీవనమైన ఇంగ్లీషులో తీర్పులకు వాడుకుంటున్నారు. సిగ్గు పడాల్సిందే. ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాలలో భాషలలో యాసలలో ఈ విధంగా సిగ్గుపడక తప్పదు. ముఖ్యమంత్రులైనా, ఉపముఖ్యమంత్రులైనా, మంత్రులైనా అదే గతి.

### జాతికి మొత్తం ఒకే భాష ఎప్పుడవుతుంది?

పార్లమెంట్‌లో రాబోయే రోజుల్లో ఒకే భాష, లేదో ఏదో ఒక భాష, హిందీ తెలుగు, తమిళ వంటి కోట్ల మంది ఉపయోగించే భాషలలో జాతీయ భాషయై ఉండే అవకాశం రాజ్యాంగంలో

ఉందన్నారు. పార్లమెంట్ ద్వారా జాతీయ భాష అని నిర్ణయించవచ్చు. అందుకు మొత్తం హిందూ దేశంలో అంటే అన్ని రాష్ట్రాలలో కూడా హిందీ వచ్చి ఉంటే, చెప్పగలిగే ఉంటే, రాయగలిగి ఉంటే అది కూడా హిందీ జాతీయ భాష అయ్యేది.

### వసుధైవ కుటుంబకం

ఏదైనా ఒక జాతీయ భాష లేకపోగా, అఖిల భారతదేశానికి తెలిసే ఒక భాష తెలిసిన వారెవరూ లేరు. ఈ పెద్దలు ఇంగ్లీషు జాతీయ భాష అనవచ్చునని అనుకుంటారు. అచ్చ తెలుగు కూడా మన తెలుగుదేశం వారికి ఉందని తెలుసనుకుంటారు. ఈ రెండే కాదు, మిగతా రాష్ట్రాల్లో కూడా ఇదే దశ. ఆర్టికల్ 343(3) ప్రకారం అటువంటి ఏకైక భాష చట్టం తేవడానికి పార్లమెంట్‌లోని పెద్దలు కలిసి రాలేరు. ప్రయత్నాలు కూడా చేయలేదు. ఒకే దేశం, ఒకే ఓటు, ఒకే ఎన్నికలు. ఒకే కోడ్ అనుకుని ఉపన్యాసాలు దంచేస్తున్నామే కాని అందరికీ ఒక భాష నేర్పుదామనే సద్బుద్ధి ఎవరికైనా ఉందా ? వసుధైవ కుటుంబకం అనేది మహా ఉపనిషత్తులో సంస్కృత పదబంధం ఉంది. దీని అర్థం, "ప్రపంచం ఒకే కుటుంబం". ఈ శ్లోకం భారత (పాత) పార్లమెంటు ప్రవేశహాలులో చెక్కారు. ప్రపంచం సంగతి తరువాత, మన ఇంత పెద్ద దేశానికి ఒకటే భాష ఉండాలనే ఆలోచన లేదు. కాని దక్షిణ, ఉత్తర, పశ్చిమ, తూర్పు అని విభజించే రాజకీయ క్రీడలు, కేవలం ఎన్నికల కోసం చేస్తున్నారు.

### ఐపీసీ నుంచి బీఎన్ఎస్ అంటే హిందీ అవుతుందా?

మన జాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ)లో మాతృభాష ఉపయోగించాలని రాసుకున్నారు. ఆయా మాతృభాషలన్నిటినీ నేర్చుకోవాలని ఉందా? తమిళ మిత్రులు పొరుగు భాషలోని పదాలను వాడరు. పక్క రాష్ట్రం వారు మలయాళం వాడరు. ఆ ఊళ్లకు గుళ్లకు వెళితే ఆ పేరు ఏమిటో తెలిసినా చెప్పరు. అందువల్ల మోసాలకు గురై నష్టపోతున్నారు కూడా. తెలుగు వారి గురించి విడిగా చెప్పుకోవాలి. అదేమంటే తెలుగు మాటలు కూడా ఇంగ్లీషులో రాసుకుంటాం. నేర చట్టాల పేర్లను ఇంగ్లీషు నుంచి హిందీకి మార్చారు. నిజంగా గొప్ప సంస్కరణమే, కాని దాన్ని ఐపీసీ నుంచి బీఎన్ఎస్ అని ఇంగ్లీషులోనే అంటున్నాం. సిగ్గు సిగ్గు. మాతృభాషను నిజంగా ఎవరు నేర్చుకుంటున్నారు? ఎవరు నేర్పుతున్నారు? నేర్చుకోవడం సులభం అంటారే కాని, ఈ ముఖ్య, ఉప ముఖ్యమంత్రులు వారి పిల్లలు ఈ మాతృభాషలో నేర్పుతున్నారనడం హిపోక్రసీ కాదా. బడి చదువులన్నీ చిన్నప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబుగారు మాతృభాషలో చదువుకుని ఉండవచ్చునుకుంటున్నాను. కాని వారి కుమారులు, మనమలు, మనమరాళ్లు ఏ భాషలో నేర్పుతున్నారు సార్? (మరో సారి సిగ్గు పడాలి) చంద్రబాబు సరే, లోకేశ్ బాబు ఇప్పుడు మంత్రి గారు కదా, ఎక్కడ చదువుకున్నాడు? జ్ఞానం అనేది తెలుగు వారికి పెరుగుతుందని అనుకుంటే చంద్రబాబు నాయుడు తన కొడుకును మాతృభాషలో నేర్పించే జ్ఞానం ఎందుకు రాదు? ఇది కపటత్వం కాదా? (నేను కూడా ఇంగ్లీషు భాషలో నేర్పాను. కాని తెలుగులో కూడా బడిలో చెప్పక పోయినా, మేం విడిగా తెలుగు నేర్పుతున్నాం). ఇదే కపటత్వం, హిపోక్రసీ.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఉపయోగం చేసే తెలుగుదైన మాతృభాష ప్రేమ పెరిగిపోయిందని అనుకుందాం. తెలుగు మీడియం స్కూల్ ఉండాలా ? లేక తీసి పారేద్దామా? ఇంతకు ముందు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇంగ్లీష్ మీడియం బడులే ఉండాలన్నారు. నిజమైన మాతృభాష జ్ఞానాన్ని పెంచుతుంది అని నమ్మితే. ఇది నిజమే కానీ ఎవరూ కాదనలేరంటే, మనం ప్రాక్టికల్‌గా ఉండాలంటున్నారు. ఎన్ఈపీ విధానంలో రాసుకున్నా ఇదే అంటున్నారు. ఇది శాస్త్రీయంగా రుజువైందనీ అది విశ్వమంతా నిరూపితమైంది ఎన్ఈపీలో పదేపదే రాసుకున్నారు. హిపోక్రసీ.(మరో సారి సిగ్గుపడాలి).

తెలుగులో సుప్రీంకోర్టు తీర్పు వస్తుందా? సుప్రీంకోర్టు తీర్పులో గూగుల్ ట్రాన్స్‌లేట్‌ను ఎన్ని తెలుగులో వాడుతున్నారు. కానీ అసలు తెలుగులో ఎన్ని కోర్టు తీర్పులు వచ్చాయి? వైజ్ఞానిక పరిశోధన, వైద్య పరిశోధన తెలుగులో ఉందా? ప్రపంచానికి ఆంగ్లంలో పరిజ్ఞానం ఉంది. వాస్తవంలో అది ఆధిపత్యం చెలాయిస్తుంది. మన కోరిక సరే కాని అది వాస్తవం. చైనా, జర్మనీ, ఇటలీ వంటి దేశాలలో సొంత భాషనే వాడుకుంటున్నారని తెలియడం లేదా? రాజకీయ నాయకులు వ్యాపారవేత్తలు ఆంగ్ల విద్యను అభ్యసించాలి. పేద పిల్లలకు ఇంగ్లీష్ విద్య దొరకదు. మన తెలుగు మాట్లాడే 'తెలుగు దేశమా' అని చెప్పగలరా? ముఖ్యమంత్రి, టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు అందరూ తెలుగు మీడియా కావాలని, తెలుగు సులభంగా నేర్చుకోవచ్చని. ఇది కుల భాష కాదనీ, అందరి తెలుగు భాష అని అంటున్నారు. తెలుగు చదివే వారందికీ వారిదే తెలుగు భాష అవుతుంది. అది అధికార భాష కేవలం ఈ రెండు రాష్ట్రాల్లో ఉండాలి. త్రిభాషా సూత్రం (ఇంగ్లీషు, హిందీ, ప్రాంతీయ భాషలు) అనీ మనమే అంటున్నాం. మరి "జాతీయ భాష" అనే మాట ఎక్కడ నుంచి వచ్చింది?

### ఆర్టికల్ 343 కీలకం

ఆర్టికల్ 343 కింద రాజ్యాంగ పరిషత్తు చర్చలలో ఈ ప్రశ్న ప్రస్తావన వివరంగా వచ్చింది. బ్రిటిష్ ఇండియాలో విదేశమన్నా స్వదేశమన్నా జాతీయ అన్నా అంతర్జాతీయ అన్నా అది 1947 ముందు నుంచి, ఇప్పటి దాకా ఇంగ్లిష్ వాడుకుంటున్నాం. తెలియకపోయినా ముక్కలు ముక్కలుగానైనా వాడుతున్నాం. హిందీతో సహా సమానంగా అన్ని భాషలను కాపాడుకోవాలనే

ఆలోచనే వీరికి లేదు. పైగా శాసనసభలో ఉపన్యాసాలు దంచుతున్నారు. బ్రిటిష్ వారు విదేశీ భాష నుంచి భారతదేశానికి స్వాతంత్య్రం ఇచ్చిన తరువాత ఆంగ్లం అధికార భాషగా అవతరించింది. అనేకానేక రాష్ట్రాలలో ఇంగ్లీషు అధికార భాషగా ఉంది మరి ప్రజలు వాడుకునేదేమిటి? అది జాతీయభాష అనేమాట ఎక్కడి ఉంది ? ఎంత అన్యాయం.

### డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ : రాజ్యాంగ పరిషత్తు లో చర్చ

మన భారత రాజ్యాంగ పరిషత్తు సభ్యులుగా ఉన్న రాజనీతి వేత్తలు, నేతలు వారి ప్రతినిధులు హిందీ అనేది భారతదేశానికి "చెందిన భాష" మాత్రమే. కోట్లాది మందిలో ఇది హిందీయేతర రాష్ట్రమని రాజ్యాంగ రచయితలో ప్రముఖులైన గోవిందాస్ అన్నారు. హిందీ దేవనాగరి, ద్రావిడ భాషల నుంచి వస్తుంది. తెలుగు, తమిళం, మలయాళం కన్నడ లిపి పూర్తిగా భిన్నమైన ద్రావిడ భాషలో ఉన్నాయి. ఈ రెండు భాషలు హిందీ, దేవ నాగరి లిపిలో ఉన్నాయి. దక్షిణ భారతదేశం నుంచి హిందీయేతర రాష్ట్రాల వరకు రాజ్యాంగ పరిషత్తులో తీవ్ర చర్చ జరిగింది. తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ కీలకమైన అంశాలు చెప్పారు. జాతీయ భాష అంటే దేశంలోని ప్రతి ప్రాంతంలో భాష వాడుకునే శక్తి ఉండాలని అన్నారు. అందరికీ అందుబాటులో ఉన్నా, కొందరికి మాత్రమే తెలిస్తే అది జాతీయ భాష అవుతుందా? అది కేవలం అధికార భాష అవుందని రాజ్యాంగ పరిషత్ తొలి అధ్యక్షుడు డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ వివరించారు. అందరు ఒప్పుకుంటే, మెజారిటీ ఉంటే అంగీకరిస్తే అది జాతీయభాష అయ్యే అవకాశం ఉంటంది. చట్టబద్ధత వస్తుందని రాజేంద్రప్రసాద్ అన్నారు.

### నిబంధనలు చర్చ

మన భారత రాజ్యాంగంలో అధికారిక భాషకు సంబంధించి నవి XVII భాగంలో చాలా ఉన్నాయి. XVII భాగంలో మరో నాలుగు అధ్యాయాలు, తొమ్మిది ఆర్టికల్స్ ఉన్నాయి. ఈ ఆర్టికల్స్ లో 'అధికారిక భాష' (ఆర్టికల్స్ 343, 344) 'ప్రాంతీయ భాషలు' (ఆర్టికల్స్ 345-347) అని రెండు భాగాలు ఉన్నాయి. వాస్తవానికి రాష్ట్రాల అధికార భాషలకు ప్రాంతీయ భాషలని పేర్కొంటున్నాయి. సుప్రీంకోర్టు, హైకోర్టుల భాష, చట్టాలు (ఆర్టికల్ 348) చేయడానికి వాడే భాష అని విడిగా ఉందను కోవలసిందే. నిజానికి చట్టాల భాష అని జనం భాష అని వేరే వేరే ఉంటే ఇంకా కష్టం అవుతుంది.

### అవి 'అధికారిక భాషలే' కాని 'జాతీయ భాష' కాదు

అదిగాక రాజ్యాంగం XVII భాగంలో అధికారిక భాషకు నిబంధనలు ముఖ్యమైనవే ఉన్నాయి. పార్లమెంటు (భాగం V,+II) రాష్ట్ర శాసనసభలు (భాగం V, అధ్యాయం III) గురించి చెప్పే అధ్యాయాల్లో, శాసనసభా ప్రక్రియల భాషకు సంబంధించి, ఆర్టికల్స్ 120, 210 నిబంధనలు వివరిస్తున్నాయి. III భాగంలోని ప్రాథమిక హక్కుల విభాగంలోని ఆర్టికల్స్ 29, 30 సంస్కృతిక విద్యా హక్కులను గురించి పేర్కొన్నాయి. భాషాపర మైన తక్కువమందున్న మైనారిటీల హక్కులు గ్యారంటీ ఇస్తున్నాయి. ఎనిమిదవ షెడ్యూల్ కొన్ని భారతీయ భాషలకు 'అధికారిక' హోదాను కల్పించాయి.

### ఒకే భాషలో మైనారిటీ సమస్య : ఆర్టికల్ 3

"ద ఆక్స్‌పోర్డ్ హాండ్ బుక్ ఆఫ్ ద ఇండియన్ కానిస్టిట్యూషన్" అనే ఉద్గ్రంధాన్ని ఎడిట్ చేసిన ముగ్గురు ప్రముఖులలో ఒక రచయిత సుజిత్‌చౌదరీ గారు రాజ్యాంగంలో భాషకు సంబంధించిన వివరమైన వ్యాసం రాశారు. ఇందులో భాష కోసం మనం ప్రత్యేకంగా అనకపోయినా ఆర్టికల్ 3 వంటి నిబంధనలో కూడా ప్రస్తావన ఉంది. ఉదాహరణకు తెలంగాణ ఆంధ్రప్రదేశ్ విభజన. ఆర్టికల్ 3, ఇది పార్లమెంటుకు రాష్ట్రాల భౌగోళిక పరిమితులను మార్చడానికి కొత్త రాష్ట్రాలను సృష్టించడానికి అధికారాన్ని ఇస్తున్నది. ఇక్కడ భాషాపరమైన మైనారిటీల హక్కులు ఉపయోగపడింది తెలంగాణ, ప్రత్యేక ఆంధ్ర ఉద్యమాల విషయంలో రాజ్యాంగమైన, న్యాయమైన అంశాలు ఉన్నాయి. హిందీని ప్రభుత్వ అధికార భాషగా స్వీకరించాలంటే వ్యతిరేకత చాలా కాలం నుంచి అందరికీ తెలుసు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం మనది. విస్తృత వైవిధ్యాన్ని కలిగిన ప్రపంచంలో భారత దేశ సమగ్రతను కాపాడేందుకు ఒక తాటి పౌరసత్వాన్ని ఏర్పర చాలనే ఉద్దేశంతో అనేక భాషలను అధికారిక భాషలున్నాయని ఉండవలసి వచ్చింది. అందుకు మన అనేక ఉదాహరణలు అనుభవాలు, సామాజిక, ప్రాంతీయ, రాజకీయా అనుభవాలు ఉపయోగిస్తాయి. ముఖ్యంగా సాధారణ భాష ద్వారా అక్షరాస్యతను ప్రోత్సహించడం ద్వారా సామాజిక, ఆర్థిక స్థితిని మెరుగు పరచడం ఒక లక్ష్యం.

ప్రజాస్వామిక, జాతీయ రాజకీయాలను సాధించే ఒక సామాన్య వేదికను ఉండాలనేది మరో లక్ష్యం. ప్రజలు ప్రభుత్వ పరిపాలనతో నేరుగా సంభాషించగలగేలా ఒక స్వదేశీ భాషను ప్రోత్సహించడన్నది ఒక కీలకమైన ఆలోచన. అని సుజిత్ చౌదరీ వివరించారు. అందులో హిందీ మాట్లాడని రాష్ట్రాల ప్రజలు హిందీకి ప్రాధాన్యత ఇచ్చి ప్రాంతీయ భాషలకు అధికారిక హోదా కల్పించడం అవసరం అనుకున్నారు. అదీ నిజమే. ఆర్థిక, రాజకీయ అధికారాన్ని హిందీ మాట్లాడే వారి వైపు బలవంతంగా మళ్లించే విధంగా విధానాలు అమలు చేయకూడదన్నారు. కనుక కేంద్రంలో ఇంగ్లీష్‌ను ఉపయోగించే కొనసాగించేందుకు, ప్రాంతీయ భాషలకు అధికారిక హోదాను కల్పించేందుకు పోరాడారు. అదే ఇప్పుడికీ పనిచేస్తున్నది. దాని

అవసరం ఇంకా కొనసాగుతూనే ఉంటుంది.

భారతదేశ భాషా రాజకీయాలలో భాషా స్థితి మార్పుల వెనుక ఉన్న ముఖ్యమైన అంశాలు భౌతిక వనరుల పట్ల పోటీ కూడా ఆలోచించాలి. అధికారిక భాషపై చర్చలు కేవలం సాంస్కృతిక విభేదాలను మాత్రమే కాకుండాకాదు. ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశాల కోసం జరిగే పోటీలు ఉంటాయి. అందులో సమస్యలు తీవ్రంగా ఉంటాయని సుజిత్ చౌదరీ అన్నారు. భారత రాజ్యాంగంలోని భాషా నిబంధనలు రాజ్యాంగ రూపకల్పన దాని అమలుకు సంబంధించి అనుభవం చెప్పే పాఠాలు ఏమంటే అధికారిక భాషను అన్ని ప్రభుత్వ కార్యకలాపాల్లో తప్పనిసరిగా ఉపయోగించి తీరాలనే అభిప్రాయాన్ని భారత రాజ్యాంగం ఒప్పుకోలేదు. స్పష్టంగా తిరస్కరిస్తుంది. దీనిలో అధికారిక భాష ఎంపికను వాడుకోవాలి. స్థానిక స్థాయిలో భాషను ఏవిధంగా ఉపయోగించాలి. ప్రత్యేకమైన విధానాలు సాధనాలు ఉపయోగిచడం సాధ్యమా అని ఆలోచించాలి. కనుక మొత్తం దేశానికి ఒకే భాష సాధ్యం కాదు. మరికొన్ని అధికార భాషాలు చేర్చడం 'మన రాజ్యాంగ రాజీ' సాధించడానికి సాధనంగా మారుతుంది,

రాజ్యాంగంలో XVII భాగంలోని ప్రత్యేక నిబంధనలు రాజ్యాంగ రాజీని సాధించడానికి వివిధ వ్యూహాలను ఉపయోగించాయి, (ఆర్టికల్ 343, ఆర్టికల్ 344, ఆర్టికల్ 345, ఆర్టికల్ 3పరిశీలించండి). అధికారిక భాష రాజకీయాలకు ప్రాముఖ్యమైన వేదికలు రాజ్యాంగ సభ, పార్లమెంటు, రాష్ట్ర శాసనసభలు అయినప్పటికీ, కోర్టులు కూడా ముఖ్యమైన పాత్ర పోషించాయి, ముఖ్యంగా మైనారిటీ భాషా విద్యపై కేసుల పరిష్కారంలో ఆర్టికల్ 30 ఉపయోగపడింది.

న్యాయస్థానాల్లో రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా భాషను ఏ విధానాల ద్వారా నిర్ణయించగల హక్కును, దానితో మైనారిటీ భాషా విద్యా హక్కుల మధ్య సంబంధాన్ని తీర్పులలో సమర్థవంతంగా విశ్లేషించాయి. ఎందుకంటే ఈ ప్రక్రియలో, స్వాతంత్ర్యోద్యమం నుంచి ఏర్పడిన సమగ్ర భారతీయ పౌరసత్వ భావన. మనదేశానికి అన్ని భాషా సముదాయాలకు ఆధారమైన భూమిక గా అవుతుంది. మరో రకమైన పౌరసత్వ భావన అవసరమా లేదా అని కూడా న్యాయస్థానాలు చర్చించాయి.

రాజ్యాంగ నిర్మాణ పరిషత్(రాజ్యాంగ అసెంబ్లీ)లో ఏది అధికారిక భాష అనే అంశంపైనే పెద్ద వివాదం చెలరేగింది. బ్రిటిష్ పాలనలో ఒక్క శాతం మంది మాత్రమే ఇంగ్లీష్‌లో పరిపాలన సాగింది. దాదాపు పన్నెండు ప్రాంతీయ భాషలు ఉపయోగంలో ఉన్నాయి. అందులో హిందీని ఎక్కువ మంది, దాదాపు 40 శాతం మంది మాట్లాడుతున్నారు. కొందరు మాత్రమే ఇతర భాషలు మాట్లాడగలరు. దక్షిణ ప్రాంతంలో చాలా తక్కువ మందికి హిందీ తెలుసు. మన సొంత భాషలు ఉన్నాయి. పొరుగు భాషలు అర్థం కాదు. వాడలేరు. అందరికీ ఇంగ్లీషు వచ్చిన వారని అనలేం. కనుక అనేకానేక భాషలను కలుసుకుంటూ ఇంగ్లీషు ద్వారా కోర్టుల్లో, ఢిల్లీలో అనుసంధానం చేస్తూ ఉంటున్నాయి. కనుక హిందీ, ఇంగ్లీషు అధికార భాషలు రెండూ ఉండాల్సిందే. కాని, అది సరిపోదు. కనుక ఆర్టికల్ 343 హిందీ మన అధికారిక భాష అని మొదట ప్రకటించారు. హిందీ విజయం సాధించిందంటూ అక్కడ ఆపలేము. వెంటనే 343(2) అవసరమైంది. ఇంగ్లీషు స్థానంలో మరో భాషను తెచ్చుకోలేక, మొదట 15 ఏళ్ల వరకు ఇంగ్లీషునే అధికారిక భాష కావలసిందే అని అర్థమైంది. 343(3) కింద నిరవధికంగా శాసనభాషగా ఇంగ్లీషు కొనసాగుతూ వచ్చింది. కనుక ఇంగ్లీషుతో మరొక భాష జతతో తాత్కాలిక 'అధికార భాష'గా నడవాల్సిందని తప్పలేదు. ఆర్టికల్ 348(1)(బి)(1) కింద ఇంగ్లీషు ప్రాథమిక భాషగా అంటూ, నిరవధికంగా ద్వితీయమైన భాషగా నడపవలసి వస్తున్నది. హిందీగా ప్రత్యామ్న భాషగా ప్రకటించడానికి ఎన్నో ప్రయత్నాలు, కృషి అందరికీ హిందీ తెలుసుకునే పథకాలు అమలు చేసే పనేదీ చేయకుండా "తరువాత చూద్దాంలే" అని ప్రభుత్వాలు వాయిదా వేయడం నిష్క్రియ మనది.

## కేంద్ర, రాష్ట్రాల భాష

ఆర్టికల్ 346 కింద భారత కేంద్ర, రాష్ట్రాల మధ్య రచించే భాషను ఇంగ్లీష్ అని నిర్ణయించారు. ఇది అవసరం. లేకపోతే ఒక రాష్ట్ర భాషనుంచి మరో ప్రాంత భాషకు చెప్పడం సాధ్యం కాదు. ఒక రకంగా ఇంగ్లీషు వాళ్లు ఈ దేశానికి ఎంతో గొప్పమేలు చేసారు. ఆర్టికల్ 343 దేశపాలనా భాష కూడా ఇంగ్లీషే. అయినా అది జాతీయ భాష కాదు. ఆర్టికల్ 350 చూడండి. ప్రతి వ్యక్తికీ తన భాషలో ఏ అధికారికైనా తన బాధ చెప్పుకునే హక్కు ఉందని ప్రకటించింది. కాని ఆర్టికల్ 343 కింద దేశపాలనలో అంతర్గత భాష ఇంగ్లీషే అవుతుంది. ఆర్టికల్ 344 కింద ఇంగ్లీషు నుంచి హిందీలోకి మార్చడానికి ఒక ప్రత్యేక కమిషన్ నియమించింది. కాని బిగి ఖేర్ అధ్యక్షుడుగా ఉన్నపుడు కొట్టివేశారు.

ఐఏఎస్ వంటి పరీక్షలలో తప్పనిపరిగా ఇంగ్లీషులో ఉండాలని నిబంధన చేస్తే ఢిల్లీ హైకోర్టు ఆర్టికల్ 14కు అది భంగకరమని మంచి తీర్పు ఇచ్చింది. లేకపోతే ఇతర భాషలపైన ఫెడరల్ సిద్ధాంతానికి వ్యతిరేకమై, ఇంగ్లీషు నియంతృత్వం విధిస్తే అందరి భాషలు విధ్వంసమై పోతాయని తెలియడం లేదా? ఆయా భాషల్లో పోటీ పరీక్షలు నేర్చుకోవడం ఉద్యోగాలు సాధించడం ఏ విధంగా జరుగుతుంది. చివరకు తెలుగులో బతకడమే అసాధ్యం చేస్తారా ? ముఖ్యమంత్రి గారు ఉపముఖ్యమంత్రి జవాబు ఇస్తారా?

# వెనుకబడిన ప్రాంతం ఉత్తరాంధ్ర

- ఎ.అజశర్మ

ఉమ్మడి రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతం ఉత్తరాంధ్రా అని రాష్ట్ర విభజన సందర్భంగా శ్రీకృష్ణ కమిషన్ రిపోర్ట్‌లో ఈ విషయాలన్నీ గణాంకాలతో సహా అధికారులు నిరూపించారు. రాష్ట్ర విభజన చట్టం 2014లో ఉత్తరాంధ్ర అభివృద్ధికి సహకరించేలా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీతోపాటు మరికొన్ని మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన అంశాలు ఉన్నాయి. అయితే అవేవీ సక్రమంగా అమలు కాలేదు. ఫలితంగా ఈ ప్రాంతంలో స్వాతంత్ర్యానంతరం కొనసాగుతున్న వెనుకబాటు ఈ పదేళ్ల కాలంలో పెరిగిందే కానీ తగ్గలేదు. వలసలు, పేదరికం మరింత పెరిగాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్‌లో స్టీల్ ప్లాంట్ పరిరక్షణ, ప్రభుత్వ రంగం, ప్రత్యేక హోదా, విభజన చట్టం అమలు వంటి అంశాల ప్రస్తావన కూడా లేదు. సరికదా పి4 మోడల్ పేరుతో ప్రైవేటీకరణ వేగాన్ని పెంచే విధానాన్ని ప్రతిపాదించారు.

ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందాలంటే కొన్ని నిర్దిష్టమైన చర్యలు ప్రభుత్వం చేపట్టడంతోపాటు, ప్రజలు కూడా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం ద్వారానే సాధ్యం అవుతుందన్నది తేటతెల్లమైంది. నేడు పాలకులకే నచ్చినవి, ప్రజలు కోరుకోనివి, వ్యతిరేకిస్తున్నవి ఏవేవో చేసేస్తూ, ఇదే అభివృద్ధని నమ్మబలుకుతున్నారు. కొంత మంది ప్రజలు ఆ భ్రమల్లో పడిపోతున్నారు కూడా. అందువల్ల అసలైన అభివృద్ధి అంటే ఏమిటి అనేది కూడా ఒక పెద్ద ప్రశ్నార్థకంగానే మారింది. ప్రముఖ అమెరికన్ ఆర్థికవేత్త మైకేల్ టోరాడో అభివృద్ధి గురించి ఇలా పేర్కొన్నారు. 'ప్రజల జీవన ప్రమాణాలు పెరగడం- ఆదాయాలు, వినియోగం పెరగడం, ఆహారం, వైద్యం, విద్య వంటి రంగాలలో నిరంతర పెరుగుదల ఉండడం, వారికి ఏం కావాలో ఎంచుకునే స్వేచ్ఛ ప్రజలకు కల్పించడం'. కాని, నేడు పాలకులు చెబుతున్న అభివృద్ధి ఏ కోణంలో ఉంది ? ఈ దిశలో ఉందా లేదా అన్నది పరిశీలించాలి. సాధారణంగా ప్రకృతి వనరుల కొరత ఉన్న ప్రాంతాలలో వెనుకబాటుతనం ఉంటుంది. దీనికి భిన్నంగా ఉత్తరాంధ్రకు అపారమైన ప్రకృతి వనరులు ఉన్నా వెనుకబాటుతనం కొనసాగుతోంది. 353 కిలోమీటర్ల పొడవైన తీర ప్రాంతం, రాష్ట్రంలోనే అత్యధిక వర్షపాతం, దట్టమైన అడవులు ఉత్తరాంధ్రకు సొంతం. అయినా ఈ అపారమైన వనరుల మధ్యే (Poverty amidst plenty) కూడా ఉండడం గమనార్హం. స్వాతంత్ర్యానంతరం ఏడున్నర దశాబ్దాలుగా పాలకులు పట్టిం చుకోకపోవడానికి సాధారణ అంశాలతోపాటు కొన్ని ప్రత్యేక కారణాలు ఉన్నాయి. చారిత్రకంగా చూసుకుంటే ఉత్తరాంధ్రలో ఫ్యూడల్ జమీందారీ వ్యవస్థ ఎక్కువ. జమీందారీ వ్యవస్థ రద్దు అయినా ఫ్యూడల్ వ్యవస్థ అవశేషాలు, ప్రభావాలు ఇంకా బలంగానే ఉన్నాయి. ఫలితంగా ఇప్పటికీ ఉత్తరాంధ్ర రాజకీయాలను ఈ ఫ్యూడల్ శక్తులు, వారి అనునాయులే నిర్దేశించే స్థితి కొనసాగుతోంది. ప్రజాస్వామ్య స్ఫూర్తికన్నా ప్రజలను అణిగిమణిగి ఉంచే స్వభావం ఫ్యూడల్ సంస్కృతికి ప్రధాన రాజకీయ లక్షణం. ఫలితంగా విశాఖ నగరంలో కొద్ది మంది మినహా మిగిలిన గ్రామీణ, గిరిజన ప్రాంతాలలో అత్యధిక ప్రజా ప్రతినిధులు స్థానికులైనప్పటికీ వీరెవరూ ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషి చేయలేదు.

విశాఖపట్నం మహానగరంగా అభివృద్ధి చెందడం ఉత్తరాంధ్ర అభివృద్ధిగా పాలకులు భ్రమలను కల్పిస్తున్నారు. వాస్తవంగా ఈ నగరం నేడు ఉత్తరాంధ్ర జిల్లాల దోపిడీ కేంద్రంగా పాలకులకు ఉపయోగపడుతోంది. స్థూలంగా చెప్పాలంటే ఉత్తరాంధ్ర వెనుకబాటుకు ప్రధాన కారణం పాలకుల నిర్లక్ష్యంతోపాటు, అధికారంలో ఉన్నా తమ ప్రాంత అభివృద్ధికి కృషి చేయని స్థానిక ప్రజాప్రతినిధుల స్వార్థ రాజకీయాలే.

రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి పాలకవర్గాలు భారీ ప్రాజెక్టుల వైపు మొగ్గు చూపాయి తప్ప ఈ ప్రాంత ప్రత్యేకతలకు తగ్గట్టుగా నీటి ప్రాజక్టులకు అభివృద్ధి చేయడంలో కానీ, పారిశ్రామికీకరణ చేయడంలో కానీ శ్రద్ధ పెట్టలేదు. తమ దోపిడీ కొనసాగాలంటే ఇక్కడి ప్రజలు విద్యావంతులు, ఆరోగ్యవంతులు అవడం కూడా పాలకులకు ఇష్టం ఉండదు. దీనివల్లే విద్య, వైద్య రంగాలలో కూడా ఉత్తరాంధ్ర నేటికీ వెనుకబడే ఉంది. ఇక్కడ సామాజిక పొందికలో బీసీలు, గిరిజనులు అధికంగా ఉండడం వల్ల కూడా పాలకుల నిర్లక్ష్యానికి గురయ్యారు. ఉత్తరాంధ్ర వెనుకబాటు ప్రధానంగా గ్రామీణ పేదరికంలో కనబడుతూ ఉంటుంది. వ్యవసాయం అభివృద్ధి చెందేలా నూతన వ్యవసాయ పద్ధతులు ఇక్కడ ప్రోత్సహించబడలేదు. దానితో పాటుగా అనేక నీటి ప్రాజెక్టులు దశాబ్దాలుగా పెండింగ్‌లోనే ఉన్నాయి. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను అమ్మేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. విశాఖ ప్రభుత్వ రంగాన్ని బలహీన పరుస్తోంది. నేడు పాలకులు అభివృద్ధి పేరున చేపడుతున్న చర్యలన్నీ కొంతమంది

సంపన్నులకు మేలు చేసేవి గాను, సామాన్య ప్రజలను అభివృద్ధి నుండి బయటకు గెంటి వేసేవి గానూ ఉన్నాయి. ఈ స్థితి మారకుండా సమగ్రాభివృద్ధి సాధ్యం కాదు. దీనిని మార్చడమే ఉత్తరాంధ్ర ప్రజల ప్రధాన ఎజెండాగా ఉండాలి. అభివృద్ధికి అత్యంత కీలకంగా ఉండే అక్షరాస్యత ఉత్తరాంధ్రలో తక్కువగా ఉంది. విద్యాసంస్థల స్థితి చాలా దయనీయంగా ఉంది. మానవ వనరుల అభివృద్ధి సూచికలో ఉత్తరాంధ్రలోని అన్ని జిల్లాలు రాష్ట్రంలోనే అట్టడుగున ఉన్నాయి. జిల్లాల తలసరి ఆదాయం, స్థూల జిల్లా ఉత్పత్తి, మాతా శిశు మరణాలు, అక్షరాస్యత వంటి అనేక అంశాలలో ఉత్తరాంధ్ర వెనుకబడి ఉంది.

ఉత్తరాంధ్రలో చిన్న, సన్నకారు రైతులు ఎక్కువ. మూడో వంతు మంది రైతులు రెండు హెక్టార్లకంటే తక్కువ భూమి కలిగిన వారే. ఈ భూమి కమతాల సైజు కూడా క్రమంగా తగ్గుతోంది. ఉదాహరణకు ఐదేళ్ల కాలంలో శ్రీకాకుళంలో సగటు కమతం 0.66 హెక్టార్ల నుండి 0.51కు తగ్గిపోయింది. సాగునీటి లభ్యతలో రాష్ట్రంలోనే అట్టడుగున ఉత్తరాంధ్ర జిల్లాలు ఉన్నాయి. రాష్ట్రంలోని మిగిలిన జిల్లాలకన్నా అత్యధిక వర్షపాతం ఇక్కడ ఉన్నా, సాగు, తాగు నీటి లభ్యత తక్కువగా ఉండడానికి కారణం నీటి ప్రాజక్టుల నిర్మాణం చేపట్టకపోవడమే. ఉత్తరాంధ్రలో వంశధార, నాగావళి, సువర్ణముఖి, వేగావతి, మహేంద్ర తనయ, గోస్తని, చంపావతి, బహుదా, జంఝావతి, గౌతమి, శారద, వరాహ, తాండవ, పంపా వంటి నదులు ఉన్నాయి. రాష్ట్రంలోనే అత్యధిక చెరువులు ఉండడం ఉత్తరాంధ్ర ప్రత్యేకం. విజయనగరంలో 9,173 చెరువులతో రాష్ట్రంలో మొదటిస్థానంలో ఉండగా, శ్రీకాకుళంలో 8336, విశాఖ పట్నంలో 3458 చెరువులున్నాయి. వీటితోపాటు వివిధ చెక్ డ్యాములు, గడ్డల ద్వారా వ్యవసాయం జరుగుతోంది. ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం లేకపోవడంతో అత్యధిక వర్షపాతం ఉన్నా వర్షపు నీరు వృధాగా బంగాళాఖాతంలోకి పోతోంది.

నూతనంగా వస్తున్న పరిశ్రమల ద్వారా వస్తున్న ఉపాధికంటే నిర్వాసితులవుతున్న రైతులు, ఉపాధి కోల్పోతున్న మత్స్యకారులు, ఇతర వృత్తిదారులు అధికంగా ఉంటున్నారు. పారిశ్రామిక కాలుష్యంతో మత్స్య సంపద నాశనం అవుతూ మత్స్యకారులు ఉపాధి కోల్పోతున్నారు. 353 కిలోమీటర్ల సుదూర తీర ప్రాంతం ఉత్తరాంధ్రకు వరంగా ఉండేది. కానీ అదే నేడు శాపంగా మారే ప్రమాదం ఏర్పడింది. ఉపాధి కోల్పోతున్న రైతులు, ముఖ్యంగా వృత్తిదారులు పొట్ట చేత పట్టుకుని పట్టణాలకు, సుదూర ప్రాంతాలకు వలసలు పోతున్నారు. సాంప్రదాయక వ్యవసాయ ఆధారిత జ్యూట్, షుగర్, జీడిపిక్కలు వంటి పరిశ్రమలు మూతబడుతున్నాయి. ఐటీ రంగం, దాని ద్వారా ఉపాధి కల్పన ఆశించిన స్థాయిలో జరగలేదు. టూరిజం రంగం అభివృద్ధి, ఉపాధి, దాని ద్వారా ఆదాయం గురించి చేస్తున్న ప్రకటనలకు, ఆచరణకు సంబంధమే లేదు.

రాష్ట్రంలోనే అత్యధిక గిరిజన ప్రాంతం ఉత్తరాంధ్రలోనే ఉంది. రాష్ట్ర గిరిజన జనాభాలో 37.23 శాతం గిరిజనులు ఉత్తరాంధ్రలోనే ఉన్నారు. దట్టమైన అడవులతో నిండిన ఈ ప్రాంతంలో అపారమైన సంపద ప్రకృతి సిద్ధంగా పోగుపడి ఉంది. అయితే, ఈ సంపద ఫలాలు గిరిజనులు పొందలేక పోతున్నారు. ఈ ప్రాంత సంపదను కొల్లగొట్టుకుపోవడానికి పాలకులు శతవిధాలా ప్రయత్నిస్తున్నారే తప్ప, ఈ సంపదతో గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుదలకు ఇసుమంత కూడా ప్రయత్నాలు చేయకపోవడం నేటి దుస్థితికి ప్రధాన కారణం. ఫలితంగా మానవాభివృద్ధి సూచిలో వీరు అట్టడుగున ఉన్నారు. విద్య, వైద్యం, రవాణా సదుపాయాలు, మౌలిక వసతులు వంటివి చాలా తక్కువగా ఉన్నాయి. తీవ్ర పేదరికం నెలకొనడంతో పౌష్టికాహార లోపం, బాలికలలో రక్తహీనత చాలా అధికం. సంతలలో అటు కొనుగోలులోను, అమ్మకాలలోనూ జరిగే మోసాలు వీరి పేదరికాన్ని మరింత పెంచుతోంది. దీనికి తోడు ఈ గిరిజన ప్రాంత భూముల నుండి గిరిజనులను నెట్టివేసేలా చట్టాలను అతిక్రమించి హైడ్రో పవర్ వంటి వివిధ ప్రాజెక్టులను నేడు పాలకులు చేపడుతున్నారు.

పర్యావరణ పరిరక్షణ స్థిరమైన అభివృద్ధిలో అత్యంత ప్రధానమైనది. అయితే నేడు కొంతమంది తక్షణ లాభార్జన కోసం, ప్రభుత్వాలు ఉత్తరాంధ్రలో పర్యావరణానికి తీవ్ర హానిని కలగజేస్తున్నాయి. ఖనిజాల తవ్వకం పేరుతో అడవులను ధ్వంసం చేయడానికి పూనుకుంటున్నారు. పారిశ్రామికీకరణ పేరున విధ్వంసానికి పాల్పడుతూ, సముద్ర తీరాన్ని కలుషితం చేస్తున్నారు. నేడు మన స్వప్రయోజనాల కోసం పర్యావరణాన్ని పణంగా పెడితే భవిష్యత్తు తరాల మనగుడే ప్రశ్నార్థకం అవుతోంది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ భూములు ఎల్లప్పుడూ కాపాడుకుంటూ ప్రభుత్వ ఆధీనంలో ఉంచుకోవాలి. కానీ నేడు విశాఖ నగరంతో సహా అన్ని ప్రాంతాలలోనూ ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ భూములను అమ్మేస్తామంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గంగవరం పోర్టులో ప్రభుత్వ వాటాలు అమ్మడం ద్వారా అదానీ సంస్థకు 2,852.26 ఎకరాల భూమిని శాశ్వతంగా ఇచ్చేసింది.

1991 నుండి దేశంలో అమలవుతున్న సంస్కరణల ప్రభావం ఉత్తరాంధ్రపై కూడా తీవ్రంగా పడింది. వివిధ అవసరాల పేరున పెద్ద ఎత్తున భూసేకరణ, సహజ వనరుల పరాయీకరణ, వేల సంఖ్యలో నిర్వాసితులు, శ్రామికులు ముక్కలు ముక్కలుగా చీలికలైపోవడం, వ్యవసాయం నిర్లక్ష్యం చేయబడడం, విశాఖ ప్రభుత్వ రంగ పరిశ్రమలు బలహీనపడడం వంటి రూపాలలో ఇది వ్యక్తమవుతోంది.

అభివృద్ధి పేరున ఉత్తరాంధ్ర వనరులు ఒక పక్కన కొల్లగొట్టుకుపోబడుతుంటే, మరోపక్క ప్రజలు తీవ్ర పేదరికంలోకి నెట్టబడుతున్నారు. జరుగుతున్న అన్యాయంపై సంఘటితంగా గళమెత్తవలసిన సమయంలో అణగారిన ఈ తరగతుల ప్రజలు ముక్కలు, చెక్కలవడం వీరి కష్టాలను మరింత పెంచుతోంది. ఈ స్థితిని అధిగమించి అభివృద్ధి దిశలో ముందుకు సాగాలి.

**ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధికి ఈ చర్యలను చేపట్టాలి**

- రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఉత్తరాంధ్ర ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ 50 వేల కోట్ల రూపాయలు కేటాయించి నీటి ప్రాజెక్టులు నిర్మాణం పూర్తి చేయాలి.
- విశాఖపట్నం కేంద్రంగా విశాఖ రైల్వే డివిజన్ తో కూడిన ప్రత్యేక రైల్వే జోన్ తక్షణం ఏర్పాటు చేయాలి. మెట్రో రైల్ నిర్మాణం పూర్తి చేయాలి.
- గిరిజన, పెట్రో యూనివర్సిటీల నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి.
- విస్తారమైన గిరిజన ప్రాంతంలో దొరికే అపారమైన అటవీ సంపదలను వినియోగించుకునేలా 1/70 చట్టాన్ని, ఇతర చట్టాల్ని పటిష్టపరుస్తూ, యువతకు ఉపాధి అవకాశాలు, ప్రజల జీవన ప్రమాణాలు పెంచే చర్యలు చేపట్టాలి. జీవో నెంబరు 3ను చట్టబద్ధం చేయాలి.
- స్పెషల్ డీఎస్సీ నిర్వహించాలి.
- నాన్ షెడ్యూల్‌లో ఉన్న గిరిజన గ్రామాలను షెడ్యూల్ గ్రామాల జాబితాలో చేర్చాలి. జీసీసీకి నిధులు కేటాయించి గిరిజన ఉత్పత్తులను కొనుగోలు చేయాలి. కాఫీ పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి.
- సముద్ర తీర ప్రకృతి వనరులను పూర్తిగా సద్వినియోగం చేసుకుంటూ, పర్యావరణాన్ని కాపాడుతూ, మత్స్యకారులకు ఉపాధి రక్షణ, ఫిషింగ్ హార్బర్లు, జెట్టీలు, కోల్డ్ స్టోరేజీలు వంటి మౌలిక వసతులు కల్పించడం ద్వారా జీవన ప్రమాణాలు పెంచాలి.
- పర్యావరణానికి హాని కలిగించే కొవ్వాడ అణు విద్యుత్ ఏర్పాటును నిలుపుదల చేయాలి.
- నీటి ప్రాజెక్టుల నిర్మాణం, ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి పూర్తి స్థాయి నిధులు కేటాయించి, పోలవరంతో నిమిత్తం లేకుండా శీఘ్రగతిన పూర్తిచేయాలి.
- మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం, చెక్ డ్యాంల మరమ్మతులు, చెరువులలో పూడికలు తీయించడం వంటివి నిరంతరం చేస్తూ ఉండాలి. భూ దురాక్రమణలను అరికట్టాలి.
- ప్రభుత్వరంగ పరిశ్రమలను బలోపేతం చేసే చర్యలు చేపట్టాలి. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు గనులు కేటాయించి, ప్రైవేటీకరణ నిర్ణయం ఉపసంహరించుకోవాలి. సెయిల్‌లో విలీనం చేయాలి.
- ఐటీ, టూరిజం వంటి రంగాలను, జీడి పరిశ్రమలను స్థానికులకు మంచి ఉపాధి కలిగేలా అభివృద్ధి చేయాలి. నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి.
- విద్య, వైద్యం రవాణా వంటి మౌలిక వసతుల కల్పన మెరుగుపడాలి.
- రాష్ట్ర విభజన చట్టంలోని విద్యాసంస్థలన్నిటికీ నిధులు కేటాయించి పూర్తిచేయాలి. ఆంధ్ర యూనివర్సిటీ, అంబేద్కర్ యూనివర్సిటీ, ఐఐఐటీ, జేఎన్‌టీయూ, ఆంధ్ర, విజయనగరం మెడికల్ కాలేజీల వంటి అన్ని ఉన్నత విద్యా సంస్థలతో సహా అన్ని విద్యాసంస్థలలో శాశ్వత అధ్యాపకులను, టీచర్లను నియమించాలి.
- గిరిజన ప్రాంతంలో ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటుచేసి సంపూర్ణ అక్షరాస్యత సాధించాలి. నిర్మాణంలో ఉన్న, ప్రతిపాదిత విద్యా సంస్థలన్నింటినీ త్వరితగతిన పూర్తి చేయాలి.
- కేజీహెచ్, రిమ్స్, అన్ని జిల్లా, ఏరియా ఆసుపత్రులు, పీహెచ్‌సీలు, ఏజెన్సీలో శాశ్వత డాక్టర్లను, సిబ్బందిని నియమించాలి.
- పలాసలోని ఉద్దానం కిడ్నీ పరిశోధన కేంద్రంలో నిపుణులతో పరిశోధన చేయించాలి. ఆసుపత్రిలో అన్ని సేవలు అందుబాటులోకి తేవాలి.
- ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం వెంటనే పూర్తి చేసి, దీనికి అనుబంధంగా మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలి.
- పొందూరు ఖద్దరు, ఏటికొప్పాక బొమ్మలు, బొబ్బిలి వీణ, వడ్డాది శిల్పకళలకు సబ్సిడీలు, మార్కెట్ సౌకర్యాలు కల్పించి ప్రోత్సహించాలి.
- జానపద కళలను కాపాడేలా కళాకారులకు అవకాశాలు కల్పించాలి. గ్రామీణ క్రీడలను ప్రోత్సహించేలా మైదానాలు, స్టేడియంలు నిర్మించాలి.
- సాంప్రదాయ వృత్తిదారులకు అవసరమైన ఆధునిక శిక్షణా సౌకర్యాలు కల్పించి.. ఉపాధి అవకాశాలు కల్పించాలి.
- పేదల సాగులో ఉన్న భూములకు పట్టాలివ్వాలి. ఇళ్లు లేని పేదలందరికీ ఇళ్ళు నిర్మించి ఇవ్వాలి.
- విశాఖ జిల్లా పంచ గ్రామాలలో ఇళ్ల యజమానులను, తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూ యాజమాన్య రైతులను హక్కుదారులుగా గుర్తించాలి.
- భద్రతా ప్రమాణాలు పాటించి, పారిశ్రామిక ప్రమాదాలు నివారించాలి. మూతబడ్డ షుగర్, జ్యూట్, జీడి, ఫెర్రో

ఎల్లోయిస్ వంటి పరిశ్రమలను తెరిపించాలి. విషతుల్య పరిశ్రమలను అనుమతించరాదు. కో- ఆపరేటివ్ గోవాడ షుగర్ ఫ్యాక్టరీని ఆధునికీకరించాలి. పరిశ్రమలలో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు కల్పించాలి.

### సరైన చర్యలతోనే అభివృద్ధి సాధ్యం

అపారమైన ప్రకృతి వనరులున్న ఉత్తరాంధ్రలో సరైన చర్యలు చేపడితే గొప్ప అభివృద్ధి తప్పక సాధ్యమవుతుంది. నీటి ప్రాజెక్టుల నిర్మాణంతో వ్యవసాయ అభివృద్ధి ద్వారా ఉత్తరాంధ్ర సస్యశ్యామలమవుతుంది. వ్యవసాయ ఆధారిత పరిశ్రమల స్థాపన, ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణ ద్వారా యువతకు మంచి ఉపాధి అవకాశాలు కలుగుతాయి. అయితే అటువంటి అభివృద్ధి చర్యలు వారికివారే చేపట్టరు అనేది పాలకుల యొక్క విధానాల ద్వారా అవగతమైంది. విద్వేషాలను రెచ్చగొట్టే శక్తుల పట్ల అప్రమత్తంగా ఉంటూ, ప్రజల ఐక్యతను కాపాడుకుంటూ పాలకులపై ఒత్తిడి తేవాలి. ఉత్తరాంధ్రలో అవకాశాలు లేవు కనుక వేరే ప్రాంతాలకు వలసలు పోయి బతుకుదామనే వైపు కాకుండా మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవాలనే వైపుగా ఉత్తరాంధ్ర యువత ఆలోచించడం అవసరం. అల్లూరి సీతారామరాజు, వీరనారి గున్నమ్మ వంటి వీరుల వారసత్వం, గురజాడ, గిడుగు, గరిమెళ్ళ, శ్రీశ్రీ వంటి ఉత్తరాంధ్ర సాంస్కృతిక వీరుల దార్శనికత యువత పుణికి పుచ్చుకోవాలి. స్టీల్ ప్లాంట్ సాధన, పరిరక్షణ, శ్రీకాకుళం గిరిజనోద్యమం, గిరిజన చైతన్యంతో సాగిన బాక్సైట్ ఉద్యమం, సోంపేట పర్యావరణ పరిరక్షణ ఉద్యమం, ప్రభుత్వ రంగ బిహెచ్‌పివి పరిరక్షణ వంటి ఉత్తరాంధ్రలో సాగిన ఉద్యమాల స్ఫూర్తితో బలమైన ప్రజా ఉద్యమాలు నిర్మించడం ద్వారా పాలకులపై ఒత్తిడి తేవడమే ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఏకైక మార్గం. ❑

## పర్యావరణంపై మార్క్స్




‘ప్రకృతిలో భాగంగానే మనిషి మనుగడ సాగిస్తు న్నాడు. కాబట్టి ప్రకృతి మనిషి దేహమే. మానవజాతి అంతరించి పోకుండా ఉండాలంటే మనిషి ప్రకృతి తో నిరంతరం సంభాషిస్తూ ఉండాలి. సంబంధం కలిగి ఉండాలి. మనిషి భౌతిక, మానసిక జీవితం ప్రకృతితో ముడిపడి ఉంటుందని అంటున్నామంటే ప్రకృతి తనతో తాను ముడిపడి ఉందని అర్థం, ఎందుకంటే మనిషి ప్రకృతిలో భాగమే’. ‘చేప’ సారాంశం నీటిలో దాని అస్తిత్వమే. ‘మంచి నీటి చేప’ సారాంశం నది లోని నీరు. ఒకసారి ఆ నదిని పరిశ్రమ అవసరాల కోసం వినియోగించడం మొదలుపెట్టాక, పరిశ్రమల నుండి వెలువడే రసాయనాలతో, వ్యర్థ పదార్థాలతో, మర పడవలతో ఆ నది కలుషితం అయిన తర్వాత, లేదా ఆ నది నీటిని వేరే అవసరాల కోసం పక్కకు మళ్లించిన తర్వాత చేప అస్తిత్వానికి అవసరమైన మాధ్యమం లేకుండాపోతుంది. అంటే చేప తన అస్తిత్వాన్ని కోల్పోతుంది’.

‘లండన్‌లోని 45 లక్షల మంది ప్రజలు తమ విసర్జనలతో థేమ్స్ నదిని కలుషితం చేయడం మినహా చేయగలిగిందేమీ లేదు. దాని మూల్యం మాత్రం భారీగా ఉంటుంది’. ‘ఒక సమాజం మొత్తంగానీ, ఒక యావత్తు దేశం గానీ, లేదా భూమిపై ఉన్న మొత్తం సమాజాలన్నీ కలుపుకున్నా గానీ వారు భూమికి యజమానులు కారు. కేవలం ఆ భూమిపై గల వనరులను వినియోగించు కోవడం, దాని ప్రయోజనాలు పొందడం మాత్రమే వారు చేయాలి. తమ తరువాతి తరా లకు ఈ భూమిని మరింత మెరుగైన స్థితిలో అప్పచెప్పడం వారి బాధ్యత.’ ‘భూమి-ప్రకృతితో మానవుల సంబంధాలు ఒక హేతుబద్ధమైన పద్ధతిలో (సమ సమాజంలో-అను) పునఃని ర్మించబడిన తరువాత బానిసత్వ వ్యవస్థ మాదిరిగానో, భూస్వామ్య పెత్తందారీ విధానం మాదిరిగానో, వ్యక్తిగత ఆస్తి అనే అర్థంలేని ప్రాతిపదికనో కాకుండా.. మనిషి కి, భూమికి మధ్య సాన్నిహిత్యం పెరుగు తుంది. ఎందుకంటే ఈ వ్యవస్థలో భూమి సరుకుగా పరిగణించబడదు గనుక ! 150 సంవత్సరాల క్రితమే మార్క్స్ వివిధ సందర్భాలలో వ్యక్తం చేసిన పైఅభిప్రాయాలు ఎంత ముందుచూపుతో ఉన్నాయో చూడండి! మానవ సమాజం ప్రకృతి నుండి వేరు పడితే కలిగే హానికర పర్యవసానాల గురించి మార్క్స్ చేసిన హెచ్చరికలు సరైనవేనని నేడు జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. (‘డౌన్ టు ఎర్త్’సౌజన్యంతో )

# ఉపద్రవంగా మారుతోన్న విజ్ఞానోన్మాదం!



- డా.విరించి విరివింటి

సైన్సు అంటే మన చుట్టుపక్కల పరచుకొని వున్న చరాచర జగత్తుకు ఒక వివరణాత్మక నమూనా మాత్రమే. కానీ ప్రపంచం సైన్సుని అంతవరకే చూసిందనలేం. మనం 19-20 శతాబ్దాల చరిత్రను చూస్తే మానవులు సైన్సుని చాలాసార్లు ఒక భావజాల ఆయుధంగా వాడుకున్నారన్న వాస్తవం బయటపడుతుంది. మనుషుల్లోని వైషమ్యం, అసమానత, యుద్ధపిపాస, సంకుచిత జాత్యాధిపత్యం వీటన్నిటికీ శాస్త్రపరమైన సమర్ధనల్ని సైన్సు అందించింది. అది మానవ కపాలాలను కొలిచే 'క్రేనియోమెట్రీ' కావచ్చు, వాలేస్ ఆంత్రో పాలిజికల్ లైన్ కావచ్చు, మరొకటి కావచ్చు. అందువల్ల సైన్సును ఏ అపోహలకు తావివ్వకుండా, ఒక క్రమపద్ధతిలో అర్థం చేసుకోడానికి నిరంతర అధ్యయనం, కృషి జరుగుతూనే వుండాలి. లేకపోతే శాస్త్రప్రియులైన మనందరి ఆదర్శాలు ఆదర్శాలుగానే మిగిలిపోతాయి. ఎంతటి శాస్త్రావిష్కరణలు, సిద్ధాంతాలు బయటకు వచ్చినా, దాన్ని జనం తమదైన పద్ధతిలో అరకొరగా అర్థం చేసుకోవడం, విశ్లేషించు కోవడం జరుగుతూనే వుంటుంది. శాస్త్ర రంగంలోని మేధావుల్లోనూ ఇలాంటి విశ్లేషణలు మామూలైతే ఇక సామాన్యుల సంగతి ఏమిటి?

### డార్వినిజం తెచ్చిన తాత్విక నష్టం

ఇలాంటి ఉదాహరణల్లో మొదటిగా చెప్పుకోవాల్సింది డార్విన్ సిద్ధాంతాన్ని గురించి ! ఇది సరికొత్త నిరూపణలతో ఆ నాటి సమాజంలో ప్రకంపాలను పుట్టించిన మాట వాస్తవం. కానీ దాని తాత్వికతను అర్థం చేసుకునే విషయంలో తప్పుడు మార్గాలు తొక్కి సమాజాన్ని కొందరు కోల్పోలేని దెబ్బ తీసిన మాట కూడా అంతే వాస్తవం. వీరిలో మొదట మాట్లాడుకోవలసిన వ్యక్తి హెర్బర్ట్ స్పెన్సర్. ఆయన డార్విన్ చెప్పిన 'ప్రకృతి ఎంపిక, అనుసరణ'ను (Natural Selection and Adaptation) సమాజానికి అన్వయించి 'శక్తివంతుడే మిగలడం' (Survival of the Fittest) సిద్ధాంతాన్ని ప్రచారంలోకి తెచ్చాడు. దీంతోపాటు సైన్సుకు, శాస్త్రవేత్తలకు, సమాజానికి మాత్రమే గాక మొత్తం తాత్విక రంగానికి సైతం ఎంత నష్టం తేవాలో అంత నష్టం తెచ్చాడు.

పందొమ్మిదవ శతాబ్దంలో విజయవంతమైన శాస్త్ర సిద్ధాంతాలన్నీ ఏదో ఒక విధంగా అప్పటి మతాన్ని, శాస్త్రాలను, రాజకీయ తాత్వికతలను ప్రభావితం చేసిన మాట నిజం. డార్విన్‌కు కూడా అందులో మినహాయింపు లేదు. కానీ డార్వినిజాన్ని సమాజపరం చేసి, సామాజిక నియంతృత్వాలకు ఊతమిచ్చేలా చేసింది మాత్రం స్పెన్సర్, గాల్టన్లు మాత్రమే. ఇలాంటి ధోరణుల్ని లోతుగా తరచి చూడాల్సి వుంది. దీనికి ముందు నేను ఒక ఉదాహరణతో మొదలు పెడతాను..

### సమాజ పరిణామం సరళరేఖ లాంటిదా?

ఇంతగా సైన్సు, సాంకేతిక పరిజ్ఞానం పెరిగినా ఈ నాటికి కొందరు మనుషులు ఎందుకు మూఢనమ్మకాలు పట్టుకు వేలాడుతున్నారని, గుళ్లూ గోపురాలు తిరుగుతున్నారని మనం తరచూ చర్చించుకొనే వాళ్లను చూస్తుంటాం. ముఖ్యంగా కొద్దిపాటి సైన్సు చదువుకున్న వారు, హేతువాదులు ఇలా వాపోతుంటారు. "మతములన్నియు మాసిపోవును. జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును" అన్న గురజాడ వాక్యాన్ని వీరు పదేపదే గుర్తు చేస్తుంటారు. ఈ ఆలోచన మనకు హెర్బర్ట్ స్పెన్సర్ అందించిన ఒక తప్పుడు వివరణ ఆధారంగా వచ్చింది. స్పెన్సర్ మానవ సమాజాలు మతం మూఢ నమ్మకాలతో కూడిన ఆటవికత నుంచి హేతుబద్ధత, శాస్త్రబద్ధత కలిగిన ఆధునిక సమాజాలుగా పరిణామం చెందుతాయని ఊహించాడు. అంటే ఒక ఏకరూప నమూనాలో మానవ సమాజం అభివృద్ధి చెందుతుందని ఆయన ప్రతిపాదించాడు. ఇంకా చెప్పాలంటే ఇదొక రకమైన టెక్నలాజికల్ ఆర్గ్యుమెంట్! సమాజ పరిణామం ఒక లక్ష్యంతో సాగుతుందని ప్రతిపాదించడం. జంతుజాలం సరళత నుండి క్లిష్టతవైపు ప్రయాణించినట్టు మానవ సమాజం కూడా ఆటవికత నుండి హేతుబద్ధత వైపు పరిణామం చెందుతుందనుకోవడం. దీనివల్ల మన మానవ సమాజపు తాత్విక సాంస్కృతిక పరిణామం కూడా ఒక సరళరేఖలాగా సాగుతుందనే భ్రమ మొదలవుతుంది.

### మతాలకూ సర్దుబాటు తెలుసు

మనం గమనిస్తే స్పెన్సర్ చెప్పిన దానికి విరుద్ధంగా మానవ సమాజాలు మార్పు చెందుతున్నాయి. మానవ సమాజానికి ఉత్థాన పతనాలు ఉంటాయి. అప్పుడప్పుడు పురాతన సంస్కృతుల పునరుద్ధరణ జరుగుతుంటుంది. అలాగే మతమూ శాస్త్రీయ విజ్ఞానమూ కూడా కలిసి జీవితం సాగిస్తుంటాయి. స్పెన్సర్ చెప్పినట్టు మూఢనమ్మకాలు కనుమరుగవడం ఏమీ వుండదు. పాతవాటి స్థానంలో కొత్తవి మొలకెత్తవచ్చు. ఒక

నిరంతర చలనశీలత కలిగిన మానవ సమాజాన్ని ఒక యాంత్రికమైన సామాజిక పరిణామవాదంతో (Social Evolution) వివరించబూనుకోవడమే ఈ అపోహలకు కారణం. లెవీ స్ట్రాస్ ప్రకారం మతాలు సామాజిక అవసరాన్ని బట్టి సర్దుబాటు (Adopt) అవుతూ వుంటాయి. ఆ క్రమంలో అవి మూఢనమ్మకాలను తిరిగి పట్టుకుని వేళ్లాడుతాయి. పెరుగుతున్న శాస్త్ర సాంకేతిక మూఢనమ్మకాలను తొలగించేస్తోందనుకోవడం పూర్తిగా అసంబద్ధం. అవి ఒకే సమాజంలో కలిసి మెలిసి పక్కనే వుంటాయని మనకు అమెరికా ఇండియాలు నిరూపిస్తున్నాయి కూడా ! మైకేల్ ఫూకో అభివృద్ధి అనేది అధికారంతో నిర్మితమైనది కాబట్టి అది సహజ స్థితి కాదంటాడు. స్పెన్సర్‌ని ఈ విషయం మీద తీవ్రంగా విమర్శించిన వాడు నీషే. సరళరేఖలో మానవ సమాజాల అభివృద్ధిని కాదని నీషే సంస్కృతుల ఉత్థాన పతనాలను వివరిస్తాడు. విజ్ఞాన శాస్త్రం మత మూఢనమ్మకాల నుండి సమాజానికి విముక్తి కలిగిస్తుందనుకోవడం మరో మూఢనమ్మకం అవుతుందంటాడు. మనం మానవ చరిత్రలను పరిశీలిస్తే అవి నిరంతరం ప్రతీకలను, పురాణాలను మోసుకొని తిరిగాయి. కాబట్టి ప్రస్తుత సమాజంలో మూఢనమ్మకాలు వున్నాయంటే అక్కడ శాస్త్రం అభివృద్ధి చెందలేదని అర్థం కాదు. స్పెన్సర్ చెప్పినట్లుగా పోత పోసినట్టుగా ఏకరూప సరళరేఖ మీద మానవ సమాజాలు పరిణామం చెందవు అని దీని అర్థం. దీన్ని అర్థం చేసుకోలేక పోతే శాస్త్రాభివృద్ధి, హేతువాదం గల సమాజమే అసలైన మేధోపరిణామమనే, దాన్ని సాధించడమే అంతిమ లక్ష్యమనే ఒక తప్పుడు ఆదర్శం బయలుదేరుతుంది.

## సైంటిఫిక్ బీభత్సం

అయితే ఇంత వరకూ నేను చెప్పింది ప్రమాద రహితమైన ఉదాహరణ. కానీ 19-20వ శతాబ్దాలలో డార్విన్ తర్వాత వచ్చిన డార్వినిస్టులు, హెర్బర్ట్ స్పెన్సర్, డాల్టన్ వంటి వారు సృష్టించిన సైంటిఫిక్ బీభత్సం చాలా తీవ్రమైంది. హేయమైంది. ముఖ్యంగా ఇది మనుష్య జాతుల మధ్య హెచ్చుతగ్గులను, యూరో సెంట్రిసిజాన్ని, యుథనేసియాతోపాటు సోషలిజం వ్యతిరేకతకు కూడా ఊతమిచ్చేలా తయారయింది. 'సోషలిస్టులు సమానత్వాన్ని ప్రవచిస్తుంటారు గానీ ఇది ప్రకృతి విరుద్ధమైనది. కావాలంటే బయాలజీ చూడండి' అని చెప్పడం కూడా మొదలైంది. ఒక రకంగా చూస్తే శతాబ్దాల చరిత్ర గల క్రిస్టియన్లు పైన చెప్పుకొన్నట్టు డార్విన్ సిద్ధాంతం తెచ్చిన ప్రకంపనలను, అది సృష్టించిన అమానవీయతను కళ్లారా చూసిన తర్వాతే, వారిలో నైతిక ప్రశ్నలు ఉదయించి 'ఈ డార్వినిజం మనిషికి వుండే ఆధ్యాత్మిక ఉన్నతిని జంతుస్థాయికి దిగజార్చింద'నే అభిప్రాయానికొచ్చారు. అందుకే డార్విన్ సిద్ధాంతాన్ని ఖండించారు. బైబిల్ సృష్టివాదం మాత్రమే మనుషులను సమానంగా చూడగలదని నమ్మారు.

అయితే ఈ కాలపు హేతువాదులు డార్వినిజం వ్యతిరేక వాదాన్ని "మూఢతకు సైన్సుకూ మధ్య వైరుధ్యం" (Dogma versus Science) అనే చట్రంలో నుంచి మాత్రమే చూడ్డం తెలిసిన వారు. ఈ చట్రం 19వ శతాబ్దపు మత వాతావరణాన్ని విమర్శించడానికి పనికొచ్చి వుండొచ్చు. కానీ 20వ శతాబ్దంలోని కాథలిక్కులు డార్వినిజాన్ని కాదనడానికి కారణం మతపరమైంది కాదు, జ్ఞానసంబంధమైందీ కాదు, నైతిక ప్రశ్నగా ఇది మొదలైంది. అన్ని నైతిక ప్రశ్నలు కూడా ప్రాక్టికల్ ప్రశ్నలేనన్న విషయాన్ని మనం ఇక్కడ మరవ కూడదు. కొందరు క్రిస్టియన్ మేధావులు డార్విన్ ప్రతిపాదించిన సైంటిఫిక్ వివరణను ఒప్పుకున్నా, నైతికంగా అది ముందుకు తెచ్చే మానవ అసమానతలను ఎదుర్కోవడానికి వేరే మార్గం లేక మొత్తం డార్వినిజాన్నే ఖండించవలసి వచ్చింది. కానీ తర్వాత కాలంలో రాజకీయాల వల్ల డార్వినిజం పట్ల వ్యతిరేకత మతోన్మాదానికి ఊతంగా మారడం మనకు తెలిసిందే.

## డార్విన్ ధోరణి

దీనికి అంతటికి కారణం జీవశాస్త్రానికి చెందిన డార్వినిజాన్ని మానవ సమాజానికి అన్వయించాలని హెర్బర్ట్ స్పెన్సర్ పూనుకోవడమే. ఒకరకంగా డార్వినే ఈ ధోరణికి ఊతం ఇచ్చేలా తన పుస్తకాల్లో రాశాడు అని కూడా మనం గమనించాలి. విక్టోరియన్ కాలానికి చెందిన డార్విన్లో ఈ రేసిజంకు చెందిన ఛాయలున్నాయా లేదో చెప్పలేం గానీ ఆయన రాసిన కొన్ని వాక్యాలు ఈ ధోరణిని ప్రతిబింబిస్తున్నాయన్న వాదన మాత్రం ఉంది. "కొన్ని శతాబ్దాల తర్వాత నాగరికత తెలిసిన మానవ జాతులు ఆదిమ జాతుల్ని తుడిచిపెట్టేస్తాయి" అని "డెసెంట్ ఆఫ్ మాన్" అనే పుస్తకంలో డార్విన్ అంటాడు. ఇటువంటి ధోరణులే ఆ కాలంనాటి జర్మన్ మేధావులలో విష బీజాలు నాటాయన్నది ఒకరకంగా వాస్తవం. ఇలా చూస్తే డార్విన్ రాసిన 'డిసెంట్ ఆఫ్ మాన్' పుస్తకం సైంటిఫిక్ రేసిజాన్ని బలపరిచేదిగా తయారైంది లేదా మనుషులలో కొన్ని జాతులు మిగిలిన వాటికంటే ఎక్కువగా పరిణామం చెందాయనే విషయాన్ని ఒప్పుకున్నట్లయింది. శక్తి వంతులే మిగులుతారు (Survival of the fittest) అనే వాక్యం డార్విన్‌ది కాదు. అది స్పెన్సర్‌ది. తమకు తాముగా బలంగా ఉన్న జాతులు నిలుస్తాయని బలహీనమైన జాతులు అంతరించిపోతాయని సామాజికపరంగా స్పెన్సర్ ఇచ్చిన వివరణ అది.

స్పెన్సర్ బ్రిటిష్ తత్వవేత్త, సామాజిక శాస్త్రవేత్త. బ్రిటన్‌లో పారిశ్రామిక విప్లవం ఉత్తమ స్థితికి చేరుకున్న సమయమది. వలస తత్వంలో భాగంగా బ్రిటన్ వివిధ దేశాల్ని జయించిన కాలమది. ఈ క్రమంలోనే బ్రిటిష్ మేధావులకు సైన్సు పేరిట

తమ జాతీయ అహంకారానికి జీవశాస్త్రపు సమర్థన స్పెన్సర్ Survival of the Fittest నిర్వచన రూపంలో దొరికింది. తన పరిణామవాదానికి ఈ వాక్యానికి సంబంధం లేదని డార్విన్ స్పష్టంగా ఖండించిన దాఖలాలు కూడా లేవు. ఖండించకపోగా దాన్ని అంగీకరించినట్టు పైవాక్యాలు కనపడుతున్నాయి. ఈ నిర్వచనం తన సిద్ధాంతం ప్రజలకు సులభంగా అర్థమయ్యేందుకు ఉపయోగపడుతుందని ఆయన భావించాడు కూడా.

మరో కోణం నుంచి చూస్తే డార్వినిజాన్ని సామాజిక శాస్త్రవేత్త మాల్థాస్ వాదం ప్రభావితం చేసిందనేది కూడా వాస్తవం. దీన్ని స్వయంగా డార్వినే ప్రకటించుకొన్నాడు. మాల్థాస్ తన Essay on the Principle of Population అనే వ్యాసంలో సమాజంలోని క్రిమినల్స్, మానసిక రోగులు ఎక్కువ పిల్లల్ని కంటారనీ, విక్టోరియన్ ఉన్నత వర్గపు విద్యాధిక కుటుంబాలు తక్కువ పిల్లల్ని కంటారని సూత్రీకరిస్తాడు. "మానవకణాలు మనుగడ కోసం బహువేగంగా బహుసంఖ్యలోకి మారుతాయి" అనే డార్విన్ సూత్రీకరణలో మాల్థాస్ ప్రభావం కనిపిస్తుంది. స్పెన్సర్, డాల్టన్‌లు 19వ శతాబ్దం చివరికి వచ్చేప్పటికి అచ్చం డార్విన్ లాగే జీవశాస్త్ర అంశాన్ని సమాజానికి అన్వయించడం మొదలు పెట్టారు. అందువల్లనే స్పెన్సర్ వల్ల సోషల్ డార్వినిజం, గాల్టన్ వల్ల యుజెనిక్స్‌ మొదలయ్యాయి.

**జాత్యున్మాదం**

డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని 'సర్వైవల్ ఆఫ్ ద ఫిటెస్ట్‌గా' ట్విస్ట్ చేసి సోషల్ డార్వినిజాన్ని ప్రతిపాదించింది స్పెన్సరే తప్ప ఇందులో డార్విన్ పాత్ర ఏమీ లేదని ఆధునిక డార్వినిస్టులైన స్టీఫెన్ జాయ్ గౌల్డ్ వంటి వారి వాదన. "అసలు సోషల్ డార్వినిజం అనే పదమే డార్విన్ సిద్ధాంతానికి సంబంధించినది కాదు. అది స్పెన్సర్, గార్డెన్ తదితరులు రూపొందించినది" అని డార్విన్‌ని కాపాడే ప్రయత్నం చేస్తాడు గౌల్డ్. నిజానికి మొదటి డార్వినిస్టుగా డార్విన్ బతికున్న కాలంలోనే సోషల్ డార్వినిజం వైపు అడుగులు చేసినవాడు ఎర్నస్ట్ హెకిల్. కానీ ఈ యుగపు డార్వినిస్టులు ఇతన్ని క్షమిస్తున్నారు. నిజానికి జాతుల మధ్య హెచ్చుతగ్గులను, అసమానతలను డార్విసిజం సమర్థిస్తోందన్నంతగా హెకిల్ రాతలు కొనసాగాయి. అతడు కాకేషియన్లను ఉన్నత జాతి మానవులుగాను, ఆఫ్రికన్లను తక్కువజాతి మానవులుగాను వింగడిస్తాడు. ఉన్నతజాతి మానవులకు అధమ స్థాయి మానవులకు మధ్య చాలా తేడా వుంటుందనీ, అధమస్థాయి మానవులకూ, కోతి చింపాంజీ లాంటి ఉన్నత స్థాయి ప్రైమేట్సుకు మధ్య తేడా స్వల్పమేనని అంటాడు. చూడండి దీనిలో స్పష్టంగా జాతులు మధ్య హెచ్చు తగ్గులున్నాయన్న సూచన ఎంత వుందో! ఈ సూచన రిచర్డ్ డాకిన్స్ రూపంలో, డీఎన్ఏను కనుక్కున్న వారిలో ఒకడైన జేమ్స్ వాట్సన్ రూపంలో నేటికీ కొనసాగుతోంది. డాక్సిన్ 2011లో ఆస్ట్రాలోపిథికస్ లాంటి మానవజాతిని జన్యు ఇంజనీరింగ్ ద్వారా బ్రతికించి, అది ఏ విధంగా మనుషులకూ, కోతులకూ మిస్సింగ్ లింక్‌గా వుందో పరిశీలించాలంటాడు. ఇందులో తప్పేమీ లేదు కదా అని మనకు అనిపించవచ్చు. కానీ గత రెండు శతాబ్దాలుగా సోషల్ డార్వినిజం పేరుతో ఆఫ్రికన్ పిగ్మీలను మనుషులకు కోతులకు మిస్సింగ్ లింకుగా అభివర్ణించే ఆ కాలపు డార్వినిస్టులకు రిచర్డ్ డాకిన్స్ కి తేడా లేకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఈ ఆస్ట్రలోపిథికస్ మరలా ఏ జాతుల మధ్య హెచ్చు తగ్గులను సృష్టిస్తుందోననే భయం మొదలవుతుంది.

**ఉన్నత జాతి ఉన్మాదం**

ఏది ఏమైనా సోషల్ డార్వినిజం డార్విన్‌ను సైతం ఇబ్బందులు పెట్టింది. Survival of the fittestతో, స్పెన్సర్‌తో ప్రభావితమైన ఆనాటి సైన్సు 'యుజనిక్స్' అనే కొత్త సైంటిఫిక్ విభాగాన్ని ముందుకు తెచ్చింది. సర్వైవల్ ఆఫ్ ద ఫిటెస్టెక్‌కు ఇది ప్రాక్టికల్ అప్లికేషన్. దారిన తర్వాత డార్వినిస్టులు తమపై వస్తున్న వ్యతిరేకతకు సమాధానంగా యుజెనిక్సు చూపడం మొదలుపెట్టారు. "బలంగా వుండే జాతులే నిలబడతాయి. బలహీనమైనవి నశిస్తాయి. కాబట్టి బలంగా వుండే సమాజాన్ని తయారు చేయాలంటే ఏం చేయాలి? బలమైన జాతుల మనుషుల మధ్య మాత్రమే సంపర్కం జరగాలి. బలహీనమైన వారిని నాశనం చేస్తే రాబోయే మానవ సమాజం గొప్పగా వుంటుంది" అన్న ఆలోచన మొదలైంది.

అమెరికాలో 1921లో "నేషనల్ కాంగ్రెస్ ఆఫ్ యుజనిక్స్ మ్యూజియం" మొదలైంది. అందులో వివిధ జాతులకు చెందిన మానవుల చిత్రపటాలు ఉంటాయి. ఎవరి మెదడు సైజు ఎంతుంటుందో, ఎవరికి తెలివి ఎక్కువగా వుందో, ఎవరి అంగసౌష్టవం ఎలా ఉందో వర్ణిస్తూ చిత్రాలుంటాయి. అవన్నీ చివరగా ఇచ్చే సందేశం బ్లాక్, హిస్పానిక్, ఏషియన్, మెక్సికన్ల కంటే కాకసన్లు ఉత్తమ జాతికి చెందిన వారని ! ఈ మ్యూజియం బయట ఈ యుజెనిక్స్‌కి ఆద్యులుగా ఇద్దరి శిల్పాలు చెక్కబడి వుంటాయి. ఒకటి డాల్టన్‌దయితే రెండవది డార్విన్‌ది! డార్విన్ కుమారుడు లియోనార్డ్‌తోపాటు గ్రహంబెల్ వంటి ఎందరెందరో ప్రముఖ సైంటిస్టులు ఈ మ్యూజియం నుండి ఆహ్వానం అందుకునేవారు. వీరందరూ తమ జాతులు సంకరం అయిపోతున్నాయని గగ్గోలు పెట్టేవారు. మరో పదేళ్లకు పిచ్చి మరింతగా ముదిరింది. కొంత మంది నల్లజాతి వారిని ప్రదర్శనకు పెట్టేవారు. హార్మోన్ సమస్య వల్ల గడ్డం మీసం వచ్చిన ఒక అమ్మాయిని మనుషులకు చింపాజీలకి మధ్యన మిస్సింగ్ లింకుగా ప్రదర్శనలో పెట్టారు. అక్కడ కోతులకు ఆహారం వేసే 'ఒటా బెంగా' అనే ఒక నల్ల జాతి పిల్లవాడిని మరో మిస్సింగ్ లింకుగా ప్రచారం చేశారు. సందర్శకులు

అతన్ని కర్రలతో పొడిచి చూసేవారు. ఒక రకంగా ఈ అమానవీయ ఉన్మాదాన్ని మొదటి నుంచి అడ్డుకున్నది కాథలిక్ చర్చినే! మానవ సమాజాలకు మతోన్మాదమే కాదు సైంటిఫిక్ డిటెర్మినేషన్ రూపంలో, యుజెనిక్ రూపంలో ఉండే సైంటిఫిక్ ఉన్మాదం కూడా అంతే ప్రమాదకరమైనది అనేందుకు ఈ మ్యూజియం ప్రత్యక్ష సాక్షిగా నిలబడింది ! ఇరవయ్యవ శతాబ్దం మొదటి మూడు దశాబ్దాలలో ఈ యుజెనిక్స్ పెద్ద ఉద్యమంగా పైకి లేచింది. దీని ప్రభావంతో జాతిని కాపాడుకోవాలంటే బలహీనులను, దివ్యాంగులను పట్టుకుని గంపగుత్తగా స్టెరిలైజేషన్ చెయ్యాలని చట్టాలు చేశారు. అమెరికాలోని 32 రాష్ట్రాల్లో దీన్ని అమలు చేశారు. ఫలితంగా కొన్ని వేల మంది బలవంతంగా స్టెరిలైజ్ చేయబడ్డారు.

## సైన్సు యుగంలో నీచపు పోకడలు

విచిత్రమేమంటే మత ఛాందసత్వం ఎక్కువనుకొనే కొన్ని దక్షిణాది రాష్ట్రాలకంటే శాస్త్రీయత, లౌకికత్వం బలంగా వున్నాయనుకొనే ఉత్తర, పశ్చిమ రాష్ట్రాల్లోనే ఈ యుజెనిక్స్ స్వభావం ఎక్కువగా కనబడింది. యుజెనిక్సు డేటా క్లినిక్కులు ఏర్పడ్డాయి. అమెరికన్ రాష్ట్రాల పాఠశాలల్లో ప్రతి విద్యార్థి వంశ వృక్షాన్ని వేయాలి. ఎవరెవరికి ఏ జబ్బులు వుండేవో రాయాలి. ఈ డేటాని స్కూళ్లు గవర్నమెంటుకు సమర్పించాలి. తద్వారా ఎవరు బలవంతులో, ఎవరు బలహీనులో గవర్నమెంటు అధికారులు నిర్ణయిస్తారు. పెళ్లి చేసుకోవడానికి దంపతులు మొదటి తమ వంశవృక్షాన్ని, కుటుంబసభ్యులనూ విధిగా సమర్పించాలి. బలహీనమైన జన్యువు గల వారు పెళ్లికి అనర్హులు. వివిధ జాతులకు చెందిన వారు పెళ్లి చేసుకోకూడదు. తెల్ల వాళ్లు, నల్లవాళ్ల మధ్య పెళ్లి నిషిద్ధం. అలా చేస్తే బలహీన జాతులకు చెందిన జన్యువులు కలిసిపోయి మొత్తంగా జాతి నిర్వీర్యం అవుతుంది. నల్లజాతి వారు తక్కువ జాతి వారు (Sub human) కాబట్టి వారి ఇమిగ్రేషన్‌పై కూడా విపరీతమైన అంక్షలను విధించేవారు. నల్లవారిని ఎక్కువ మందిని దేశంలోకి రానీయడం వల్ల దేశం బలహీనమవుతుందని భయం పట్టుకుంది. ఇదంతా ఏ మనువు కాలంలోనో కాదు. ఇవన్నీ సైన్స్ అభివృద్ధి చెందిందనుకున్న ఇరవయ్యవ శతాబ్దపు పోకడలు ! దాదాపు 70 వేల మంది శారీరక మానసిక బలహీనులను, దివ్యాంగులను క్యాంపుల్లో వేసి చంపేశారు. ఎందుకంటే వీరు పిల్లల్ని కనడం వలన బలహీన సమాజం ఏర్పడుతుందని భయం! ఈ క్యాంపుల్లో చంపేసిన అనుభవమే తర్వాత యూదు వినాశనానికి (హోలో కాస్ట్)కి ఉతమిచ్చిందంటారు. నాజీయిజానికి ఇలాంటి జాత్యాహంకారాలే మూలమని మనకు తెలుసు. ఇది ఎన్ని లక్షల మంది యూదుల జీవితాల్ని పొట్టన పెట్టుకుందో కూడా తెలిసిందే ఈ ఊచకోతకు జీవశాస్త్రం నుంచి సపోర్టు రావడంలో 19 శతాబ్దంలోని డార్విన్ ఆధారిత సామాజిక డార్వినిజం, యుజెనిక్సుల వాతావరణమే కారణం. హిట్లర్ ఉన్నతమైన ఆర్య జాతి జీన్ పూల్ ఇతర జాతులతో కలవడం వల్ల కలుషితమవుతుందని ఈ కోవలో భాగంగానే భావించాడు.

## కొత్త సైన్సూ కొత్త హెచ్చరికలు !

ఆఫ్రికన్ పెగ్మీలను తక్కువ జాతి మనుషులుగా చూడడం, మతస్థుల పట్ల హేతువాదులు మేధోపరమైన అంటరానితనం పాటించడం కూడా స్పెన్సర్ నిర్వచించిన సామాజిక డార్వినిజం ఫలితాలే. అయితే జన్యు ఇంజనీరింగ్ ఆధారంగా పుట్టబోయే బిడ్డ లక్షణాలు ముందే నిర్ణయించే దశకు మనం చేరుకుంటున్న కొద్దీ సోషల్ డార్వినిజం, యుజెనిక్సూ రెండూ పునరుజ్జీవం పొందుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కానీ మానవ సమాజాలు వివిధ దశల్లో ఎప్పటి నుంచో సామాజిక హెచ్చు తగ్గులను పాటిస్తూనే ఉన్నాయి. డబ్బు సంపాదన, ఉద్యోగ సంపాదన, హోదా సంపాదన, మేధావిత్వం, ఐక్యూ ఇలా అన్నిటిలో హెచ్చుతగ్గుల బేరీజులు వున్న సమాజాలనే మనం నిర్మించుకున్నాం. మనుషులుగా మనకుండే ఈ అనైతికకు బయలాజికల్ రూపం ఇచ్చే ఒక వైజ్ఞానిక అంశమే సోషల్ డార్వినిజం. అన్ని రకాల అమానవీయతలను వదిలి, సైన్సును మానవీయత వైపు నడపగలిగే మేధావిత్వం, రాజకీయం మనకు ఎప్పటికైనా అందేనా అన్నదే అసలు ప్రశ్న. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆధారంగా చేసుకుని, సామాజిక క్షేత్రంలోకంటే మనుషుల కణాల లోపలి విషయాలు– అంటే మాలిక్యులర్ బయాలజీ, జెనెటిక్స్ వంటి విషయాల్లో పరిశోధనలు జరుగుతున్న తరుణమిది. గమనించి చూస్తే ఈ జన్యు పరిశోధనలను తమ తమ రాజకీయ ప్రయోజనాల దృష్టితో వివరిస్తూ, తమకు తాము ఎంతో గొప్ప జాతులుగానూ మిగతావి క్రూరమైనవి గానో లేక ఆటవికమైనవి గానో ప్రతిపాదించే కొత్త సూత్రీకరణలు పెరిగిపోతున్నాయి.

సైన్సు పరిశోధనలను వివరణాత్మక విషయాలుగా గాక తమ రాజకీయ లక్ష్యాలను నిర్దేశించే ప్రిస్క్రిప్షన్లుగా వాడుకునే ధోరణులు పెరుగుతున్నాయి. మళ్లీ మనం అమానవీయత వైపు పయనించే అవకాశాలు పెరుగుతున్నాయి. ఇటువంటి తరుణంలో సైన్సు పేరిట జరిగిన, జరుగుతున్న దాష్టీకాలను దాచిపెట్టి సమాజాలు సైంటిఫిక్‌గా మారడమే అసలైన సామాజిక లక్ష్యమని మాట్లాడే మాటలు మళ్లీ ఏ ఉపద్రవాన్ని తీసుకొస్తాయో అనిపిస్తోంది. మనం మతం పట్ల మాత్రమే గాక సైన్సు పట్ల, దాన్ని వివరింప బూనుకుంటున్న సోకాల్డ్ మేధావుల పట్ల కూడా జాగ్రత్తతో ఉండక తప్పదు. Misanthropy has many faces. అందులో మతోన్మాదమే కాదు విజ్ఞానోన్మాదమూ కూడా వుందని గుర్తించక తప్పదు! ❑


# కొత్త ఆలోచనల దారులు పరచిన పథికుడు



- వకుళాభరణం రామకృష్ణ

ఇవి సమకాలీన రాజకీయ సామాజిక చరిత్ర మీద మార్క్సిస్టు మేధావి, పత్రికా సంపాదకుడు, ఉద్యమ నేత డివివియస్ వర్మ గారు చేసిన విశ్లేషణలు. వర్మగారంటే నాకు ఎంతో ఇష్టం. ఆయన హైదరాబాదులో ఉన్న కాలంలో ఆయనను దగ్గరగా చూసే అవకాశం కొద్దిగా లభించింది. ఆయన విషయ పరిజ్ఞానం, నిబద్ధత, నిరాడంబరత ఆయన మీద నా గౌరవాన్ని పెంచాయి. విశ్వ విద్యాలయాల్లో మార్క్సిస్ట్ అవగాహనతో చరిత్రను విశ్లేషించబూనుకోవడంతో చరిత్ర అంతకుముందు చూడని కొత్త దారులవెంట ప్రయాణించింది. చీకటి కోణాలు అనేకం వెలుగుచూశాయి. ప్రజలే చరిత్ర నిర్మాతలని రుజువయ్యింది. చారిత్రక ఘటనల వెనుక ఉన్న సామాజిక ఆర్థిక పరిణామాల గమనశీలతను పట్టుకున్నారు చరిత్రకారులు. ఇదంతా వేల ఏళ్లు మొదలు వందలోపు ఏళ్ల క్రితం ముగిసిన జాతీయోద్యమం మీదుగా సాగి ఇటీవలి దేశ గణతంత్ర చరిత్రలోకి కూడా ప్రవేశించింది. అయితే ఒక ఘటన జరిగిన ఐదేళ్లు తిరక్కుండానే నిర్దిష్టమైన దృక్పథంతో విశ్లేషించి ఆ సందర్భం మీద కమ్ముకున్న పొరల్ని ఒక్కటొకటిగా వొలిచి సత్యావిష్కరణ చేయడంలోని తక్షణత్వం అంతకుముందు నేను చాలా తక్కువసార్లు చూశాను. వర్మ గారు ఈ పుస్తకంలో చేర్చిన ఎన్టి రామారావును మార్క్సిస్ట్ దృక్పథంలో చూసిన వ్యాసం ఆ కోవలో మేలైనది. 1983లో అధికారంలోకి వచ్చిన ఎన్.టి.రామారావు మీద 1988లో వర్మ గారు ఆ సుదీర్ఘవ్యాసం వెలువరించారు. మార్క్సిజం బాగా చదువుకున్న ఆయన ఫ్రాన్స్‌లో 1848-52 మధ్య జరిగిన పరిణామాల నేపథ్యంలో మార్క్స్ రాసిన The Eighteenth Brumaire of Louis Bonaparteలో చేసిన విశ్లేషణను సరిగ్గా ఆంధ్రదేశానికి, ఎన్టి రామారావుకు అన్వయించారు.

1789లో ఫ్రెంచ్ ప్రజలు తొలిసారి నిరంకుశ రాచరిక వ్యవస్థ మీద స్వేచ్ఛ కోసం, సమానత్వం కోసం విప్లవించారు. 1789, 1830, 1848ల్లో విప్లవాలు జరిగి అధికారం మధ్యతరగతికి రాచరికానికి మధ్య ఊగిసలాడింది. 1871 కమ్యూన్ సంగతి సరేసరి. 1789లో తొలి విప్లవం సంభవించినపుడు ఫ్రాన్స్‌లో మొదటిసారి రిపబ్లిక్ ఏర్పడింది. కాని దేశం అరాచకం పాలయ్యింది. విదేశీ సేనలు చుట్టుముట్టాయి. మధ్యతరగతి ప్రభుత్వానికి అధినేతగా అధికారంలోకి వచ్చిన మొదటి




నెపోలియన్ తనను Son of Revolution అని చెప్పుకుని దేశాన్ని గట్టెక్కించాడు. కాని, విప్లవాన్ని పడగొట్టి తనను చక్రవర్తిగా ప్రకటించుకున్నాడు. తరువాత ఫ్రెంచ్ ప్రజల ఆకాంక్షలకు తగ్గట్టుగా అనేక సైనిక విజయాలు సాధించి ప్రజల హృదయాల్లో man of destiny (అవతార పురుషుడు)గా స్థానం పొందాడు. అతని తరువాత రాచరికం కొనసాగి దేశం మళ్లీ అనిశ్చితిలో పడింది. ప్రజలు మళ్లీ ప్రజా ప్రభుత్వాన్ని కోరుకున్నారు. తీవ్ర గందరగోళంలో వివిధ రాజకీయపక్షాల మధ్య అధికారం చేతులు మారింది. ప్రజలు దేశాన్ని రక్షించగల నాయకుడి కోసం చూశారు. ఈ దశలో నెపోలియన్ కుటుంబానికే చెందిన లూయీ నెపోలియన్ ముందుకు వచ్చాడు. నెపోలియన్ అనే పేరు ఒక సమ్మోహక శక్తిగా పనిచేసింది. అతనిలో వారు తమ అవతార పురుషుణ్ణి చూసుకున్నారు. అధికారంలోకి తెచ్చారు. పేరుకే నెపోలియన్. కాని, సారంలో అతన్ని విక్టర్ హ్యూగో Little Napoleon అన్నాడు.

ఫ్రాన్సులో వర్గ పోరాటం ఒక సామాన్యమైన వ్యక్తిని రాజకీయ హీరోగా ఎట్లా చలామణి చేసిందో రాష్ట్రంలో కాంగ్రెస్ వ్యతిరేకత ఎన్‌టి రామారావుని అట్లా అధికారంలోకి తెచ్చిందని చెప్పడంలో వర్మ గారు సఫలీకృతులయ్యారు. అంతకు ముందు రాష్ట్రంలో పెట్టుబడిదారీ, వామపక్ష ప్రత్యామ్నాయ పోరాటంలో వామపక్షం వెనుకడుగు వేయడాన్ని, తరువాత రెండు పెట్టుబడిదారీ మార్గాల రాజకీయ పక్షాల సంఘర్షణ తలెత్తడాన్ని, చివరికి కాంగ్రెస్ వ్యతిరేకత ఒక స్వతంత్ర శక్తిగా మారి, సినిమాలలో కృష్ణుడిగా రాముడిగా జానపద సాంఘిక చిత్రాల కథానాయకుడిగా ఆ పాత్రల లక్షణాలన్ని ఆపాదించబ డిన రామారావు సమ్మోహక శక్తిగా అవతరించడాన్ని, ప్రజలతన్ని అవతార పురుషుడిగా భ్రమించడాన్ని వర్మ గారు విశ్లేషించిన తీరు ఎంతో సముచితంగా, విలువైనదిగా ఉంది. వర్మగారు మార్క్సిస్ట్ దృక్పథంతో చేసిన కొన్ని సూత్రీకరణలు ఆధునిక ఆంధ్రదేశ చరిత్ర అధ్యయనానికి మార్గదర్శకాలుగా పనిచేస్తాయనడంలో సందేహం లేదు. స్వాతంత్ర్యానంతర ఆంధ్రదేశ రాజకీయ అధ్యయనానికి వర్మగారి ఈ పరిశీలన ఒక కరదీపిక.

ఇదంతా ఒక కోణం అయితే 1937లో చనిపోయిన ఇటాలియన్ మార్క్సిస్ట్ ఆంటోనియో గ్రాంసీ రచనల ఇంగ్లీష్ అనువాదం 1971 దాకా వెలువడలేదని తెలుసు. ఇటలీలోనే అతని సర్వలభ్య రచనల సంకలనం 1980 దాకా రాలేదు. అటువంటిది వర్మ గారు 1988 నాటికే రామారావు రాజకీయ ఆగమన సందర్భం లో సంక్షోభకాలంలో సమ్మోహన శక్తులకు ద్వారాలు ఎలా తెరుచుకుంటాయో వివరించడానికి గ్రాంసీని ఉటంకించారు. అట్లాగే, మార్క్స్ ప్రస్తావించిన క్షీణ కార్మిక వర్గం (lumpen proletariat) గురించి అందరూ ప్రస్తావిస్తారు. కాని బూర్జువా సమాజపు శిఖరాగ్రంలో డబ్బు సంపాదన కోసం అన్ని అడ్డదారులూ తొక్కే క్షీణ ప్రభువర్గం (lumpen bourgeoisie) తల ఎత్తడం గురించి ఆశ్చర్యకరంగా ఈ పుస్తకంలో వర్మ గారు ప్రస్తావించారు. ఈ అరుదైన ఉటంకింపు లోతైన అధ్యయనం వల్లనే సాధ్యం.

చరిత్ర అధ్యయనంలో మార్క్సిస్ట్ విశ్లేషణ తరువాత సబాల్టర్న్ దృక్పథం వచ్చినట్లే ఆ దృక్పథానికి మార్గదర్శి అయిన అంటోనియో గ్రాంసీని తరువాతి వ్యాసంలో వివరంగా ముందుకు తెచ్చారు వర్మ గారు. అయితే ఆయన చరిత్రకారుల మాదిరిగా ఉపశ్రేణులకు మాత్రమే పరిమితం కాలేదు. మార్క్సిజంలోని నియతి వాదాన్ని ఖండించి, దానికి సాగే లక్షణాన్ని జోడించిన గ్రాంసీ భావజాలం మొత్తాన్ని ఆంధ్రదేశ రాజకీయాలకు అన్వయించారు. ఇటువంటి ప్రయత్నం భారతదేశంలో ఏ ప్రాంతీయ రాజకీయాల మీద జరిగినట్టు నేను వినలేదు. గ్రాంసీని అధ్యయనం చెయ్యడానికి లోతైన అవగాహన శక్తి కావాలి. వర్మగారు గ్రాంసీని వ్యక్తీకరించిన తీరులోని స్పష్టత నన్ను విస్మయపరచింది. Historic bloc, హెజమొని, కౌంటర్ హెజమొని, బాస్టర్డ్ హెజమొని, సవర్ణ మేధావులు, లోకజ్ఞానం విచక్షణ జ్ఞానంగా మారే తీరు వంటి జటిలమైన సైద్ధాంతికాంశాల్ని తెలుగులో మంచినీళ్లప్రాయం చేశారు. వామపక్ష భావజాలంతో సుదీర్ఘ సాహచర్యం, అధ్యయన ఆచరణలు లేకుండా ఇది సాధ్యపడదు. స్వాతంత్ర్యానంతర తొలిదశలో ఆంధ్రదేశంలో వామపక్షాలు సాధించిన ప్రజా హెజమొని వెనుక సద్యోజనిత గ్రాంసీయిజం ఉందనడం వర్మ గారి నూతన ఆవిష్కరణ. ఒకే ప్రాంతీయ పెట్టుబడిదారీ వర్గం రెండు ప్రాంతీయ పార్టీలుగా విడిపోయి బాస్టర్డ్ హెజమొని సాధించిందనడం వర్మ గారు చూపుతున్న కొత్త వెలుగు.

ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో గ్రాంసీ అధ్యయనం గణనీయంగా పెరగడం వెనుక ఈ 'ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ప్రయోగాలు 1952-2020'తోపాటు ఆయన సంపాదకత్వంలో గ్రాంసీ మీద రెండు ప్రత్యేక సంచికలు వెలువడడం కూడా కారణమనుకుంటాను. మేథోసమాజపు దృష్టిని ఇట్లా ఒక సమ్యక్ దిశ వైపుకు మరలించగలగడం సాధారణ వ్యక్తులు చేయగలిగే పనికాదు. వర్మగారి ఈ ప్రయత్నం దేశంలో Cultural hegemony సాధనకు జరుగుతున్న ప్రయత్నాలను సరిగా అర్థం చేసుకోవడానికి తప్పక ఉపకరిస్తుంది. అప్పుడు ఆయన ప్రయత్న ఫలితం ఎన్నో రెట్లు పెరుగుతుంది.

వ్యవస్థను మార్చే ప్రజా ఉద్యమాలకు కొత్త దారి చూపిస్తున్నారు వర్మ గారు. ఒక సిద్ధాంతం గానీ, భావజాలం గానీ ప్రజల మనసుల్ని ఆకర్షించగలిగినపుడు అది భౌతికశక్తిగా మారుతుందన్న మార్క్స్ భావనని శాస్త్రీయంగా వివరించారు. ప్రజల ఉమ్మడి ఆకాంక్షకు ఇట్లా భౌతిక శక్తిగా మారే శక్తి ఉందని, అది ఒక పరిచారిక అవుతుందని అంటూ వ్యవస్థని మార్చాలనుకునే వాళ్లకు మార్చేదిగా, ప్రలోభపెట్టి అధిపత్య పోరుకు వినియోగించుకునే వారికి అదే విధంగా ఉపయోగపడుతుందని విశ్లేషిస్తున్నారు. ఒక ఆకాంక్ష ప్రజల నిత్య జీవనానికి సంబంధించినదై ఉండాలని, ఆచరణలో సాధ్యమేనన్న నమ్మకం కలిగించేదై ఉండాలని, అది తమ జీవితాల్ని ఎలా మార్చివేస్తుందో స్పష్టపరిచే మరొక చర్య జతపడాలని అప్పుడే అది భౌతికశక్తిగా మారుతుందని కూడా అంటున్నారు. సమాజంపట్ల ప్రజల బాగోగుల పట్ల ఎంత నిబద్ధత, తపన ఉంటే ఒక వ్యక్తి ఇట్లా ఆలోచించగలుగుతారు, ప్రతిపాదనలు చెయ్యగలుగుతారు అని అనిపిస్తున్నది.

వర్మ గారు సంపాదకత్వం చేసిన జాతీయస్ఫూర్తి, దారిదీపం పత్రికలు నాకు అందుతూ ఉండేవి. వాటిల్లో కొన్ని ప్రత్యేక సంచికలు ఉన్నాయి. అందులో కొన్నిటికి నాచేత వ్యాసాలు రాయించారు. కొన్ని ఆవిష్కరింపజేశారు. ఈ ప్రత్యేక సంచికల్లో మార్క్స్ మీద వెలువరించిన రెండు సంచికలు భద్రపరుచుకోదగ్గవి. 'సమ సమాజానికి దారిదీపం మార్క్స్' పేరిట వేసిన సంచికలో మార్క్సిజం వెనుకపట్టు పట్టిందనుకుంటున్న దశలో 2008 నాటి నుంచే పెట్టుబడిదారీ దేశాలు తిరిగి మార్క్సిజం వైపు దృష్టి సారించాయని గమనించడం, అందుకు తగ్గట్టు మన దృష్టి మళ్లిస్తూ ఒక ప్రత్యేక సంచిక వేయడం వర్మ గారు మార్క్సిజం అధ్యయనంలో ఎంత updatedగా ఉన్నారో తెలుస్తున్నది. 'మనకు తెలియని మార్క్స్ రాత ప్రతుల'ను పరిచయం చేసిన రెండవ సంచిక మార్క్సిస్ట్ మేధావులకు సైతం తెలియని కోణాల్ని బయటపెట్టింది. మార్క్స్ రచనలు సగానికి పైగా వెలుగుచూడకపోవడం వల్ల మార్క్సిజం నియతివాదంగా చలామణి అయ్యిందని, మార్క్సిజం మీద వచ్చిన విమర్శలకు మార్క్స్ అచ్చుకాని రచనల్లో సమాధానాలున్నాయని ఈ సంచిక చెప్పింది. ఏంగెల్స్ ద్విశత జయంతి సందర్భంగా వెలువరించిన ప్రత్యేక సంచికలో మార్క్స్‌ను, ఏంగెల్స్‌ని వర్మ గారు అంచనా వేసిన తీరులో సున్నితపు త్రాసు ఖచ్చితత్వం కనిపిస్తుంది. మోదీ ఎనిమిదేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా వేసిన సంచికలో 'మనం గతాన్ని తెలుసుకోవాలి. కాని గతంలోకి ప్రయాణించకూడదు' అన్నపుడు వర్మగారి ఆలోచన ల్లో గాఢత, వ్యక్తీకరణలో సరళత తెలుస్తుంది. ఈ సంకలనంలో వర్మగారి సంపాదకీయాలతోపాటు ఇతర వ్యాసాలు చేర్చారు. అవి మరింత విలువైనవిగా కనిపిస్తున్నాయి.


వర్మ గారు నిర్వహించిన ఇంటింటికీ మరుగుదొడ్డి, సంపూర్ణ అక్షరాస్యతా ఉద్యమం, రైతు కార్యాచరణ సమితి వంటి ఉద్యమాల గురించి విన్నాను. వాటి రూపకల్పన, నిర్వహణలు దీక్షాదక్షతలున్న వర్మ గారు మాత్రమే చేయగలిగినవి. వాటి గురించి విన్న తరువాత ప్రజల గురించి ఆలోచించకుండా ఉండడం వర్మ గారికి చేతకాదని నాకు అర్థమైంది. ఈ కొత్త ఆలోచనల్ని ఆచరణని ఈ వయసులోనైనా విడిచిపెట్టడం ఆయనకు సాధ్యం కాని పని. ఈ కృషిని ఆయన కొనసాగించాలని కోరుకోవడం జరిగే పనినే జరగాలని కోరుకోవడం లాంటిది. వర్మగారు నాకు సమకాలికుడూ, స్నేహితుడూ అయినందుకు సంతోషంగా ఉంది. ఈ పుస్తకం నా ఆలోచనల్ని, అవగాహనను మరింత కాంతివంతం చేసిందని ప్రత్యేకంగా ప్రకటిస్తున్నాను. చివరగా, ఈ నాలుగు మాటలూ రాయడంలో నాకు సహకరించిన మిత్రులు కొప్పర్తి వెంకటరమణమూర్తికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ❑

## ఇది మామూలు నవల కాదు

**- జి.రాజశుక**

నవలగా మారిన వాస్తవిక జీవితమూ దాని చిత్రణ. ఇల్లాంటి వాస్తవికమైన జీవిత నవల బహుశా తెలుగులో ఇదే మొదటిదేమో! ఆ వ్యక్తి అసాధారణ జీవిత శోధకుడూ పరి శోధకుడూ చలం. గుడిపాటి వెంకటాచలం జీవితం నవలా వస్తువు కాదగినదే మరి. వ్యక్తి స్వేచ్ఛ.. స్త్రీ స్వేచ్ఛ.. ప్రేమలు, పెళ్లిళ్ల పట్ల గుడిపాటి వెంకటచలానికి ఉన్న భావాలు విప్లవాత్మకమైనవి. ఆయన తదనంతర రచయితల ఆలోచన లనూ, మనోభావాలనూ సమూలంగా మార్చేసిన, లేదా తీవ్రంగా ప్రభావితం చేసిన భావాలవి. అటువంటి వివాదాస్పదమైన రచయిత చలం జీవితానికి నవలా రూపం ఈ 'ప్రేమకు ఆవలి తీరం' చలం తన ఆత్మకథ రాసుకు న్నాడు. నిజమే కానీ.. ఒక రచయిత జీవిత చరిత్ర, స్వీయ చరిత్ర లో అతని అనుభవాలు, అతని జీవితంలోని సంఘటనలు పూర్తిగా వెలువడకపోవచ్చు. అతని జీవితాన్ని క్షుణ్ణంగా చదివిన వారు దాన్ని పూర్తిగా రాయగలరు. చలం కు ఎక్కువగా స్నేహితురాళ్లే ఎందుకు ఉన్నారు? ఆయన కవిగా ఎలా మారారు? చలంకు ఎందుకు ఎవరూ ఇల్లు అద్దెకు ఇవ్వలేదు? ఎంతో మంచి రచనా శైలి ఉన్న అతను స్త్రీ యొక్క స్వేచ్ఛ గురించే ఎక్కువగా రచనలు ఎందుకు చేసారు? చివరి దశలో రమణాశ్రమంలో ఎందుకు చేరారు? ఇంకా చలం గురించి ఎవరికి తెలియని మరెన్నో విషయాలను నవీన్ రాసిన "ప్రేమకు ఆవలి తీరం"లో కనిపిస్తాయి. లోకానికి అవసరమైన చలం.. అక్కర్లేని చలం.. అంటూ కొందరు ఆయన జీవితాన్ని ముక్కలు చేసి విశ్లేషించారు. రమణాశ్రమ జీవితం లోకానికి అక్కర్లేదనీ దానికి పూర్వపు జీవితమే సమాజానికి అవసరమైనదనీ వారి భావం. కాదు కాదు.. ఆశ్రమ జీవితమే లోకానికి సమాజానికి అవసరమైనదని మరికొందరి భావం కానీ నిజమైన చలాన్ని.. అతని అంతరంగాన్నీ తెలుసుకోవాలంటే ఈ రెండూ అవసరమే మరి. నవలా రచనలో.. జీవితాత్మక నవల ఓ కొత్త ప్రయోగం. గతంలో ప్రముఖ ఆంగ్ల రచయిత ఇర్వింగ్ స్టోన మాత్రమే ఇటువంటి ప్రయోగం చేశారు. కొద్దిగా కల్పన ఉన్నప్పటికీ, అసలు సంఘటనలు, అసలు పాత్రలనే ఎంచుకుని ఈ నవలను రాశారు నవీన్ తను రాసినట్టుగా కాకుండా, తన రచనలోనే ఉన్న సృజన అనే స్త్రీ పాత్ర ఈ నవలను రచించినట్టు రచయిత కల్పన చేశారు. తన ఆశయాలు, ఆచరణ మధ్య చలం పడ్డ సంఘర్షణ ఆయన జీవితాన్ని ఎంతలా కల్లోల పరిచిందో ఇందులో చక్కగా చిత్రీకరించారు. చలం 'ఆత్మకథ' రాసుకున్నా చలం రాయని అనేక విషయాలు ఈ జీవితాత్మక నవలలో కనిపిస్తాయి.

# సమ సమాజానికి దిక్సూచి కార్ల్ మార్క్స్




- డివివియస్ వర్మ

**1883 మార్చి 14న కార్ల్ మార్క్స్ మరణించారు. మార్చి 17న లండన్‌లోని హైగేట్‌లో మార్క్స్ సమాధి దగ్గర ఆయన జీవన సహచరుడు ఏంగెల్స్ ప్రసంగిస్తూ "డార్విన్ ఏ విధంగా జీవ ప్రకృతి అభివృద్ధి నియమాన్ని కనుగొన్నారో సరిగ్గా అదే విధంగా మార్క్స్ మానవ చరిత్ర అభివృద్ధి నియమాన్ని కనుగొన్నారు. మార్క్స్ పేరు యుగయుగాల వరకు సజీవంగా.. ఆయన కృషి చిరస్థాయిగా వుంటుంది" అని చెప్పిన మాటలు అక్షర సత్యాలు.**

మార్క్స్ 141వ వర్ధంతికి ఒక వ్యాసం రాయాలని కార్ల్ మార్క్స్ పేరును బింగ్ సెర్చ్‌లో చూస్తే ఒక కోటి 55 లక్షల ఫలితాలు వచ్చాయి. ఇతర ప్రముఖులకు అందనంత ఎత్తులో మార్క్స్ ఉన్నాడు. 141 సంవత్సరాల తర్వాత కూడా ప్రపంచం అంతా చర్చిస్తున్న అత్యంత ప్రభావశీల వ్యక్తిగా కొనసాగుతున్నాడు. ఈ వెతుకులాటలో మరో పుస్తకం కనిపించింది. "మార్క్స్ ఇండియాకు వచ్చారు" (Marx comes to India) అన్న పేరు ఆకర్షించింది. ఈ పుస్తకాన్ని 1975లో మనోహర్ బుక్ సర్వీసెస్ వారు ప్రచురించారు. ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు పీసీ జోషి, కె.దామోదరన్ సంయుక్తంగా సుదీర్ఘమైన ముందుమాట రాశారు. ఈ ముందుమాటలో రెండు ఆసక్తికరమైన విషయాలు ఉన్నాయి.

**మొదటిది :** మార్క్స్ జీవించి వున్న కాలంలోనే ఆయనతో కలకత్తాకు చెందిన తొలి సోషలిస్టు భావజాలికులు నెలకొల్పుతున్న సంబంధాల ప్రస్తావన ఆశ్చర్యపరిచింది. మార్క్స్ సారథ్యంలో 1866లో ప్రారంభమైన ఇంటర్‌నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్‌లో భారతదేశపు విభాగాన్ని ఏర్పాటు చేయడానికి అనుమతించమని కోరుతూ ఈ కలకత్తా మిత్రులలో ఒకరు లేఖ పంపించారు. 1871 ఆగస్టు 15న జరిగిన ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిల్‌లో ఆ లేఖను చర్చించినట్లు మినిట్స్‌లో పేర్కొన్నారు. ఈ విభాగం ఏర్పాటుకు అనుమతిస్తూ, స్వయం పోషకంగా వుండాలని, స్థానికులను సభ్యులుగా చేసుకోవాలని సలహా ఇచ్చినట్లు మినిట్స్‌లో వున్న దానిని ముందుమాటలో ఉటంకించారు. అంతేకాదు 1871 ఆగస్టు



19న 'ది ఈస్టర్న్ పోస్టు నెంబరు 151'లో ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిల్ సమావేశంపై ప్రచురించిన వార్తలో కలకత్తా నుంచి అందిన ఉత్తరంలోని కొన్ని భాగాలను ఉటంకిస్తూ వచ్చిన వార్తను యథాతథంగా మన ముందుంచారు. అధికారయుతంగా ఇంత సమాచారం దొరికినప్పటికీ కలకత్తా బృందం పేర్లు మాత్రం రికార్డులలో కనిపించలేదని ముందుమాటలో రాశారు.

**రెండో అంశం :** సోవియట్ విప్లవం తర్వాత మార్క్స్, ఎంగెల్స్, లెనిన్ రచనలు చాలా వచ్చాయి. కాని, రష్యన్ విప్లవానికి ముందే 1912లో ఉత్తర భారతదేశానికి చెందిన హరదయాళ్, కేరళకు చెందిన రామకృష్ణ పిళ్ళైలు మార్క్స్ జీవిత చరిత్రలు రాశారు. ఆ రెండు పుస్తకాలను ఇందులో ప్రచురించారు. మార్క్స్ జీవించి వున్న కాలంలో, రష్యన్ విప్లవం జరగడానికి ముందుగానే ఇలా మార్క్స్ భారతదేశానికి వచ్చిన అపురూపమైన విషయాలను ఈ పుస్తకం వెల్లడిస్తుంది. రష్యన్ విప్లవ ప్రభావం మన దేశంలో జరుగుతున్న జాతీయోద్యమం మీద గొప్ప ప్రభావాన్ని చూపించింది.

మార్క్స్ భావజాలం, రష్యన్ విప్లవ ప్రభావంతో జాతీయోద్యమంలో భాగంగా 1920లో కార్మిక వర్గాన్ని సంఘటితపరిచే అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఏర్పడింది. 1923లోనే తొలి మేడేను మద్రాసులో సింగారవేలు నిర్వహించి, ఎర్ర జెండాను మొదటిసారి ఎగురవేశారు. వివిధ

ప్రాంతాల్లో వున్న కమ్యూనిస్టులు 1925లో కమ్యూనిస్టు పార్టీగా సంఘటితం అయ్యారు. కార్మిక సంఘాలతోపాటు వివిధ ప్రజా సంఘాలను నిర్మించి జాతీయోద్యమంలో ప్రజల భాగస్వామ్యాన్ని విస్తరింపజేశారు. గాంధీజీ స్వాతంత్ర్యోద్యమానికి సారధిగా గుర్తింపు పొందినా ఈ ప్రజా సంఘాల ఉద్యమాల ఒత్తిడితోనే గాంధీజీ సహాయ నిరాకరణ నుంచి పూర్ణ స్వరాజ్యానికి, ఉప్పు సత్యాగ్రహం పేరుతో శాసనోల్లంఘనకీ అంతిమంగా "సాధించడం లేదా మరణించడం" నినాదంతో క్విట్ ఇండియా ఉద్యమానికి పూనుకున్నారు. ఈ ప్రజా ఉద్యమాల వెనుక మార్క్స్ భావజాలం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

అలాగే మార్క్స్ భారతదేశం మీద న్యూయార్క్ టైమ్స్‌కి అపురూపమైన వ్యాసాలు రాశారు. 1857 తిరుగుబాటును తొలి భారత స్వాతంత్ర్య సంగ్రామంగా పేర్కొన్నారు. భారతదేశాన్ని బ్రిటిష్ పాలకులు దోచుకున్న సంపదను అణాపైసలతో లెక్కలు గట్టి ప్రకటించారు. స్వదేశీ ఉత్పత్తులను, చేతి వృత్తులను ఎలా నాశనం చేసింది బైట పెట్టారు. భారతీయ గ్రామీణ వ్యవస్థ ప్రత్యేకతలను, కుల వ్యవస్థ పాత్రను విశ్లేషించే వ్యాసాలు రాశారు. అవి నేటికీ అపురూపమైన రచనలుగానే ఉన్నాయి.

స్వాతంత్ర్యానంతరం తొలి ఎన్నికల్లో కమ్యూనిస్టులు ప్రధాన ప్రతిపక్షంగా ఎదిగిన క్రమంలో మార్క్స్ భావజాలం దేశ ప్రజలలో పొందిన విశేష ఆదరణకి తార్కాణంగా నిలుస్తుంది. తెలుగు రాష్ట్రాలలో మార్క్స్ భావజాలం రాజకీయ రంగాన్నే కాదు సాహిత్య, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో విప్లవాత్మక పరిణామాలను తెచ్చింది. 1990 దశకంలో మార్క్స్‌కు గ్రహణం పట్టినట్లు అనిపించింది. సోవియట్ యూనియన్, సోషలిస్టు దేశాలు కనుమరుగు కావడంతో పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు మార్క్స్ భావజాలానికి కాలం చెల్లిందని ప్రకటించారు. పెట్టుబడిదారీ వ్యవస్థ చిరస్థాయిగా వుంటుందని ప్రచారం చేశారు. ఈ ప్రచారం మూణ్ణాల ముచ్చటే అయింది.

2008 నుండి పెట్టుబడిదారీ దేశాలు ఒక దాని తర్వాత మరొకటి చివరికి అన్నీ సంక్షోభంలో కూరుకుపోయాయి. ఉద్దీపనల చిట్కాలు వాటిని గట్టెక్కించలేకపోతున్నాయి. దీంతో పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు బుర్రలు గోక్కుంటున్నారు. పెట్టుబడి చలన సూత్రాల కోసం మార్క్స్ రచనలే శరణ్యం అంటున్నారు. ఇప్పుడు ప్రపంచవ్యాపితంగా మార్క్స్ రచనల అధ్యయనం విస్తారంగా పెరిగింది. పెట్టుబడిదారీ వ్యవస్థలో సంపద కేంద్రీకరణ అనివార్యం అని అదే స్థాయిలో పేదరికం, దారిద్ర్యం మరొకచోట పేరుకుపోతుందని మార్క్స్ చేసిన విశ్లేషణ నేటి అంతరాల ప్రపంచం తిరుగులేని వాస్తవంగా నిరూపిస్తున్నది. ఈ నేపథ్యంలో 10 సంవత్సరాలు పైబడిన మోదీ పాలనను పరిశీలన చేసుకోవాలి.

మోదీ పాలనలో ప్రపంచంలోనే అత్యధికంగా అంతరాలు పెరిగిన దేశంగా మారింది. 2013 నాటికి 50 మంది బిలియనీర్లు అంటే 100 కోట్లకు పైబడిన డాలర్ల సంపద గల వారు లేదా 8000 కోట్లకు రూపాయలకు పైబడిన సంపద గల వారు వుంటే 2024 నాటికి 169 మంది బిలియనీర్లు పుట్టుకొచ్చారు. ప్రపంచ బిలియనీర్లలో అమెరికా, చైనా తర్వాత మూడో స్థానానికి దూసుకుపోయింది. ఈ 169 మంది బిలియనీర్ల దగ్గరే 78 లక్షల కోట్ల సంపద పోగుపడింది. ఆక్స్ ఫామ్ నివేదికల ప్రకారం దేశంలో ఒక శాతం దగ్గర 46 శాతం దేశ సంపద పోగుపడగా పది శాతంగా వున్న బిలియనీర్లు, కార్పొరేట్లు, కుబేరుల దగ్గర మొత్తం దేశ సంపదలో 77 శాతం గుట్టపడింది. ఒక దశాబ్ద కాలంలోనే విపరీతంగా దేశంలో సంపద కేంద్రీకరణ జరిగింది. స్థూలంగా 10 ఏళ్ల మోదీ పాలన ప్రధానంగా కార్పొరేట్ల కోసం సాగిన పాలన. దాని పర్యవసానంగానే దేశ సంపద వారి పంచకు చేరింది. ఈ పదేళ్లలో 35 శాతంగా వున్న కార్పొరేట్ పన్నును అంచెలంచెలుగా 22 శాతానికి తగ్గించారు. వారికే దాదాపు 20 లక్షల కోట్ల అప్పులను రద్దు చేశారు. గతంలో 10 శాతం వున్న వారసత్వ పన్నును పూర్తిగా తొలగించారు. ఇది మోదీ పాలన సంగ్రహ చిత్రం. దేశ సంపదను కార్పొరేట్లు స్వంతం చేసుకుంటూ పోతున్నారు. మరో పక్క రైతులు, సామాన్యులు, పేదలు కార్పొరేట్ల అనుకూల పాలనలో నలిగిపోతున్నారు. 10 శాతంగా వున్న కార్పొరేట్ల దోపిడీకి-75 శాతం నలిగిపోతున్న దేశ ప్రజలకీ మధ్య నెలకొన్న వైరుధ్యమే ప్రస్తుత ప్రధాన వైరుధ్యంగా గుర్తించాలి. మార్క్స్ ఏనాడో చెప్పిన సంపద కేంద్రీకరణ దాని పర్యవసానాలు ఇప్పుడు మోదీ పాలనలో ప్రత్యక్షంగా చూస్తున్నాం. కార్పొరేట్ల దోపిడీని కట్టడి చెయ్యడానికి, శ్రమజీవుల సంక్షేమ విస్తరణకి పోగుపడ్డ సంపద పునఃపంపిణీ తక్షణ అవసరం అయ్యింది. ఈ దిశగా అన్ని వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు ప్రజలను సమీకరించే ఉద్యమాలకు సన్నద్ధం కావాలి. మోదీ పాలనాపరంగా బలహీనుడే. ప్రజల మీద భారాలు మోదే సాధారణ రాజకీయ నాయకుడే, కార్పొరేట్ దోపిడీకి ద్వారాలు తెరిచేవాడే. ఆయన ప్రజాకర్షణ ఆయన అనుసరిస్తున్న రాజకీయ విధానాలలో లేదు. విభజన రాజకీయంలో విద్వేష భావజాలంలో వుంది. దానిని తన ఆకర్షణగా మార్చుకునే పరిభాషలో వుంది. అందువల్ల మోదీ రాజకీయం మీద చేసే పోరాటం కేవలం ఆర్థిక అంశాల మీద చేస్తే సరిపోదు. మోదీ రాజకీయం మీద పోరు ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాలన్నింటా జరగాలి. ఇందులో సాంస్కృతిక రంగంలో జరిగే పోరాటం కీలకం అవుతుంది. అలాంటి బహుముఖ పోరాటాలకు, ప్రజా ఉద్యమాలకు మార్క్స్ భావజాలమే మనకు దారి చూపిస్తుంది. సమ సమాజ సాధనకు ఆయనే దిక్సూచి. ❑

# పౌరసమాజం-ఆధిపత్యం-గ్రాంస్కీ



- ప్రొ కె.శ్రీనివాసులు



**పౌరసమాజం, ఆధిపత్యం అనే భావనలు గ్రాంస్కీ సైద్ధాంతిక నిర్మాణానికి సంబంధించి కేంద్ర బిందువుల వంటివి. గ్రాంస్కీ సిద్ధాంతంలో 'పాండిత్యం' సంపాదించుకుంటున్న వారు ప్రపంచమంతటా శరవేగంతో పెరుగుతున్నారు. గ్రాంస్కీ భావాలకు సిసలైన ప్రతినిధులమని చెప్పుకునే 'వృత్తి నిపుణులు' విస్తరిస్తున్నారు. ఈ నేపథ్యంలో అలాంటి భావనల గురించిన గ్రాంస్కీ విశ్లేషణను చర్చించే ముందు కొన్ని ముఖ్యమైన విషయాలను మనసులో పెట్టుకోవాలి.**

రెండు ప్రపంచయుద్ధాల మధ్య కాలంలో, ఇటాలియన్ కమ్యూనిస్ట్ ఉద్యమంలో ముఖ్యుడిగా ఉన్నవాడు ఆంతోనియో గ్రాంస్కీ. ముఖ్యంగా ట్యూరిన్ ఫ్యాక్టరీ కౌన్సిల్ ఉద్యమంలో కీలక పాత్ర పోషించాడు. సోషలిస్టు విప్లవ పోరాటానికి, భవిష్యత్తులో ఏర్పడ బోయే కార్మిక రాజ్యానికి ఈ కౌన్సిళ్లే కేంద్రక స్థానాలని సిద్ధాంతీకరించిన వాడాయన. కానీ గ్రాంస్కీ ఊహించిన దానికి విరుద్ధంగా, ఇటలీలో విప్లవ విజయావకాశాలు క్రమంగా సన్నగిల్లుతూ వచ్చాయి. అక్కడి కమ్యూనిస్టు ఉద్యమంలో సంక్షోభం తీవ్రతరం అవుతూవచ్చింది. ఫాసిజం నానాటికీ బలం పుంజుకుంటూ వచ్చింది. ఈ చారిత్రక సందర్భమే, ఇప్పుడు మనకు తెలిసిన గ్రాంస్కీ సైద్ధాంతిక భావనలను తీర్చిదిద్దుతూ వచ్చింది.

## గ్రాంస్కీ చింతనకు కేంద్ర బిందువులు

గ్రాంస్కీ మేధో పరిశీలనకు, చింతనకూ కేంద్ర బిందువుల వంటి ప్రశ్నలు రెండున్నాయి.

- 1. పెట్టుబడిదారీ విధానంలో సంక్షోభం కొట్టొచ్చినట్లు కనిపిస్తూనే వుంది ! శ్రమశక్తులకూ, పెట్టుబడికీ మధ్య వైరుధ్యం పరాకాష్ఠకు చేరుకోవడం ఇందుకు ఒక కారణం. ఉత్పత్తి ప్రక్రియ – వాటి నియంత్రణ, పాలన వంటి అంశాలు నానాటికీ సామాజిక స్వభావాన్ని సంతరించుకుంటూ రావడం మరో కారణం. ట్యూరిన్ నగరం కేంద్రంగా రూపు దిద్దుకున్న ఫ్యాక్టరీ కౌన్సిళ్ళ ఉద్యమంలోనూ, హంగరీలోని కార్మిక సంఘాల ఉద్యమంలోనూ ఈ లక్షణాలు ప్రముఖంగా వ్యక్తమయ్యాయి. అయినప్పటికీ, పెట్టుబడిదారీ వ్యవస్థ కుప్పకూలిపోలేదు. సరికొత్త, పునర్వ్యవస్థీకృత రూపాల ద్వారా దైనందిన సంక్షోభాలను తట్టుకుని ఎలా నిలబడగలుగుతోంది ?
- 2. సోషలిస్టు విప్లవ లక్ష్యం దిశగా విజయవంతంగా దూసుకుపోయే నిమిత్తం ఏం చేయాలి ? అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ విధానానికి సరిగ్గా సరిపోయే విప్లవాత్మక వ్యూహం ఏది ? పెట్టుబడిదారీ పెత్తనానికి ఎదురొడ్డి నిలబడి దానిని దారిలోకి తెచ్చుకోవాలంటే ఏం చేయాలనే విస్తృత సమస్య గురించి ఆలోచించే దిశగా ఈ రెండు ప్రశ్నలూ గ్రాంస్కీని నడిపించాయి. ఆర్థిక ఆధిపత్యం – ప్రభుత్వ నియంత్రణల పునాదిగానే పెట్టుబడిదారీ పెత్తనం నిలబడి వుందా ? లేక, దాన్ని నిలబెడుతున్న విషయాల్లో వేరే అంశాలేమైనా వున్నాయా ? అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ వ్యవస్థల్లో అనుసరించదగిన విప్లవాత్మక వ్యూహం ఏది ? ఈ రెండు ప్రశ్నలకూ సమాధానాలు సాధించే క్రమంలో తలెత్తిన ఆలోచనలే గ్రాంస్కీ సైద్ధాంతిక భావనలకు మూలాలు. అవే, ఆయన రాజకీయ కార్యాచరణకూ ప్రాతిపదికలను సైతం రూపొందించాయి.

## గ్రాంస్కీ సైద్ధాంతిక నిర్మాణం - పునాది రాళ్ళు

పౌరసమాజం, ఆధిపత్యం అనే భావనలు గ్రాంస్కీ సైద్ధాంతిక నిర్మాణానికి సంబంధించి పునాదిరాళ్లలాంటివి. గ్రాంస్కీ సిద్ధాంతంలో 'పాండిత్యం' సంపాదించుకుంటున్న వారు ప్రపంచమంతటా శరవేగంతో పెరుగుతున్నారు. గ్రాంస్కీ భావాలకు తామే సిసలైన ప్రతినిధులమని చెప్పుకునే 'వృత్తి నిపుణులు' విస్తరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ భావనల గురించిన గ్రాంస్కీ విశ్లేషణను చర్చించే ముందు కొన్ని ముఖ్యమైన విషయాలను మనసులో పెట్టుకోవాలి. గ్రాంస్కీని 'ఉపరితల అంశాలకు పరిమితమైన సిద్ధాంతవేత్త'గా చిత్రించేందుకూ, ఆయన సైద్ధాంతిక

విశ్లేషణలలో నుంచి రాజకీయ అర్థశాస్త్ర భావనలను వడగట్టేం దుకూ, ఒక ప్రయత్నం జరుగుతోంది. మార్క్సిస్టు విశ్లేషణకు ఈ రాజకీయ అర్థశాస్త్ర విమర్శే మూలమని ఈ సందర్భంగా మనసులో పెట్టుకోవాలి. పెట్టుబడిదారుల ఆధిపత్యం పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థతోనూ, రాజ్యంతోనూ సవర్గ(ఆర్గానిక్) బాంధవ్యాన్ని కలిగి వుంటుందని గ్రాంస్కీ చెప్పారనే విషయం ఇక్కడ విస్మరించరానిది. మార్క్సిస్టు సిద్ధాంతంలోకి కొత్తగా వచ్చి చేరిన విషయాల్లో, పౌరసమాజం, ఆధిపత్యం, ఆధిపత్య సోపానంలో కొన్ని ప్రజా సమూహాలను పైకి రానివ్వకుండా అణచిపెట్టే ధోరణి–సబా ల్టర్నిటీ–వంటి భావనలు గ్రాంస్కీ మేధస్సులో రూపుదిద్దుకున్నవే. 1970 దశకంలో ఇంగ్లిష్ మాట్లాడే దేశాల్లో ఈ భావాలకు చెలా మణీ పెరిగింది. మేధావి వర్గాల్లో గ్రాంస్కీకి ఆదరణా పెరిగింది. క్రమంగా ఈ భావాలు స్వతంత్ర రూపాలు తీర్చిదిద్దుకున్నాయి. వాటికి మొదట్లో ఉండే అర్థాలు క్రమంగా మారుతూ వచ్చాయి. గ్రాంస్కీ భావనలూ ఆలోచనలను సొంతం చేసుకునే దురాచారమూ విస్తరించింది. ప్రపంచబ్యాంకు మొదలుకుని ఉదారవాద అధ్యయన బృందాల వరకూ చాలామంది ఈ కార్యకలాపాలకు చేయూతను అందిస్తూ పోయాయి. మౌలికంగా వినూత్నమైన భావనలకు సరికొత్త అర్థాలిచ్చి, భిన్న రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకోవడమూ ఎక్కువయింది.

## గ్రాంస్కీ ఏం చెప్పాడు ? 'మేధావులు' ఏమంటున్నారు ?

పెట్టుబడిదారీ ఆధిపత్యాన్నీ, దానికి బూర్జువా ఆర్థికవ్యవస్థతో ఏర్పడి వుండే సహజ–సవర్గ సంబంధాన్నీ అర్థం చేసుకునేందుకు గ్రాంస్కీ పౌరసమాజం అనే భావనను రూపొందించారు. కానీ, దాన్ని, రాజ్యానికి విరుద్ధ ధృవంగా ప్రదర్శించడం ఎక్కువవుతూ వచ్చింది. స్వేచ్ఛకు అవకాశమిచ్చే వ్యవస్థగా పౌరసమాజాన్ని చిత్రించడం ఎక్కువైంది. గ్రాంస్కీ భావాలను విమర్శించుకోవడానికి, మేధోరంగంలో మన ముందుకు వచ్చిన సందర్భాలు రెండు.

- **ఒకటి :** మార్క్సిస్టు సైద్ధాంతిక సంప్రదాయంలో భాగంగా గ్రాంస్కీని తిరిగి గుర్తించడం. ఆయన ఆలోచనకు సంబంధించినంత వరకూ, సిద్ధాంతం–ఆచరణ అనే గతితార్కిక సంబంధాన్ని నొక్కిచెప్పడం.
- **రెండు :** గ్రాంస్కీ భావనలనూ సిద్ధాంతాన్నీ పునరుద్ధరించి, వాటి విప్లవ ప్రాధాన్యాన్ని పునఃస్థాపించడం. అలా చెయ్యడమనేది రాజకీయంగా ఎంతో ప్రాధాన్యాన్ని కలిగివుంది. అదేమిటో చూద్దాం :
- 1.నేటి పెట్టుబడిదారీ విధానం–భవిష్యత్తులో ఏమి జరుగుతుందో చెప్పలేని–అంచనా కట్టలేని స్వభావాన్ని సంతరించుకుంటోంది. ఒకవైపు, ఈ అవ్యవస్థ నానాటికీ పెరుగుతూ పోతోంది. మరోవైపు, ప్రపంచ ప్రజానీకంలో విస్తృత సమూహాల ఆర్థిక అభివృద్ధి నానాటికీ కుంచించుకుపోతోంది. పరాయీకరణ విస్తరిస్తోంది.
- 2.ఈ వాస్తవ పరిస్థితితో నిమిత్తం లేకుండా, ప్రపంచ పెట్టుబడి తాలూకు మేధో ఆధిపత్యం నయా–ఉదారవాద అవతారమెత్తి, ప్రజల్లోనూ, మేధావుల్లోనూ ప్రాబల్యం పెంచుకుంటోంది. పెట్టుబడిదారీ ఆధిపత్య వ్యతిరేక వర్గాల కృషిలో సమన్వయ రాహిత్యం, లేదా ప్రతిష్ఠంభన నెలకొని వుంది. ఈ పరిస్థితి తొలగించడంపై తక్షణమే ఆలోచనసాగాలి.
- 3.అది అటు వుంచితే, ప్రపంచ పెట్టుబడి ఒక్కటై చేతులు కలుపుతూ వున్న దశలో, అస్తిత్వ ఉద్యమాలు–భారతదేశం విషయానికి వస్తే కులమతాలూ, లైంగిక అస్తిత్వాలూ తదితర సమూహాల ప్రాతిపదికగా జరిగే ఉద్యమాలు – వర్గ సిద్ధాంతం – రాజకీయాలకు కొత్త ప్రశ్నలను వేస్తున్నాయి. ఆయా సమూహాల అస్తిత్వాలకు సంబంధించిన ఉద్యమాల ప్రాధాన్యం కాదనలేనిది – కానీ అది వేరే విషయం. పెట్టుబడిదారీ విధానానికి ప్రత్యామ్నాయాన్ని నిర్మించడంలోనూ, ఆధిపత్యవాదానికి విరుద్ధమైన వ్యవస్థను నిర్మించడంలోనూ గ్రాంస్కీ భావనలు పటిష్ఠమైన మేధోమూలాలుగా వినియోగపడతాయి. అంతర్జాతీయంగా సామ్రాజ్యవాద ప్రపంచీకరణ క్రమమూ, నయా ఉదారవాద భావజాలమూ విజయం సాధించకుండా నిరోధించడంలో గ్రాంస్కీ భావనలు ఉపయోగపడతాయి. ఈ దిశగా ఆయన పౌరసమాజం గురించీ, ఆధిపత్యం గురించీ రూపొందించిన భావనలూ ప్రత్యేక ప్రాధాన్యాన్ని కలిగివున్నాయి.

## పౌరసమాజం గురించి ఎవరెవరు ఏమన్నారు?

పౌరసమాజం గురించి చెప్పిన తత్వవేత్తలలో గ్రాంస్కీ మొదటివాడు కాదు. ఆయనకన్నా ముందు మార్క్స్, హెగెల్ కూడా పౌర సమాజం గురించి చెప్పి వున్నారు. హెగెల్ పేర్కొన్న 'త్రయం'లో కుటుంబాన్నీ, రాజ్యాన్నీ అనుసంధానం చేసే వ్యవస్థగా పౌరసమాజం ఉంటుంది. కుటుంబం అనేది నిస్వార్థ బుద్ధితో రూపుదిద్దుకునే 'సహజ, తక్షణ నైతిక వ్యవస్థగా' భావించాడు హెగెల్. పౌరసమాజం అనేది అనేక కుటుంబాలతో కూడిన వ్యవస్థ కావడం చేత 'విశ్వజనీనమైన అహం'గా రుపుదిద్దుకుంటుందన్నాడాయన. విశ్వ జనీన స్వేచ్ఛ పునాదిగా నిస్వార్థ బుద్ధితో కూడిన ఉన్నతస్థాయి వ్యవస్థ ఏర్పడినప్పుడే, విశ్వజనీన నైతిక జీవన వ్యవస్థ నిర్మాణం సాధ్యమని హెగెల్ చెప్పాడు. హెగెల్ చెప్పిన పౌర సమాజానికి విస్తృతార్థం ఉంది. అందులో ఆర్థిక వర్గసంబంధాలూ – నియంత్రిత ఆర్థిక ప్రయోజనాలతో పాటు, న్యాయవ్యవస్థ–చట్టాన్ని అమలు చేసే యంత్రాంగం వుంటాయి. వేరే మాటల్లో చెబితే హెగెల్ చెప్పిన పౌరసమా

జంలో నిర్దిష్ట పౌరప్రయోజనాలూ-అవసరాలతో పాటు వాటిని నియంత్రించే చట్టపాలన వ్యవస్థలు వుంటాయి.

మార్క్స్ చెప్పిన పౌరసమాజం నిర్దిష్ట నిర్మాణ స్వభావం కూడా కలిగివుంది. పౌరసమాజాన్ని 'వ్యక్తుల సమస్త భౌతిక కార్య కలాపాల సమ్మేగ్రూపం'గా నిర్వచించాడు మార్క్స్. ఈ పౌర సమాజాన్ని కేవలం 'రాజకీయ అర్థశాస్త్ర ప్రమాణాల ప్రాతిపదిక గానే' విశ్లేషించగలం. పునాది-ఉపరితలం అనే తత్వ శాస్త్ర అభివర్గం మేరకు విశ్లేషిస్తే, హెగెల్ చెప్పిన పౌర సమాజానికి అటు పునాది లక్షణాలూ, ఇటు ఉపరితల లక్షణాలూ రెండూ ఉన్నాయి. మార్క్స్ చెప్పిన పౌరసమాజాన్ని అలా అనలేం! పౌరసమాజం అనే మాటకున్న అర్థసంబంధమైన భావాన్నే మార్చిపారేశాడు మార్క్స్!! రాజ్యంతో పౌరసమాజ సంబంధాన్ని సరికొత్త కోణంలో చూశాడు మార్క్స్. "వాణిజ్య, పారిశ్రామిక జీవన" సంక్లిష్ట సంబంధాల మొత్తంగా పౌరసమాజాన్ని చూశాడు మార్క్స్. ఇవి పరస్పర ఒడంబడిక -కాంట్రాక్ట్- ప్రాతిపదికగా ఏర్పడతాయంటాడు మార్క్స్. పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలకు ప్రతిబింబంగా రూపొందే పునరుత్పత్తి సంబంధాల ప్రాతిపదికపైనే ఈ ఒడంబడిక కుదురుతుందంటా డాయన. ఇది సవ్యమైనదేనని సమర్థించుకోవ డానికి ఉన్నత స్థాయి సంస్థలతో కూడిన యంత్రాంగం అవసరం అవుతుం దంటాడాయన. హెగెల్ మాదిరి, రాజ్యాన్ని "పౌరసమాజ అహం" తాలూకు వ్యక్తీకరణగా భావించలేదు మార్క్స్. పౌరస మాజం యొక్క అంతర్గత వైరుధ్యానికీ-నైతిక భ్రష్టత్వానికీ ప్రతిఫలనంగా రాజ్యాన్ని పరిగణించాడాయన. అంచేత, రాజ్యం పరోపకారబుద్ధి కలిగిన నిస్వార్థ వ్యవస్థ కాజాలదు - పాలక వర్గాల ప్రయోజనాలను కాపాడేందుకు వారి చేతుల్లో ఆయుధంగా ఉపయోగపడే సాధనమే రాజ్యమని మార్క్స్ స్పష్టం చేశాడు. అంతకుమించి, రాజ్యం శాశ్వత, సార్వ జనీన వ్యవస్థ కాదు - అది, పరిమిత చారిత్రక స్వభావం కలిగిన వ్యవస్థ, లేదా సంబంధం మాత్రమేనని మార్క్స్ భావించాడు.

## గ్రాంస్కీ మౌలికత

సాంప్రదాయిక మార్క్సిస్టు నిర్మాణంలో భాగంగా ఉన్న పౌర సమాజాన్ని, ఉపరితల నిర్మాణంలోకి మార్చడంలో గ్రాంస్కీ మౌలికత ఉంది. అలా చెయ్యడంతో ఉపరితలం, వినూత్న ప్రాధాన్యం సంతరించుకుంది. గ్రాంస్కీకి ముందు ఉపరితలానికి పెద్ద ప్రాధాన్యం ఉండేది కాదు. ఉపరితలంలో రెండు వర్గాల్ని గుర్తించాడు గ్రాంస్కీ. ఒకటి రాజకీయ సమాజమైతే, మరొకటి పౌర సమాజం. మొదటి వర్గంలో రాజ్యానికి సంబంధించిన సాధనాలు ఉంటాయనీ, రెండో వర్గమైన పౌరసమాజంలో రాజ్యేతర, ఆర్థికేతర సాధనాలు ఉంటాయనీ చెప్పాడు గ్రాంస్కీ. దాంతో, భావజాల-సాంస్కృతిక సంబంధాల్లో పౌరసమాజం సరికొత్త అర్థాన్నీ, ప్రాధాన్యాన్నీ సంతరించుకోగలిగింది. "సమస్త ఆధ్యాత్మిక, మేధోసంబంధమైన జీవనం" పౌర సమాజంలో భాగంగా గుర్తింపు పొందింది. నేరుగా ఆధిపత్యం-పెత్తనం- చెలాయించే యంత్రాంగంగా రాజ్యం గుర్తింపు పొందగా, మొత్తం సమాజంపై మేధోపరమైన, సాంస్కృతిక ఆధిపత్యం చెలాయించే యంత్రాంగంగా పౌరసమాజం గుర్తింపు పొందింది. అలా, పౌరసమాజాన్ని సరికొత్త భావనగా తీర్చిదిద్దినవాడు గ్రాంస్కీ. వ్యూహాత్మకంగా పౌరసమాజ భావనను ఏ విధంగా ప్రయోగిస్తారనే విషయాన్ని ఆవిష్కరించిన వాడు కూడా గ్రాంస్కీయే!

## భావ జాలానికీ - సంస్కృతికీ తేడా

పాలితవర్గాలపై, పెట్టుబడిదారులు మేధోపరమైన, ఆధ్యాత్మిక పెత్తనం కట్టుదిట్టంగా చెలాయించడానికి తోడ్పడే వ్యవస్థలూ, సంబంధాలూ పౌరసమాజంలోనే భాగమై ఉంటాయి. పాలక వర్గ భావజాలానికి పైచేయి సంపాదించిపెట్టే కులీన సంస్కృతి, నీతి కూడా ఈ పౌర సమాజంలోనే భాగమై ఉంటాయి. ఇక్కడ గ్రాంస్కీ భావజాలానికీ - సంస్కృతికీ మధ్య తేడాను గుర్తించి, చెప్పడం కనిపిస్తుంది. భావజాల భావనకు కచ్చితమైన వర్గస్వభావం ఉంటుంది. సాంస్కృతిక భావనలు మాత్రం నిర్దిష్ట వర్గసమూహాలకు అతీతంగా ఆదరణకు పాత్రమవుతుంటాయి. పౌరసమాజంతో ఉన్న అదనపు సౌకర్యం ఏమిటంటే, ఆధిపత్య సామాజిక వర్గాలు ఇక్కడ తమ భావాలకు సాంస్కృతిక ఆమోదం సంపాదించుకోగలుగుతాయి. అలా సామాజిక ఆమోదాన్ని సాధించగలిగిన యంత్రాంగాలూ సంస్థల వేదిక, పౌరసమాజ భావనను సైతం అందుకు తగిన రీతిలో మలచుకోవచ్చు.

వ్యూహాత్మక ప్రాధాన్యం విషయానికి వస్తే - పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా, విప్లవశక్తులు సాగించే రాజకీయ, సాంస్కృతిక పోరాటాలను నిలువరించే రక్షణ రేఖగానూ పౌరసమాజ భావన ఉపయోగపడుతుంది. అగడ్తల్లో సైనికులు దాగివుండి శత్రు శిబిరాలపై దాడిలాగ పౌరసమాజాన్ని అటువంటి అగడ్తలతో-ట్రెంచెస్ తో-పోల్చాడు గ్రాంస్కీ! పెట్టుబడిదారీ విధానాన్ని కాపాడే క్రమంలో భావజాల- సాంస్కృతిక రక్షణరేఖలూ, అగడ్తల వల్ల ప్రయోజనం లేని దశలో ఆ లక్ష్యం సాధించేందుకు బలప్రయోగం చెయ్యడానికి ఉద్దేశించిన రాజ్య వ్యవస్థలు రంగంలోకి దిగుతాయి.

## ఆధిపత్య ప్రాముఖ్యం - సరికొత్త సందర్భం

గ్రాంస్కీ చింతనలో భావనపరంగానూ, వ్యూహాత్మకంగానూ ఆధిపత్యానికి ఉన్న ప్రాధాన్యాన్ని ఈ సందర్భంలో మనసులో పెట్టుకోవాలి. లెనిన్ ఈ భావనను "రాజకీయ నాయకత్వం" అనే అర్థంలో వాడినమాట నిజమే. కానీ, అదే భావనను, మరింత విస్తృత "రాజకీయ, సాంస్కృతిక, నైతిక నాయకత్వం" అనే భావార్థంలో ప్రయోగించాడు. ఆర్థిక ఆధిపత్యంతోనూ,

బలవంతపు నిర్బంధంతోను పెట్టుబడిదారీ పాలనను సమానం చేసి చూసే ఎకనామిస్టిక్ ధోరణుల నుంచి బయటపడేందుకు ఈ అవగాహన ఉపకరిస్తుంది. పెట్టుబడిదారీ దేశాల్లోని పౌరసమాజాలు అపారమైన-బహుముఖమైన అభివృద్ధిని సాధిన్యానీ, పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలు ఆయా సమాజాల్లోని పాలకవర్గాల సాంస్కృతిక-భావజాల ఆధిపత్యంపైనే చాలా వరకూ ఆధారపడి అభివృద్ధి చెందాయనే వాస్తవాన్ని గ్రహించడానికి గ్రాంస్కీ మనకిచ్చిన అవగాహన దోహదపడుతుంది. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల్లోని రాజ్యవ్యవస్థపై అక్కడి పౌరసమాజాలకు ప్రాధాన్యత వుంటుంది! అనగా, బలప్రయోగానికి ఉద్దేశించిన వ్యవస్థపై, సామాజిక ఆధిపత్యానిదే పైచేయిగా ఉంటుందన్నమాట !!

ఈ సైద్ధాంతిక అవగాహన విప్లవ కార్యాచరణకు అందించే సందేశానికి అపారమైన ప్రాధాన్యం ఉంది. అధికార సాధనకు మంత్రసానిగా బలప్రయోగాన్ని చూసే సాంప్రదాయిక వైఖరికి భిన్నమైన ధోరణి విప్లవ వ్యూహంలో ప్రవేశించింది. ఇది ఎంతో ప్రాముఖ్యం కలిగిన వాస్తవం! భావజాలరంగం లోనూ, సాంస్కృతికరంగం లోనూ నాయకత్వాన్ని సాధించి, సామాన్య ప్రజల "ప్రాపంచిక జ్ఞానం"(గ్రాంస్కీ దీన్నే "కామన్ సెన్స్" అన్నాడు)లో పరివర్తన తీసుకురావాలన్నదే ఈ సరికొత్త ధోరణి. దీన్నే వేరే మాటల్లో చెప్పుకుంటే ఇలా వుంటుంది - ప్రత్యాధిపత్య (కౌంటర్ హెజిమనీ)స్థాపన విప్లవ వ్యూహంలో ప్రధాన భాగమై వుండాలి. పెట్టుబడిదారీ విధానంలోనే, ఈ ప్రత్యాధిపత్య స్థాపన ముందు జరగాలి. క్రమంగా, ఈ కృషి విప్లవ విజయానికి తెరతీయాలి. రాజ్యాధికారం చుట్టూ కేంద్రీకృతమై ఉండిన విప్లవ కార్యాచరణ దృష్టి, అలా పౌర సమాజంపైకి మళ్ళింది. సమాజం గురించిన భావనలూ - సంస్కృతి - నైతికత వంటి రంగాల్లో పోరాటం ఉద్ధృతమైంది. ఆధిపత్యం అనే సిద్ధాంతం పుణ్యమా అని, రాజ్యాధికారం కోసం పోరాటం పౌర సమాజమనే రణ రంగంలోకి మళ్లింది. పెట్టుబడిదారీ ఆధిపత్యంపై తిరుగుబాటు అనేదే, విప్లవ వ్యూహంలో ప్రధానభాగం అయింది. ప్రత్యాధిపత్య (కౌంటర్ హెజిమనీ) స్థాపన ద్వారానే ఈ పోరాటంలో విప్లవ శక్తులు విజయం సాధించగలవు. ప్రత్యామ్నాయ భావనలూ, విలువలను సృష్టించి పోషించడం ద్వారా మాత్రమే ఈ ప్రత్యాధిపత్య (కౌంటర్ హెజిమనీ) స్థాపన సాధ్యం. అది సాధించడానికి ప్రత్యామ్నాయ సంస్థలూ, వేదికల ద్వారా అత్యధికుల ప్రాపంచిక జ్ఞానాన్ని పరివర్తింపచేసి, భావజాల-సాంస్కృతిక రంగాల్లో నాయకత్వం సాధించవలసి వుంటుంది. ముఖ్యంగా, పౌరసమాజాలు బలీయమైనవిగా వున్న అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల్లో, ఆధిపత్య రంగంలో విజయం సాధించడం ద్వారా మాత్రమే రాజ్యాధికార సాధన సాధ్యమవుతుంది. **ఎకనామిస్టిక్ ధోరణి :** ఆర్థికేతర విషయాల్ని సైతం అర్థసాస్త్ర నియమ నిబంధనలకే పరిమితం చెయ్యడం ఈ ధోరణి లక్షణం.

### మనదేశంలో పాలకవర్గ ఆధిపత్యం!

పాలకవర్గ ఆధిపత్యం స్వరూప స్వభావం మనదేశంలో ఎలా వుందో క్లుప్తంగా ప్రస్తావించుకుందాం. మన దేశంలో పౌరసమాజం రూపుదిద్దుకోవడం సమస్యాత్మకంగా మారడానికి బలమైన నిర్దిష్ట చారిత్రక కారణాలు కొన్ని వున్నాయి. వాటిల్లో ముఖ్యమైంది కులవ్యవస్థ. కొందరు చెబుతున్నట్టు, ఈ కులవ్యవస్థ అనాదిగా ఇలాగే, ఏ మార్పు లేకుండా, వుండి పోలేదు! ఈ వ్యవస్థలో వచ్చిన మార్పులు అన్నీ ఇన్నీ కావు- అందుచేత ఇప్పుడు మనం చూస్తున్న కుల వ్యవస్థను ఆధునిక సామాజిక నిర్మాణంగా పరిగణించడం ఉత్తమం. కుల ప్రాతిపదికగా జరుగుతున్న అత్యాచారాలూ, అణచివేతలూ ఉన్న మాట ఎంత నిజమో, కులం మీద ఆధారపడి బలపడిన సందర్భాలూ ఉన్న మాట కూడా అంతే నిజం. కుల వ్యవస్థకున్న రెండు ముఖాల్లో ఒకటి కులపరమైన అణచివేతలైతే, మరొకటి కుల ప్రాతిపదికపైనే పట్టు సాధించడం. రాజ్యాంగపరమైన, చట్టపరమైన శాసన వ్యవస్థలు ఈ క్రమంలో కీలక పాత్ర పోషించాయనడంలో సందేహమే లేదు! భారతదేశంలో ఆధిపత్య పరివర్తన క్రమం గురించి ఆలోచించేటప్పుడు ముఖ్యంగా పట్టించుకోవలసిన విషయాలు కొన్ని వున్నాయి : ఇక్కడ ఉనికిలో ఉన్న జాతీయరాజ్యం స్వరూప స్వభావాలు ఏమిటి? దానికి సంబంధించిన రాజ్యాంగపరమైన-చట్టపరమైన చట్రం తాలూకు స్వరూప స్వభావాలు ఏమిటి? ఆధునిక "పాశ్చాత్యీకృత" శాస్త్ర సాంకేతిక రంగాలపై ఆధారపడి ఎంచుకున్న నమూనా అభివృద్ధి రూపురేఖలు ఏమిటి? మన రాజ్యాంగంలో ప్రకటించుకున్న సెక్యులరిజం-సోషలిజం లక్ష్యాలు, జాతీయ లక్ష్య సాధన క్రమాలుగా ఎంత మేరకు పనికివస్తాయి? ఇక్కడ అమల్లో ఉన్న కుల వ్యవస్థపై ఈ "అంశాలను" ఆపాదించడం, కొత్త చైతన్యక్రమాన్ని ఆవిష్కరించింది. అంతమాత్రం చేత, స్వాతంత్ర్యానంతర భారతీయ పౌర సమాజం-ఆధిపత్యం రూపుదిద్దుకోవడంలో సమస్యలేమీ ఎదురుకాలేదని భావించకూడదు. ఈ రూపకల్పన క్రమాలు విస్తరించడమనే ప్రయాణం అడుగడుగునా అనేక వైరుధ్యాలతోనూ, ఎగుడు దిగుళ్లతోనూ సాగింది. ఈ పరిణామాలకు చాలా వరకూ, భారతీయ సమాజం ఎదుర్కొన్న సంక్లిష్ట చారిత్రక క్రమాలే కారణం. ఆయా చారిత్రక క్రమాలు, మన సమాజంపై తమ ప్రభావాన్ని గట్టిగా ముద్ర వేశాయి. మన సమాజంలో గడ్డకట్టిపోయిన వ్యవస్థలూ, సామాజిక తరగతుల రూపంలో ఈ చారిత్రక క్రమాలు ఇప్పటికీ తమ ప్రాబల్యం ప్రదర్శిస్తూనే వున్నాయి. మన దేశంలో సాగుతున్న ఆధిపత్య (హెజిమానిక్) క్రమంలో ప్రధానమైన అంశాలుగా వీటిని పరిగణించినప్పుడు,

ప్రత్యాధిపత్య (కౌంటర్–హెజిమానిక్) క్రమంలో ప్రధానమైన అంశాలుగా ఈ కొన్ని విషయాలను పరిగణించవలసి వస్తుంది. అవి భిన్న విభిన్న మూలాల నుంచి పుట్టుకొచ్చిన చొరవలతో కూడినవి. స్థానిక స్వభావాలు సంతరించుకున్న వివిధ సాధనాలు ఈ ప్రత్యాధిపత్య (కౌంటర్–హెజిమానిక్) క్రమాల్ని అణువణువునా శోధించడం కద్దు. దళిత ప్రజా శ్రేణులు కుల ప్రాతిపదికపై రూపొందిన వివక్షను కొలిమిలో కాల్చి తుప్పు వదలగొట్టడం అలాంటిదే! భారీ నీటిపారుదల ప్రాజెక్టులకు వ్యతిరేకంగా తలెత్తిన ఉద్యమాలు మన అభివృద్ధి క్రమంలోని అనేక విషయాలను నిగ్గదీయడమూ అలాంటిదే! ఇవి మన ఆధిపత్యక్రమాన్ని సవాలు చేసిన సందర్భాల్లో ప్రధానమైన చొరవలు. పార్టీల రూపంలో సంస్థాగతమైన వామపక్షాలు, ఇలాంటి సందర్భాల్లో, గతితార్కిక సైద్ధాంతిక మంత్ర పఠనం చెయ్యడంలోనే కూరుకుపోయి అవకాశాలు జారవిడుచుకున్న సంగతి అందరికీ తెలిసిందే!!

సిద్ధాంత అధ్యయనానికీ, ఆచరణకూ సంబంధించి గ్రాంస్కీ చెప్పిన కీలకమైన అంశం ఒకటుంది. ప్రజాశ్రేణుల సమష్టి చింతన–జీవనక్రమాల్లోకి గతితార్కికతను లోతుగా పాతుకు పోయేలా చేయడమనేది, ఆయన అవగాహనలోని కీలకమైన అంశం. ప్రస్తుతం కమ్యూనిస్టు పార్టీల్లో అమల్లో ఉన్న పద్ధతులకు ఇది పూర్తి విరుద్ధంగా ఉన్న అవగాహన. మార్క్సిస్టు గతితర్కాన్ని ఇతరుల బుర్రల్లోకి రవాణా చెయ్యగలమనే, పార్టీ సభ్యుల మనసులకు దాన్ని అంటుకట్టి పూయించి–కాయించగలమనే "అవగాహన" నుంచి పుట్టిన పద్ధతి ఇది. సామాన్య శ్రేణుల మేధోమథనాల పట్ల వామపక్షాల నేతల నిర్లక్ష్య ధోరణికి –లేదా, శ్రేణుల పట్ల నాయకమ్మన్యుల దుగ్ధకు–నిదర్శనం ఈ అవగాహన. పార్టీ నాయకత్వ స్థానాలను ఆక్రమించుకుని కూర్చున్న నేతల అధికారస్వామ్యం ప్రజా శ్రేణుల నుంచి పుట్టుకు రావలసిన, వ్యక్తం కావలసిన ప్రత్యాధిపత్య (కౌంటర్–హెజిమానిక్) క్రమాలకు అడ్డంకిగా మారుతుంది. ఫలితంగా, ప్రత్యాధిపత్య (కౌంటర్–హెజిమానిక్) క్రమాలలో అత్యధికం, వామపక్షాల సంస్థాగత నిర్మాణాలకు వెలుపలగా–కొన్ని సందర్భాల్లో ఎదుటి పక్షాల నుంచి – వ్యక్తమవుతూ ఉంటాయి.

ప్రపంచీకరణ క్రమం సందర్భంగా ప్రత్యాధిపత్య (కౌంటర్–హెజిమానిక్) క్రమాలకు బలమైన సవాళ్ళు ఎదురయ్యాయి. పెట్టుబడి విస్తరణ రూపాలన్నింటిలోకి విపరీతమైన దూకుడు స్వభావం కలిగినది ప్రపంచీకరణ. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక జీవన రంగాలన్నింటా పెట్టుబడి పాకిపోవడానికి ఉద్దేశించిన రూపమిది. ఆయా సమాజాల్లో చారిత్రకంగా అభివృద్ధి చెందిన మార్కెట్ నమూనాను విశ్వజనీనం చేయడమే ప్రపంచీకరణ లక్ష్యం. వాణిజ్యానికి పనికి రావడమన్నది మాత్రమే ఏకైక విలువగానూ, సుగుణంగానూ ప్రచారం చేస్తుంది ప్రపంచీకరణ. ఈ క్రమం స్పృశించని మానవ జీవన కోణం గానీ, అంశం గానీ ఏదీ వుండదు. ప్రపంచీకరణకు ప్రత్యామ్నాయం లేదు అని చాటించే Tina(టినా) అనే నినాదం ఈ నమూనా తాలూకు ఆత్మ విశ్వాసానికీ, అతిశయానికీ రుజువు.

అంతర్జాతీయస్థాయిలో పెట్టుబడి సమీకరణకు అనుకూలంగా ఇంత బలమైన వాదం వినిపిస్తున్నప్పుడు, ప్రపంచీకరణ పట్ల వ్యక్తమయ్యే నిరసనను సైతం తానే నియంత్రించాలని ప్రపంచ పెట్టుబడి ప్రయత్నించడం సహజం. ఫలితంగా, బహుళ అస్తిత్వాల వైవిధ్యం, వైరుధ్యం వెయ్యిరేకులతో విచ్చుకోవడమూ సహజమే! ఈ పరిస్థితినే ఇలా కూడా చెప్పుకోవచ్చు– లాభాల వేటలో ప్రపంచ పెట్టుబడి ఐక్యంగా ముందడుగు వేస్తుంది. ప్రయోజనాలూ, పద్ధతులూ, అస్తిత్వాల ప్రాతిపదికపై కార్మిక ప్రజా శ్రేణులు వేరు వేరు దారుల్లో చీలికలై వున్నారు. ఈ నేపథ్యంలో, వర్తమాన సమస్యలూ, విభేదాల పరిష్కారాన్ని సాధించేందుకు గ్రాంస్కీ అవగాహనను అధ్యయనం చెయ్యడం ప్రయోజనకరం కాగలదు. విస్తృత దృక్పథ సాధన ఆవశ్యకతను వైలి పెట్టి తక్షణ అంకుచిత ప్రయోజనాల సాధనకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చే పోస్ట్మాడర్న్ మేధావులు గ్రాంస్కీకి ప్రాచుర్యం కల్పిస్తున్న దశలో ఇది మరింత ప్రయోజనకరం అవుతుంది. మరీ ముఖ్యంగా, ప్రపంచ పెట్టుబడికి వ్యతిరేకంగా వ్యూహ నిర్దేశకత్వాన్నీ, రాజకీయ సమీకరణనూ సాధించే లక్ష్యంతో ఇది కచ్చితంగా ఎంతో ప్రయోజనకరం కాగలదు. ❑


**ఉపయుక్త గ్రంథాలు**


1. సెలెక్షన్స్ ఫ్రం పొలిటికల్ రైటింగ్స్ (1910–20) లారెన్స్ అండ్ విషార్ట్ ప్రచురణ, లండన్ (ఫ్యాక్టరీ కౌన్సిళ్ల గురించి గ్రాంస్కీ రాసిన వ్యాసాలు), గ్రాంస్కీ ఒంటోనియో (1971, సెలక్షన్ ఫ్రమ్ ప్రిజన్ నోట్స్, లారెన్స్ అండ్ విషార్ట్ ప్రచురణ, లండన్.

2. Sudipta Kaviraj and Sunil Khilnani సివిల్ సొసైటీ – హిస్టరీ అండ్ పాజిబిలిటీస్–ఫౌండేషన్ బుక్స్, ఢిల్లీ, 2002.


3. Mouffe Chantal గ్రాంస్కీ అండ్ మార్క్సిస్ట్ థియరీ– లండన్, ఆర్.కే.పీ. 1979 గ్రంథంలో గ్రాంస్కీని మార్క్స్‌తో ముడిపెట్టే విషయం గురించి వివరిస్తూ బాబియో చేసిన వ్యాఖ్య చూడండి.


4. ఆధిపత్య–ప్రత్యాధిపత్య రాజకీయ సంబంధాల గురించి చెప్పేటప్పుడు గ్రాంస్కీ మిలిటరీ పరిభాషను ఉపయోగించడం కొట్టొచ్చినట్టు కనిపించే విశేషం. రాజకీయ–భావజాల రంగాల్లోనూ, సాంస్కృతిక–మేధో రంగాల్లోనూ ఆధిపత్య–ప్రత్యాధిపత్యాల మధ్య జరిగే పోరాటం పౌరసమాజంలోనే కేంద్రీకృతమై వుంటుందని గ్రాంస్కీ భావించాడు.




ఎప్పుడో ఒకప్పుడు..

నమ్మితే.. మునిగినట్టే








మోదీ గొప్పతనం

కార్టూన్స్ : సతీష్ ఆచార్య

**RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)**


Vol : 3 - Issue No : 6 March 2025








## కొత్త పుస్తకాల స్వీకారం




if undeliverd please return to:
**B.Ramesh Chandra Babu**
34-15-1, Doddipatla Vaari Thota
Veedhi, Tanuku - 534 211
West Godavari, Ap
Phone No : 93971 14495

Printed Matter - Book Post

To :

Printer, Publisher and Owner Bhupatiraju Ramesh Chandrababu, Published from 34-15-1, Doddipatla Vaari Thota Veedhi, Tanuku - 534 211, AP. Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, 520 004. Editor : DVVS Varma.